



మన రాష్ట్రం మన పత్రిక

# నమస్తే తెలంగాణ

NAMASTE TELANGANA






బుధవారం WEDNESDAY 3.9.2025 | హైదరాబాద్ HYDERABAD | పేజీలు: 12+4+ 8పేజీల నిపుణ ప్రత్యేక అనుబంధం Pages: 12+4+ 8 Pages NIPUNA Special Supplement | సంపుటి (Volume): 15 ‖ సంచిక (Issue): 89 ‖ వెల (Price) రూ.6.50

ఏకాదశి

బుధవారం, సూర్యోదయం: 6-02, సూర్యాస్తమయం: 6-28. శ్రీ విశ్వావసు నామ సంవత్సరం దక్షిణాయనం వర్ష రుతువు భాద్రపద మాసం శుక్ల పక్షం తిథి: ఏకాదశి తెల్లవారుజామున 4-23 వరకు. నక్షత్రం: పూర్వాషాఢ రాత్రి 11-09 వరకు. వర్జ్యం: ఉదయం 7-56 నుంచి ఉదయం 9-36 వరకు. రాహుకాలం: పగలు 12-15 నుంచి పగలు 1-48 వరకు. దుర్ముహూర్తం: ఉదయం 11-50 నుంచి పగలు 12-40 వరకు. అమృతకాలం: సాయంత్రం 6-04 నుంచి రాత్రి 7-45 వరకు.

PUBLISHED FROM HYDERABAD • KARIMNAGAR • WARANGAL • KHAMMAM • NALGONDA • MAHABUBNAGAR • NIZAMABAD

www.ntnews.com /ntdailyonline






**నీళ్లకు జేజేలు.. నిందలపై నిప్పులు**

నీళ్లిచ్చిన కాళేశ్వరంపై కాంగ్రెస్ నేతల నిరాధార ఆరోపణలు, నిందలను నిరసిస్తూ రాష్ట్రవ్యాప్తంగా బీఆర్ఎస్ కార్యకర్తలు, రైతులు రోడ్డెక్కారు. రాజకీయ కక్షతో సీబీఐ దర్యాప్తు కోరిన సర్కారుపై భగ్గుమన్నారు. యాదగిరిగుట్టలో సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేశారు. కాళేశ్వరం తెచ్చి పోసిన గోదావరి జలాలతో నిండుకుండలా ఉన్న సిద్దిపేట జిల్లా రంగనాయకసాగర్ వద్ద 'ఇది కాదా కాళేశ్వరం... ఇదే కదా కాళేశ్వరం' అనే పేరుతో 100 మీటర్ల బ్యానర్‌ను ప్రదర్శించారు. › 4

## ఘోష్ నివేదిక ఆధారంగా..

# సీబీఐ దర్యాప్తు చేయొద్దు

- కమిషన్ రిపోర్టుపై చర్యల అమలును ఆపండి
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు మధ్యంతర ఉత్తర్వులు
- ఎన్డీఎస్ఏ నివేదిక ఆధారంగానే సీబీఐ దర్యాప్తు
- న్యాయస్థానానికి వెల్లడించిన అడ్వకేట్ జనరల్
- పిటిషనర్ల ప్రతిష్ఠకు భంగం వాటిల్లబోదన్న మీ హామీకి భిన్నంగా జరిగితే కోర్టు పరిధిలోకి వస్తుంది
- రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ధర్మాసనం హెచ్చరిక
- కేసీఆర్, హరీశ్ పిటిషన్లపై వాడివేడిగా వాదనలు
- తదుపరి విచారణ అక్టోబర్ 7కు వాయిదా



**కాళేశ్వరం ప్రాజెక్టు వ్యవహారంపై సుప్రీంకోర్టు రిటైర్డ్ న్యాయమూర్తి జస్టిస్ పీసీ ఘోష్ నేతృత్వంలో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఏకసభ్య కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా మాజీ సీఎం కేసీఆర్, మాజీ మంత్రి టీ హరీశ్‌రావుపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని రాష్ట్ర ప్రభుత్వానికి హైకోర్టు ఆదేశాలు జారీ చేసింది. జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ నివేదిక ఆధారంగా కేంద్ర సంస్థ సీబీఐ కూడా దర్యాప్తు చేయరాదని మధ్యంతర ఉత్తర్వులు జారీచేసింది. ఈలోగా ప్రభుత్వం తమ వాదనలతో కౌంటర్ పిటిషన్లు దాఖలు చేయాలని నోటీసులు ఇచ్చింది. తదుపరి విచారణను అక్టోబర్ 7వ తేదీకి వాయిదా వేసింది.**

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ):జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదిక అమలును నిలిపివేయాలంటూ మాజీ ముఖ్యమంత్రి, బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు, నీటిపారుదల శాఖ మాజీ మంత్రి, ఆ పార్టీ ఎమ్మెల్యే టీ హరీశ్‌రావు వేర్వేరుగా దాఖలు చేసిన అనుబంధ పిటిషన్లపై హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ అపరేశ్‌కుమార్‌సింగ్, జస్టిస్ జీఎం మొహియుద్దీన్‌తో కూడిన ద్విసభ్య ధర్మాసనం మంగళవారం విచారణ జరిపింది. కాళేశ్వరం ఎత్తిపోతల పథకంలో అంతర్భాగమైన మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బరాజ్‌లపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ సమర్పించిన నివేదికపై ఏం చేయబోయేదీ తెలియజేయాలని హైకోర్టు సోమవారం రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిన విషయం విదితమే. మంగళవారం జరిగిన విచారణలో అడ్వకేట్ జనరల్ ఏ సుదర్శన్‌రెడ్డి స్పందిస్తూ, కాళేశ్వరంపై ఘోష్ కమిషన్ ఇచ్చిన నివేదిక ఆధారంగా పిటిషనర్లపై చర్యలు ఉండబోవని హామీ ఇచ్చారు. ఈ వ్యవహారంపై ›2వ పేజీలో



## ప్రాణహిత గ్రావిటీ ఉత్త గారడీ

- తమ్మిడిహట్టి నుంచి ప్రాణహిత నీటి తరలింపు కష్టమే
- తమ్మిడిహట్టి -ఎల్లంపల్లి మధ్య 2 లిఫ్టులు అవసరం
- మొత్తంగా 48 మీటర్ల ఎత్తుకు ఎత్తిపోయాల్సిందే
- తమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మాణమూ కష్టమే!
- 6.4 కి.మీ పొడువుతో నిర్మాణం, నిర్వహణ భారం
- ప్రతికూల పరిస్థితులు, సాంకేతిక సవాళ్లు అనేకం
- అక్కడ పర్యావరణ అనుమతులూ కష్టసాధ్యం
- ఎస్ఎల్‌బీసీ ప్రాజెక్టే ఇందుకు సజీవసాక్ష్యం › 2



## నేను కొంచెం జరిగితే.. కుర్చీలో కూర్చొనేటోళ్లు రెడీగా ఉన్నరు!

- 'నేనే నడుపుతలే.. జరుగు' అనేవాళ్లు సిద్ధంగా ఉన్నరు
- సీఎం కుర్చీపై రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు
- 'తమ్మిడిహట్టి'ని కట్టి తీరుతామన్న ముఖ్యమంత్రి
- ఎరువుల వాడకాన్ని తగ్గించాలని పిలుపు › 11

## బీఆర్ఎస్ నుంచి కవిత సస్పెన్షన్

- పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్నందుకు చర్య
- నిర్ణయం తీసుకున్న బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) బీఆర్ఎస్ పార్టీ నుంచి ఎమ్మెల్సీ కవితను సస్పెండ్ చేస్తూ పార్టీ అధ్యక్షుడు కే చంద్రశేఖర్‌రావు నిర్ణయం తీసుకున్నారు. కవిత కొంతకాలంగా ప్రవర్తిస్తున్న తీరుతెన్నులు, ఆమె కొనసాగిస్తున్న పార్టీ వ్యతిరేక కార్యకలాపాల నేపథ్యంలోనే పార్టీ అధ్యక్షుడు ఈ నిర్ణయం తీసుకున్నట్టు పార్టీ క్రమశిక్షణ వ్యవహారాల బాధ్యులు సోమ భరత్‌కుమార్, పార్టీ ప్రధాన కార్యదర్శి టీ రవీందర్‌రావు వెల్లడించారు. ఈమేరకు వారు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. ఇటీవల కవిత ప్రవర్తన, కార్యకలాపాలు బీఆర్ఎస్ పార్టీకి నష్టం కలిగించే రీతిలో ఉన్నందున అధిష్ఠానం ఆమెను పార్టీ నుంచి సస్పెండ్ చేయాలని నిర్ణయించిందని పేర్కొన్నారు. సస్పెన్షన్ తక్షణమే అమలులోకి వస్తుందని తెలిపారు.



*మీడియా సమావేశంలో సత్యవతి, మాలోత్‌కవిత, గొంగిడి సునీత*

### బిడ్డ కన్నా పార్టీనే ముఖ్యం

- కేసీఆర్‌కు ప్రజలే కుటుంబం.. మరోసారి రుజువైంది
- కేటీఆర్, హరీశ్‌రావు ఇద్దరూ ఆయనకు రెండు భుజాలు
- పార్టీ ఉంటే ఎంత, పోతే ఎంత అని మాట్లాడొచ్చా? › 8
- కవిత సస్పెన్షన్‌ను స్వాగతించిన సత్యవతి, మహిళా నేతలు



### మూడ్రోజులు భారీ వర్షాలు

- బంగాళాఖాతంలో మరో అల్పపీడనం › 3
- నేడు తీరం దాటే అవకాశం

### జడ్జితో బీజేపీ ఎమ్మెల్యే బేరాలు

- ఓ కేసులో ప్రలోభ పెట్టేందుకు యత్నాలు
- బండారం బయటపెట్టిన న్యాయమూర్తి
- కేసును విచారించబోనని బహిరంగ ప్రకటన › 7
- మధ్యప్రదేశ్‌లో సంచలనం

## మోదీ చేతికి.. రేవంత్ అధికారం!

- కావాలనే కేంద్రానికి దర్యాప్తు అధికారాలను అప్పగిస్తున్న రేవంత్
- మొన్న గొర్రెల పంపిణీ పథకం.. నేడు కాళేశ్వరం!




- రాష్ట్ర పోలీసులతో కాకుండా కేంద్ర ఏజెన్సీలతో విచారణ
- హోంశాఖ తానే చూస్తున్నా పోలీసులపై నమ్మకం లేదా?
- సీఎం రేవంత్ నిర్ణయంపై కాంగ్రెస్ నేతల్లో విస్మయం
- అన్నీ కేంద్రానికిస్తే.. రాష్ట్ర ప్రభుత్వం ఎందుకనే ప్రశ్నలు
- బీఆర్ఎస్, కేసీఆర్, హరీశ్‌ను బద్నాం చేసేందుకే సీబీఐ దర్యాప్తునకు అప్పగిస్తున్నారంటూ విమర్శలు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తన అధికారాలను ప్రధాని మోదీ చేతికి అందిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. రాష్ట్రంలో జరుగుతున్న వరుస పరిణామాలు మోదీ, రేవంత్ బంధాన్ని వెల్లడిస్తున్నాయని రాజకీయ వర్గాల్లో చర్చ సాగుతున్నది. రాష్ట్ర ప్రభుత్వ పరిధిలో చేపట్టాల్సిన విచారణలను కావాలనే కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని సంస్థలకు అప్పగిస్తుండటం పలు అనుమానాలకు తావిస్తున్నది. ఇప్పటికే గొర్రెల పంపిణీ పథకంపై అనుమానాలతో తొలుత విజిలెన్స్ విచారణ వేసిన రేవంత్ ప్రభుత్వం.. ఆ తర్వాత కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎన్‌ఫోర్స్‌మెంట్ డైరెక్టరేట్ (ఈడీ) ఎంటర్ అయ్యేందుకు అవకాశం ఇచ్చింది. తాజాగా కాళేశ్వరంపై విచారణను సీబీఐకి అప్పగిస్తూ నిర్ణయం తీసుకున్నది. ఈవిధంగా రాష్ట్రంలో జరుగుతున్న పరిణామాలను కేంద్ర ప్రభుత్వ విచారణ సంస్థలకు అప్పగించడంపై కాంగ్రెస్ పార్టీలోనే భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దీనిపై సొంత పార్టీ నేతలే అసంతృప్తి వ్యక్తంచేస్తున్నారు. రాష్ట్ర వ్యవహారాల్లో కేంద్రాన్ని ఇన్వాల్వ్ చేయడమంటే... రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందనే అనుమానాలు వ్యక్తమవుతాయని అంటున్నారు. ముఖ్యంగా ›3వ పేజీలో

## కాళేశ్వరం కోసమే గేట్లు ఓపెన్

**సీబీఐకి అనుమతి.. ఒక్క కేసులోనే!**

- నిషేధం సడలిస్తూ ఉత్తర్వులు జారీ చేసిన రాష్ట్ర ప్రభుత్వం
- జీవో-51ని సవరించి జీవో-104 ద్వారా అనుమతి
- మిగతా విషయాల్లో రాష్ట్రంలోకి సీబీఐ ప్రవేశంపై నిషేధం
- ఒత్తిడి ఉంటేనే కాళేశ్వరంపై దర్యాప్తు చేపట్టే అవకాశం!
- ఒకవేళ స్వీకరిస్తే మోదీ-రేవంత్ బంధం బయటపడ్డట్టే!!

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలోకి సీబీఐ రాకుండా మూడేండ్లు ఉన్న నిషేధాన్ని కాంగ్రెస్ ప్రభుత్వం ఎత్తివేసింది. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ జేబు సంస్థగా మారిన సీబీఐని రాష్ట్రంలోకి రాకుండా కేసీఆర్ ప్రభుత్వం అడ్డుకున్నది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చినా ఇప్పటివరకు ఆ నిషేధాన్ని కొనసాగించింది. కానీ.. కేసీఆర్‌పై బురద చల్లాలనే ఏకైక లక్ష్యంతో సీఎం రేవంత్‌రెడ్డి ఆ ఉత్తర్వులను సవరిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీచేశారు. కాళేశ్వరం ›3వ పేజీలో

### కాళేశ్వరంపై సీబీఐతో దర్యాప్తు చేయండి

- కేంద్ర హోంశాఖకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ
- ఎన్డీఎస్ఏ నివేదిక ఆధారంగానే దర్యాప్తునకు సిఫారసు.. నోటిఫికేషన్ విడుదల › 3

## పీఆర్సీ ప్రకటన లేదు.. సీపీఎస్ ఊసేలేదు!

- సర్కారుతో చర్చల్లో ప్రస్తావనకు రాని కరువు భత్యం
- నెలకు రూ.700కోట్ల చొప్పున పెండింగ్ బిల్లుల క్లియర్
- త్వరలో హెల్త్‌కార్డుల మంజూరుకు విధివిధానాలు
- హామీలపై రాష్ట్ర ప్రభుత్వం రాసిస్తేనే నమ్ముతాం
- ఉద్యోగ జేఏసీ స్పష్టీకరణ.. కార్యాచరణ వాయిదా

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఉద్యోగులు ఆశగా ఎదురుచూస్తున్న పీఆర్సీపై ఎలాంటి ప్రకటన లేకుండా.. సీపీఎస్ రద్దు ఊసేలేకుండా ప్రభుత్వం ఉద్యోగ సంఘాల జేఏసీతో చర్చలను ముగించింది. మొదటి దఫా చర్చల్లో అత్యంత కీలకమైన ఈ రెండు డిమాండ్లపై సర్కారు స్పష్టతనివ్వలేదు. చిన్నాచితకా డిమాండ్లను పరిష్కరించేందుకు మాత్రమే తలూపింది. డిమాండ్ల సాధనకు ఉద్యోగుల జేఏసీ రాష్ట్రవ్యాప్తంగా బస్సుయాత్ర, చలో హైదరాబాద్‌కు పిలుపునిచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం వారిని ›8వ పేజీలో





**యూరియా సంక్షోభం.. మరింత జటిలం**



*రాజన్న సిరిసిల్ల జిల్లా గంభీరావుపేటలో యూరియా కోసం నిలబడి, క్యూలోనే సొమ్మసిల్లిన రైతు పెండెల మల్లయ్య* › 5

ఒకవైపు అదును దాటుతుండటం, మరోవైపు యూరియా దొరకకపోవడం రైతాంగాన్ని తీవ్ర ఆందోళనకు గురిచేస్తున్నది. మొన్నటివరకు ఓపిగ్గా బస్తా కోసం బారులు తీరిన రైతుల్లో ఆగ్రహం కట్టలు తెంచుకుంటున్నది. కడుపుమండిన రైతులు రోడ్డెక్కుతున్నారు. మంగళవారం ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎక్కడ చూసినా ఎరువుల కోసం రైతుల బారులే కనిపించాయి. యూరియా కూపన్ కోసం వేలమంది తరలివచ్చి లైన్‌కట్టడంతో మహబూబాబాద్ జిల్లా మరిపెడ ఐటీడీఏ భవనం ప్రాంగణం ఇలా కిటకిటలాడింది.

# ప్రాణహిత గ్రావిటీ.. ఉత్త గారడీ!

## తమ్మిడిహట్టి నుంచి నీటి తరలింపు కష్టసాధ్యం • ఎత్తిపోతలు లేకుండా ఎల్లంపల్లికి నీళ్లు అసాధ్యం

- తమ్మిడిహట్టి -ఎల్లంపల్లి మధ్య రెండు ఎత్తిపోతలు అవసరం
- 74వ కిలోమీటర్ వద్ద ఒకటి.. 92వ కిలోమీటర్ వద్ద మరొకటి
- మొత్తంగా 48 మీటర్ల ఎత్తుకు నీటిని ఎత్తిపోయాల్సిందే
- తమ్మిడిహట్టి వద్ద బరాజ్ కష్టమే
- 6.4 కిలోమీటర్ పొడవుతో నిర్మాణం, నిర్వహణ భారమే
- ఎస్ఎల్బీసీ ప్రాజెక్టే ఇందుకు సాక్ష్యం



హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): 'ప్రాణహితపై తమ్మిడిహట్టి వద్ద బరాజ్ కడితే గ్రావిటీ ద్వారా నీళ్లొచ్చేవి. కరెంటు భారం ఉండకపోయేది' ఇదీ కాంగ్రెస్ పాలకులు, కొందరు కుహనా మేధావులు చెప్తున్న మాట! తాజాగా మంగళవారం హైదరాబాద్‌లో నిర్వహించిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మెమోరియల్ అవార్డు కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి మాట్లాడుతూ 'తమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టును కడతాం. రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల, కొడంగల్, పరిగి, తాండూర్ ప్రాంతాలకు గోదావరి జలాలను తరలిస్తాం' అని సెలవిచ్చారు. ఈ మాటలన్నీ వట్టి అబద్ధాలేనని నీటిరంగ నిపుణులు కొట్టిపారేస్తున్నారు. ప్రాణహిత నుంచి ఎల్లంపల్లికి నీటిని తరలించాలంటే మధ్యలో రెండు చోట్ల ఎత్తిపోతలు తప్పనిసరి అని, ఇక తమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మాణం సాంకేతికంగా అసాధ్యమని ఇంజినీర్లు తేల్చిచెప్తున్నారు. దాదాపు 6.4 కి.మీ పొడవుతో బరాజ్ కట్టాల్సి ఉండటం ఒకెత్తయితే.. భౌగోళికంగా, సాంకేతికంగా అనేక సవాళ్లు ఎదురవుతాయని, చాత్రాల్ అభయారణ్యం అనుమతులు కూడా పెద్ద అడ్డంకిగా మారుతాయని, ఇందుకు ప్రస్తుత ఎస్ఎల్బీసీయే సజీవసాక్ష్యమని స్పష్టంచేస్తున్నారు. ఈ నేపథ్యంలోనే ప్రాజెక్టును రీడిజైన్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. వాటన్నింటినీ దాచిపెట్టి కాంగ్రెస్ పదే పదే అబద్ధాలు వల్లిస్తున్నది.

### గ్రావిటీ కాదు.. లిఫ్ట్‌ల ద్వారానే

తమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లి వరకు 116 కిలోమీటర్లు ఉంటుంది. నీళ్ల తరలింపు పనులను మొత్తంగా 5 ప్యాకేజీలుగా విభజించారు. ప్యాకేజీ 3 అనేది పూర్తిగా బరాజ్ నిర్మాణం. ఇక ప్యాకేజీ 1 అంటే 0–15 కి.మీ. కాలువ, ప్యాకేజీ 2లో 15–28.5 కి.మీ. కాలువ, ప్యాకేజీ 4లో 28.5 నుంచి 71.5 కి.మీటర్లు మైలారం వరకు కాంక్రీట్ లైనింగ్ లేని కాలువ తవ్వకం పనులు. ఇక అత్యంత కీలకమైంది ప్యాకేజీ 5 పనులు. ఇందులో మొత్తంలో 44.50 కి.మీ. నీటి సరఫరా వ్యవస్థను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అందులో భాగంగా 74వ కి.మీ. పాయింట్ వద్ద ఒక పంప్‌హౌస్ ఏర్పాటు చేయాలి. 30 మెగావాట్ల సామర్థ్యం కలిగిన 12 పంపులతో నీటిని 29 మీటర్లు ఎత్తిపోయాలి. అక్కడి నుంచి 2 కి.మీ. వరకు 3.60 డయా ఎంఎస్‌పీ పైపుల ద్వారా నీటిని 10 మీ. డయా కలిగిన 9 కి.మీ. పొడవైన 2 టన్నెళ్లలోకి తరలిస్తారు. మళ్లీ 92వ కి.మీ. పాయింట్ వద్ద పంపింగ్ స్టేషన్–2ను ఏర్పాటు చేయాల్సి ఉంటుంది. అక్కడి నుంచి నీళ్లను మళ్లీ 19 మీటర్లు ఎత్తిపోయాలి. 92వ కి.మీ. నుంచి 101వ కి.మీ. వరకు గ్రావిటీ ద్వారా జలాలు తరలిస్తారు. 101వ కి.మీ. పాయింట్ వద్ద రాళ్లవాగుపై బరాజ్ నిర్మించి నీళ్లను తరలిస్తారు. రాళ్ల వాగు నుంచి నీళ్లు ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు చేరుతాయి. ఇదీ తమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లి వరకు నీటి సరఫరా తీరు. మొత్తంగా రెండు లిఫ్ట్‌ల ద్వారా దాదాపు 48 మీటర్ల మేరకు జలాలను ఎత్తిపోయాలి. అప్పుడుగాని ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు ప్రాణహిత జలాలు చేరుకోవు. అయినా గ్రావిటీ ద్వారా వస్తాయంటూ ప్రచారం చేస్తూ ప్రజలను తప్పుదారి పట్టిస్తున్నారు. రీడిజైన్ చేయడం వల్ల అదనంగా పెరిగింది ఒక పంపింగ్ స్టేషన్ మాత్రమే తప్ప ఏమీ లేదు. ఇదిలా ఉంటే ప్యాకేజీ 5 పనులకు మొత్తంగా రూ.3,626 కోట్లకు అంచనా వేయగా, ఆపై ఆ మొత్తాన్ని రూ.5,356 కోట్లకు సవరించారు. బరాజ్ నిర్మాణం చేపట్టకుండానే ప్యాకేజీ 5లో పంపింగ్ స్టేషన్ల నిర్మాణానికి సంబంధించి పైపులను, ఎలక్ట్రిక్ మెకానికల్ సామగ్రిని కొనుగోలు చేశారు. దాదాపు 891 కోట్లను కాంగ్రెస్ ఖర్చు చేసింది. 71 కి.మీ. మట్టి కాలువలు తవ్వి జేబులు నింపుకొన్నారు. లిఫ్ట్‌లు ఉన్నాయనే విషయాన్నే దాచి కాంగ్రెస్ మాత్రం గ్రావిటీ ద్వారా నీళ్లు వచ్చేవంటూ ప్రజలను మభ్యపెడుతున్నది. ఇప్పటికీ అదే అబద్ధాలు చెప్తున్నది.

### నీటి తరలింపు అంతంతే

బరాజ్ నిర్మాణం, లిఫ్ట్‌ల విషయం పక్కనపెడితే తవ్విన కాలువలు సైతం తెలంగాణ అవసరాల మేరకు నీటిని తరలించలేని పరిస్థితే ఉంటుంది. తమ్మిడిహట్టి వద్ద 152 మీటర్ల ఎఫ్ఆర్ఎల్‌తో బరాజ్ నిర్మాణానికి కాంగ్రెస్ ప్రణాళిక సిద్ధం చేసింది. బరాజ్ ఎఫ్ఆర్ఎల్‌పై మహారాష్ట్రతో ఎలాంటి ఒప్పందం చేసుకోలేదు. కానీ ఏకపక్షంగా 152 మీటర్ల ఎఫ్ఆర్ఎల్‌తో బరాజ్ నిర్మాణానికి అనుగుణంగా కాలువలను డిజైన్ చేసింది. 145.45 మీటర్ల వద్ద సిల్ లెవల్ మినిమం డ్రాడౌన్ లెవల్ (ఎండీడీఎల్)ను ఖరారు చేసింది. దాదాపు 6.55 మీటర్ల వాటర్ హెడ్ ఉంటుంది. ఆ మేరకు నీటి తరలింపు కాలువలను 75 మీటర్ల వెడల్పు, 12 మీటర్ల లోతుతో తవ్వాలని డిజైన్ చేసింది. తమ్మిడిహట్టి నుంచి ఎల్లంపల్లి రిజర్వాయర్‌కు వరకు ప్యాకేజీ 1, 2, 4కు సంబంధించి మొత్తంగా 71 కి.మీ. పొడవుతో అన్‌లైన్డ్ కెనాల్ తవ్వకాన్ని పూర్తి చేశారు. ప్రస్తుతం బరాజ్ ఎత్తు 148 మీటర్లకు కుదించడం వల్ల ఆ మేరకు 2.55 మీటర్ల మేరకు వాటర్ హెడ్ తగ్గిపోతుంది. నీటి సరఫరా వేగం కూడా పూర్తిగా తగ్గుతుంది. డైవర్షన్ సామర్థ్యం తగ్గిపోతుంది. ఆ హెడ్‌తో 150 రోజుల పాటు నిరాటంకంగా నీటిని మళ్లించుకున్నా గరిష్ఠంగా 66 టీఎంసీలు, కనిష్ఠంగా 44 టీఎంసీలకు మించి వినియోగించుకోలేని దుస్థితి. పీసీఎస్ఎస్ ప్రాజెక్టు ఆయకట్టుకే ఇంకా దాదాపు 100 టీఎంసీల లోటు ఏర్పడుతుంది. దీంతో కాలువ ద్వారా నీటిని మళ్లించడం సవాళ్లతో కూడుకున్నదేనని ఇంజినీర్లు చెప్తున్నారు. నీటిని తరలించాలంటే కాలువలో అదనంగా అనేకంగా క్రాస్ రెగ్యులేటర్లను నిర్మించాల్సి ఉంటుందని తెలుస్తున్నది. ఈ కారణాల రీత్యా ప్రాజెక్టును చేపట్టడం అసాధ్యమని నాడే కాదు ఇప్పటికీ ఇంజినీర్లు కుండబద్ధలు కొట్టి మరీ స్పష్టంచేస్తున్నారు. అదీగాక 71 కి.మీ మైలారం దాటిన తర్వాత కాలువ అలైన్‌మెంట్ భూములను కోల్ ఫీల్డ్ కోసం సింగరేణి ఇప్పటికే డిమార్కేషన్ చేసింది. ఇప్పుడు ఈ అంశాన్ని తేల్చాల్సి ఉన్నది.

### వైల్డ్‌లైఫ్ అనుమతులు కష్టమే..

బరాజ్ నిర్మాణ ప్రాంతంలో చత్రాల్ అభయారణ్యం ఉన్న విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలో ప్రాజెక్టు నిర్మాణానికి అనుమతులు సాధించడం కష్టతరమే. అందుకు ఎస్ఎల్బీసీనే ఇప్పటికీ నిదర్శనంగా నిలుస్తున్నది. ఎస్ఎల్బీసీ టన్నెల్ నిర్మాణ ప్రాంతం కూడా అభయారణ్యంలోనే ఉన్నది. అయితే 1983లో ఎస్ఎల్బీసీ తెరమీదకు రాగా, సుదీర్ఘ కాలం తర్వాత 1994లో కేంద్రం నుంచి అటవీ, పర్యావరణ అనుమతులు వచ్చాయి. కానీ కేంద్రం అక్కడ అనేక కఠిన షరతులు విధించింది. అభయారణ్యంలోకి అడుగుకూడా పెట్టవద్దని తేల్చిచెప్పింది. కేవలం భూమి కింద నుంచి సొరంగం తవ్వుకోవాలని షరతు పెట్టింది. వన్యప్రాణులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా, బెదిరిపోకుండా ఉండాలంటే భూమి ప్రకంపనలు రాకుండా చూసుకోవాలి. ఆ మేరకు భూ ఉపరితలం నుంచి చాలా లోతు నుంచి సొరంగాన్ని తవ్వాలి. అఖరుకు సొరంగం తవ్వడానికి ముందు అధ్యయనం చేయడానికి హెలికాప్టర్ వినియోగిస్తే దాని శబ్దం 50 డెసిబుల్స్ దాటకూడదని నిబంధనలు విధించింది. అంటే వాక్యూమ్ క్లీనర్ ఎంత శబ్దం వస్తుందో అంతకు మించి రాకూడదు. హెలీకాప్టర్ తక్కువ ఎత్తులో ఎగరకూడదు. జియలాజికల్ సర్వేకు అభయారణ్యంలో బోర్ హోల్స్‌కు అనుమతి లేదు. ఇలాంటి అనేక షరతులతో పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ అనుమతులు మంజూరు చేసింది. ఈ నేపథ్యంలోనే దాదాపుగా రెండు దశాబ్దాలుగా సొరంగం పనులు కొనసాగుతూనే ఉండగా, ఇప్పుడు ఏకంగా మూలకుపడ్డాయి. ఇదిలా ఉంటే తమ్మిడిహట్టి వద్ద కూడా బరాజ్ నిర్మాణానికి ఇలాంటి అవాంతరాలే ఎదురయ్యే పరిస్థితి ఉన్నది. కనీసం పర్యావరణ అనుమతుల కోసం నాటి కాంగ్రెస్ కేంద్ర అటవీ పర్యావరణశాఖను కూడా సంప్రదించ లేదు. ఎలాంటి అనుమతులు తీసుకోకుండానే బరాజ్‌ను వదిలిపెట్టి కాలువల పనులు చేపట్టింది.


### ప్రాణహితపై బరాజ్ అసాధ్యం

**ఉమ్మడి** ఏపీ సర్కారు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ప్రాణహిత–చేవెళ్ల సుజల స్రవంతి (పీసీఎస్ఎస్) ప్రాజెక్టును 2007లో ప్రతిపాదించింది. వార్ధా, వేన్‌గంగా నదులు కలిసిన తర్వాత కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా కౌటాల మండలం తమ్మిడిహట్టి వద్ద బరాజ్ నిర్మించాలని నిర్ణయించింది. అందుకు తొలుత రూ.609 కోట్లు ఖర్చవుతుందని అంచనా వేసినా, తర్వాత రూ.1742 కోట్లకు పెంచింది. పీసీఎస్ఎస్ ప్యాకేజీ 3 కింద బరాజ్ పనులను ఓ ఏజెన్సీకి అప్పగించింది. కానీ బరాజ్ ఎఫ్ఆర్ఎల్‌ను రాష్ట్ర ఏర్పాటు నాటికీ నిర్ణయించకపోవడంతో పనులే మొదలు కాలేదు. ప్రతిపాదిత ప్రదేశం వద్ద బరాజ్ నిర్మాణానికి సాంకేతిక అంశాలు సానుకూలంగా లేవని అధికారులు ఆదిలోనే అభ్యంతరం వ్యక్తంచేశారు. బరాజ్ నిర్మించాలంటే నీటి ప్రవాహం 90 డిగ్రీల లంబకోణంలో ఉండాల్సి ఉండగా, తమ్మిడిహట్టి వద్ద పరిస్థితి అందుకు విరుద్ధంగా ఉన్నదని గుర్తించారు. అది కూడా కేవలం 45 డిగ్రీల స్క్యూ షేప్‌లో బరాజ్ నిర్మించాల్సి ఉంటుందని, అది క్షేమదాయకం కాదని, అదీగాక ఇప్పటివరకు ఆ స్క్యూ షేప్‌లో బరాజ్ నిర్మాణానికి డిజైన్లు ఎక్కడా లేవని ఇంజినీరింగ్ నిపుణులు స్పష్టంచేశారు. మొత్తంగా తమ్మిడిహట్టి వద్ద కుడి, ఎడమ మట్టికట్టలను కలుపుకొని సుమారు 6.4 కిలోమీటర్ల బరాజ్ నిర్మించాల్సి ఉంటుంది. అందులో 3.7 కి.మీ పొడవు మేర బరాజ్‌ను కాంక్రీట్ నిర్మాణంతో చేపట్టాల్సి ఉంటుంది. అదీగాక 100 నుంచి 110 గేట్లను ఏర్పాటు చేయాల్సి ఉంటుందని అంచనా. మొత్తం బరాజ్ నిర్మాణం ఒకెత్తయితే నిర్వహణ ఇంకా భారమని ఇంజినీర్లు అభిప్రాయం వ్యక్తంచేశారు.

### 2008లో పనుల అప్పగింత.. 2010లో డీపీఆర్

**ప్రాణహిత–చేవెళ్ల** ప్రాజెక్టు ద్వారా 12.20 లక్షల ఎకరాలకు నీళ్లందించేందుకు 2007లో రూ.17,875 కోట్లతో అడ్మినిస్ట్రేటివ్ అనుమతులు మంజూరు చేశారు. ఆ తర్వాత అదనంగా నల్లగొండలో 67500 ఎకరాలను, ఉమ్మడి రంగారెడ్డిలో 1.50 లక్షల ఎకరాలు, ఎల్లంపల్లి స్టేజ్–2, 3 కలిపి 1.24 లక్షల ఎకరాలను కలిపారు. మొత్తంగా ప్రాజెక్టు ఆయకట్టు ప్రతిపాదిత ఆయకట్టు కంటే అదనంగా 34 శాతం పెరగగా, ప్రాజెక్టు అంచనా వ్యయాన్ని 115 శాతం పెంచారు. రూ.17,875 కోట్ల నుంచి రూ.38,500 కోట్లకు పెంచారు. ప్రాజెక్టు డీపీఆర్‌ను 2010లో సీడబ్ల్యూసీకి సమర్పించారు. కానీ అంతకంటే ముందే 2008 మే నుంచి 2009 మే మధ్యలోనే ప్రాజెక్టు పనులను ఏజెన్సీలకు అప్పగించారు. 4 ఏండ్లలో పనులు పూర్తి చేయాలనే నిబంధనలతో పనులు కట్టబెట్టి ఆ తర్వాత 8 ఏండ్లకు రీషెడ్యూల్ చేశారు. అయినా పనులు పూర్తిచేయలేదు. ఇక ప్రాణహిత–చేవెళ్ల ప్రాజెక్టుకు సంబంధించి సర్వే కాంపోనెంట్స్ కోసం పనుల చెల్లింపు బిల్లుల్లో తొలుత 0.43 నుంచి 0.50 శాతం మేరకు ఇవ్వాలని నిర్ణయించారు. కానీ తర్వాత ఆ మొత్తాన్ని ఏకంగా 2 నుంచి 3.50 శాతానికి సవరించారు. వాస్తవంగా ప్రాజెక్టు వ్యయంలో సర్వే కాంపోనెంట్ల కోసం మొత్తంగా రూ.172.12కోట్లు చెల్లించాల్సి ఉండగా, దాన్ని అసాధారణంగా రూ.1211.23కోట్లకు పెంచారు. ఇలా చెప్పుకుంటే పోతే కాంగ్రెస్ పెట్టిన కుంపట్లు అన్నీఇన్నీ కావు.

## లోకం పోకడ




బస్సులు పట్టాలపై నడుస్తున్నాయి.. రైళ్లు రోడ్లు ఎక్కాయి!

## వానా కాలం

| | గరిష్ఠం | కనిష్ఠం |
|---|---|---|
| ఆదిలాబాద్ | 32.6°c | 23.2°c |
| రంగారెడ్డి | 32.2°c | 19.8°c |
| హైదరాబాద్ | 32.0°c | 22.1°c |
| మెదక్ | 30.1°c | 23.0°c |
| నిజామాబాద్ | 29.5°c | 22.8°c |
| నల్లగొండ | 28.5°c | 22.6°c |
| కరీంనగర్ | 28.0°c | 24.0°c |
| వరంగల్ | 27.0°c | 24.0°c |
| మహబూబ్‌నగర్ | 27.0°c | 22.0°c |
| ఖమ్మం | 26.0°c | 23.0°c |

## ఆదర్శ్ సేవలు అభినందనీయం

**న్యాయ సలహాలతో నల్లకోటు విలువ పెంచిండు**

**రూపాయికే న్యాయ సలహా గొప్పవిషయం**

**బీఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : కందిక ఆదర్శ్ అనే వ్యక్తి దేశవ్యాప్తంగా న్యాయ సలహాలు అందిస్తూ నల్లకోటు విలువ పెంచుతున్నారని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అభినందించారు. ఆదర్శ్ మరిన్ని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని మంగళవారం ఎక్స్ వేదికగా ఆకాంక్షించారు. న్యాయం కోసం పడిగాపులు కాస్తున్న వారికి టీహబ్ సహకారంతో అండగా నిలిచారని తెలిపారు. సీఎల్ఎన్ఎస్ అనే మొబైల్ అప్లికేషన్ ద్వారా రూపాయికే న్యాయ సలహాలు అందిస్తున్నారని కొనియాడారు. 'సామాన్యుడి సమస్యలు తీర్చినప్పుడే టెక్నాలజీకి సార్థకత అని కేసీఆర్ మాకెప్పుడూ చెప్తుంటారు.. తెలంగాణ యువతలో సృజనాత్మకతను వెలికితీసి, వారిని ఔత్సాహిక పారిశ్రామికవేత్తలుగా తీర్చిదిద్దాలనే సదాశయంతో టీహబ్, వీహబ్, టీవర్క్స్ వంటి సంస్థలను గత బీఆర్ఎస్ ప్రభుత్వం నెలకొల్పింది' అని గుర్తుచేశారు.

## సృజన్‌రెడ్డి కేసులో కేటీఆర్‌కు ఊరట

హైదరాబాద్, సెప్టెంబర్ 2(నమస్తే తెలంగాణ): అమృత్ టెండర్ల విషయంలో ప్రజలను తప్పుదారి పట్టించేలా తనపై ఆరోపణలు చేశారంటూ వ్యాపారవేత్త సృజన్‌రెడ్డి దాఖలు చేసిన కేసులో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్, సిరిసిల్ల ఎమ్మెల్యే కల్వకుంట్ల తారక రామారావుకు ఊరట లభించింది. కింది కోర్టులో జరిగే ఆ కేసు విచారణకు కేటీఆర్ వ్యక్తిగతంగా హాజరుకానవసరం లేదని హైకోర్టు స్పష్టం చేసింది. ఈ మేరకు జస్టిస్ కే లక్ష్మణ్ మంగళవారం మధ్యంతర ఉత్తర్వులు జారీ చేశారు. నాంపల్లిలోని ప్రజాప్రతినిధుల కోర్టులో సృజన్‌రెడ్డి దాఖలు చేసిన ప్రైవేట్ పిటిషన్‌ను కేటీఆర్ హైకోర్టులో సవాలు చేయడంతో ఈ ఉత్తర్వులు వెలువడ్డాయి. కేటీఆర్ పిటిషన్‌పై సృజన్‌రెడ్డితోపాటు పోలీసుకు నోటీసులు జారీ చేసిన హైకోర్టు.. తదుపరి విచారణను అక్టోబర్ 7కు వాయిదా వేశారు.

## 5 నెలల్లో 39,900 కోట్ల అప్పు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఒకవైపు వేదిక ఏదైనా తెలంగాణ రాష్ట్రానికి అప్పు పుట్టడం లేదని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చెప్తుండగా, మరోవైపు ఆయన ప్రభుత్వం ఎడాపెడా అప్పులు చేస్తున్నది. ఈ ఆర్థిక సంవత్సరంలో తొలి ఐదు నెలల్లో ఏకంగా రూ.39,900 కోట్లు అప్పు చేసింది. తాజాగా మంగళవారం ఆర్బీఐ నుంచి రూ.6,000 కోట్లు అప్పు చేసింది. ఇందులో 26 ఏండ్ల కాల పరిమితితో రూ.1,500 కోట్లు, 32 ఏండ్ల కాల పరిమితితో రూ.1,500 కోట్లు, 38 ఏండ్ల కాల పరిమితితో మరో రూ.1,500 కోట్ల అప్పు తీసుకున్నది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో మార్కెట్ రుణాల ద్వారా మొత్తం రూ.54,009 కోట్లు సమీకరిస్తామని రాష్ట్ర బడ్జెట్‌లో ప్రతిపాదించిన కాంగ్రెస్ సర్కారు తొలి ఐదు నెలల్లోనే రూ.39,900 కోట్లు అప్పు చేయడం గమనార్హం. ఇది బడ్జెట్‌లో ప్రతిపాదించిన వార్షిక రుణ మొత్తంలో దాదాపు 74 శాతానికి సమానం.

## లిటిగేషన్‌లోనూ ఎస్బీఐ పెద్దదే

**హైకోర్టు వ్యాఖ్య**

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): దేశంలోనే అతిపెద్ద బ్యాంకుగా కొనసాగుతున్న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) లిటిగేషన్‌లోనూ అతి పెద్దదేనని హైకోర్టు వ్యాఖ్యానించింది. హైదరాబాద్‌లోని కుత్బుల్లాపూర్‌కు చెందిన రైతు నర్సిరెడ్డిగారి బాల్‌రెడ్డి, షాపూర్ నగర్‌కు చెందిన కల్లం మాధవరెడ్డికి అనుకూలంగా 2018లో డెట్ రికవరీ ట్రిబ్యునల్ (డీఆర్‌టీ) జారీచేసిన ఆదేశాలు చట్టవిరుద్ధమైనవని, వాటిని కొట్టివేయాలని కోరుతూ ఎస్బీఐ ఏడేండ్ల తర్వాత పిటిషన్ దాఖలు చేయడంపై జస్టిస్ మౌసమీ భట్టాచార్య, జస్టిస్ గాడి ప్రవీణ్ కుమార్ ధర్మాసనం మంగళవారం ఈ వ్యాఖ్య చేసింది. డీఆర్‌టీ ఆదేశాలపై పిటిషన్ దాఖలులో జాప్యానికి కారణాలేమిటో బుధవారం జరిగే విచారణలో చెప్పాలని ఎస్బీఐని ఆదేశించింది.

## ఏపీపీ పోస్టుల భర్తీకి వారంలో నోటిఫికేషన్

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్రంలో ఖాళీగా ఉన్న 118 అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ (ఏపీపీ) పోస్టులను త్వరలో భర్తీ చేస్తామని ప్రభుత్వం హామీ ఇచ్చింది. ఆ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్‌ను వారంలోగా జారీ చేస్తామని మంగళవారం హైకోర్టుకు తెలియజేసింది. ఏపీపీ పోస్టుల భర్తీకి ఆర్థిక శాఖ జూన్‌లోనే అనుమతి ఇచ్చినప్పటికీ ఇంకా నోటిఫికేషన్ వెలువడలేదంటూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యంపై ప్రభుత్వం ఈ హామీ ఇచ్చింది. దీంతో నోటిఫికేషన్ వివరాలు సమర్పించాలంటూ ప్రభుత్వాన్ని ఆదేశించిన చీఫ్ జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్ ధర్మాసనం.. తదుపరి విచారణను వచ్చే వారానికి వాయిదా వేసింది.

## ట్రాన్స్‌జెండర్ల సంక్షేమంలో జాప్యమెందుకు?

హైదరాబాద్, సెప్టెంబర్ 2(నమస్తే తెలంగాణ): ట్రాన్స్‌జెండర్లకు ఆసరా పింఛన్లు అందజేయడం, రిజర్వేషన్లు కల్పించడంలో జరిగిన జాప్యంపై వివరణ ఇవ్వాలని హైకోర్టు రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించింది. తెలంగాణ నపుంసకుల చట్టం 1329 ఫస్లీ రాజ్యాంగానికి విరుద్ధమని, లింగమార్పిడి చేయించుకున్న వ్యక్తులకు ఆసరా పింఛన్లను విస్తరించాలని, విద్యాసంస్థలు, ప్రభుత్వ నియామకాల్లో ట్రాన్స్‌జెండర్లకు రిజర్వేషన్లు కల్పించాలని 2023లో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలవడంతో టాన్స్‌జెండర్ల కోసం సంక్షేమ బోర్డును ఏర్పాటు చేయాలని గతంలో హైకోర్టు ఆదేశించింది. రెండేండ్ల క్రితం వెలువడిన ఈ ఆదేశాలు ఇంకా అమలు కాలేదంటూ హైదరాబాద్‌కు చెందిన వైజయంతీ వసంత మొగిలి కోర్టు ధిక్కరణ పిటిషన్ వేయగామంగళవారం విచారణ జరిపిన హైకోర్టు.. తదుపరి విచారణను 4 వారాలకు వాయిదా వేసింది.

## విమాన ఇంధనం కల్తీపై హైకోర్టు విస్మయం

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): విమాన ఇంధనం కూడా కల్తీ అవ్వడంపై హైకోర్టు విస్మయం వ్యక్తం చేసింది. రోడ్డుపై తిరిగే వాహన ఇంధనం కల్తీ అయితే రోడ్డు మీదే జనం ఇబ్బందులు పడతారని, గాలిలో ప్రయాణించే విమానంలోని ప్రయాణికుడి పరిస్థితి ఏమిటని కాంట్రాక్టర్‌పై మండిపడింది. విమాన ఇంధనంలో కల్తీ చేయడంపై ఆగ్రహం వ్యక్తం చేసింది. ప్రాణమంటే లెక్కలేకుండా ఉందా అని ప్రశ్నించింది. విమాన ఇంధనం కల్తీపై తన కాంట్రాక్ట్ రద్దు చేయడాన్ని సవాలు చేస్తూ కాంట్రాక్టర్ దాఖలు చేసిన పిటిషన్‌ను డిస్మిస్ చేసింది. పిటిషనర్‌కు రూ.10 లక్షలు జరిమానా విధించింది. ట్యాంకర్లలో ఇంధనాన్ని కల్తీ చేస్తున్నారని సోషల్ మీడియాలో వచ్చిన సమాచారాన్ని ఆధారం చేసుకుని ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ ప్రైవేట్ లిమిటెడ్ కాంట్రాక్టును రద్దు చేసింది. ఈ చర్యను సవాలుచేస్తూ ఖమ్మం జిల్లాకు చెందిన గుర్నాథం వేసిన వ్యాజ్యాన్ని జస్టిస్ నగేశ్ భీమపాక కొట్టివేశారు.

## డీఎస్సీ స్పోర్ట్స్‌కోటా స్కాంపై నేడు విచారణ

**ఐదుగురు అధికారులకు నోటీసులు • 'నమస్తే' వరుస కథనాలతో చలనం**

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): డీఎస్సీ స్పోర్ట్స్ కోటా ఉద్యోగాల భర్తీ కుంభకోణంపై బుధవారం లోకాయుక్త విచారణ జరపనున్నది. ఈ మేరకు ఐదుగురు అధికారులకు లోకాయుక్త నోటీసులు అందజేసింది. అన్ని రకాల రిపోర్టులతో బుధవారం విచారణకు హాజరుకావాలని ఆ నోటీసుల్లో ఆదేశాలిచ్చింది. డీఎస్సీ–2014 ఎస్జీటీ పోస్టుల భర్తీలో భారీ స్కాం జరిగింది. ఒక్కో పోస్టును రూ.15 లక్షలకు అమ్ముకున్నట్టు ఆరోపణలొచ్చాయి. అధికారులు జీవో–74కి వ్యతిరేకంగా నియామకాలు చేపట్టి నకిలీ సర్టిఫికెట్లున్న వారికి ఉద్యోగాలిచ్చారు. జాతీయ స్థాయి క్రీడాకారులను పక్కనపెట్టి జిల్లా రాష్ట్రస్థాయి క్రీడాకారులకు ఉద్యోగాలిచ్చారు. అసలు అభ్యర్థుల సర్టిఫికెట్లను పరిశీలించకుండానే అస్మదీయులకు ఉద్యోగాలు కట్టబెట్టారు. అలా 25 మంది అనర్హులకు ఉద్యోగాలిచ్చినట్టు సమాచారం. ఈ బాగోతంపై 'నమస్తే తెలంగాణ'లో వరుస కథనాలు ప్రచురితమయ్యాయి. కంగుతిన్న అధికారులు.. 2024 నవంబర్‌లో 393 మంది అభ్యర్థులకు సర్టిఫికెట్ల వెరిఫికేషన్ నిర్వహించారు. ఆ తర్వాత హైలెవల్ కమిటీ అంటూ మరోసారి సర్టిఫికెట్ వెరిఫికేషన్ ప్రక్రియ చేపట్టారు. అర్హుల జాబితా తేల్చక స్పోర్ట్స్ అథారిటీ, విద్యాశాఖ అధికారులు పరస్పరం నెపాన్ని వేసుకుంటున్నారు.

## మహేశ్ బ్యాంకు కుంభకోణంలో 1.1 కోట్ల ఆస్తులు జప్తు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఆంధ్రప్రదేశ్ మహేశ్ కోఆపరేటివ్ అర్బన్ బ్యాంక్ కుంభకోణం కేసులో ఆ బ్యాంకు మాజీ ఎండీ, సీఈవో ఉమేశ్ చంద్ అసవా, ఆయన కుటుంబసభ్యులకు చెందిన రూ.1.1 కోట్ల విలువైన రెండు స్థిరాస్తులను ఈడీ జప్తు చేసింది. బ్యాంక్ చైర్మన్ రమేశ్ కుమార్ బంగ్ తోపాటు మాజీ ఎండీ, సీఈవో ఉమేశ్‌చంద్ అసవా, సీనియర్ వైస్ చైర్మన్ పురుషోత్తందాస్ మంధాన అక్రమాలకు పాల్పడ్డారంటూ బంజారాహిల్స్ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైన విషయం తెలిసిందే. మనీ లాండరింగ్ చట్టం కింద దర్యాప్తు చేపట్టిన ఈడీ.. నిందితులు తమ అధికారాలను దుర్వినియోగం చేసి, అనర్హులకు అక్రమంగా రుణాలు మంజూరు చేసినట్టు తేల్చింది. రంగారెడ్డి జిల్లా ఆదిభట్లలో ఉమేశ్ కుటుంబసభ్యులు కొనుగోలు చేసిన రెండు ఆస్తులను జప్తు చేసినట్టు ఈడీ వెల్లడించింది.

# ..సీబీఐ దర్యాప్తు చేయొద్దు

మొదటిపేజీ తరువాయి...

సీబీఐ దర్యాప్తునకు ఆదేశించాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) నివేదిక ఆధారంగా సీబీఐ దర్యాప్తు ఉంటుందని తెలిపారు. ఈ నేపథ్యంలో పిటిషన్లకు విచారణార్హత లేదని, వాటిని కొట్టివేయాలని కోరారు.

### ప్రభుత్వ హామీని రికార్డుల్లో రాయాలి

కేసీఆర్, హరీశ్‌ల తరఫున సుప్రీంకోర్టు సీనియర్ న్యాయవాదులు ఆర్యమ సుందరం, దామా శేషాద్రినాయుడు వాదనలు వినిపిస్తూ, సీబీఐ దర్యాప్తునకు ఘోష్ కమిషన్ నివేదికను ప్రామాణికంగా తీసుకోబోరన్న ప్రభుత్వ హామీని రికార్డుల్లో నమోదు చేయాలని కోరారు. కోర్టు జారీ చేయబోయే ఉత్తర్వుల ప్రతిని కూడా వెంటనే అందుబాటులోకి వచ్చేలా చూడాలని, లేకపోతే, ఈలోగానే సీబీఐ దర్యాప్తు ప్రారంభిస్తే సమస్య తలెత్తవచ్చునని చెప్పారు. ఈ నేపథ్యంలో ఏజీ కల్పించుకుంటూ.. వాస్తవాలను సీబీఐ దర్యాప్తునకు పరిగణనలోకి తీసుకోవచ్చునని చెప్పడంతో వారిద్దరూ తీవ్ర అభ్యంతరం చెప్పారు. దీనిపై హైకోర్టు కల్పించుకుని, పిటిషనర్లపై చర్యలు తీసుకుంటారన్న ఆందోళనను పరిగణనలోకి తీసుకోవాలని వ్యాఖ్యానించింది. ఏ చర్యలైనా కూడా కోర్టు విచారణ పరిధిలోని అంశాలతో ముడిపడి ఉంటాయని తేల్చిచెప్పింది.

### ప్రశ్నల వర్షం కురిపించిన ధర్మాసనం

తొలుత ఏజీ వాదనలు ప్రారంభిస్తూ, జస్టిస్ ఘోష్ కమిషన్ నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టామని చెప్పారు. ఈ నివేదిక ఆధారంగా ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని తెలిపారు. ఈ వ్యవహారంపై సీబీఐతో దర్యాప్తు చేయించాలనే నిర్ణయం తీసుకున్నందున పిటిషనర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని అన్నారు. దీనిపై హైకోర్టు కల్పించుకుంటూ.. అసెంబ్లీలో నివేదిక సమర్పించాక ఏం జరిగిందని ప్రశ్నించింది. సభలో నివేదికపై సమగ్రంగా చర్చ జరిగిందని, ప్రభుత్వం ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఏజీ బదులిచ్చారు. అసెంబ్లీలో రిపోర్టు పెట్టాక చర్యలు ఉంటాయని పిటిషనర్లు ఆందోళన వ్యక్తం చేస్తున్నారని, సీబీఐ దర్యాప్తునకు ఆదేశించడం ద్వారా చర్యలు ఉంటాయని కూడా ఆందోళన వ్యక్తం చేస్తున్నారని హైకోర్టు గుర్తుచేసింది. కమిషన్ రిపోర్టు ఆధారంగా సీబీఐ దర్యాప్తు ఉంటుందా.. అన్న హైకోర్టు ప్రశ్నకు ఉండబోదని ఏజీ జవాబు చెప్పారు.



### వ్యక్తిగతంగా ఎవరి పేర్లూ లేవు

నేషనల్ డ్యాం సేఫ్టీ ఆథారిటీ రిపోర్టు, ప్రభుత్వం దగ్గరున్న సమాచారం ఆధారంగా సీబీఐ దర్యాప్తు జరుగుతుందని ఏజీ చెప్పారు. మేడిగడ్డ బరాజ్‌లోని 3, 5 పిల్లర్లు కుంగుబాటుకు గురయ్యాయని వివరించారు. మళ్లీ హైకోర్టు కల్పించుకుని, కమిషన్ రిపోర్టు ఆధారంగా సీబీఐ దర్యాప్తు ఉండబోదన్న విషయాన్ని రికార్డుల్లో నమోదు చేయమంటారా.. అని ప్రశ్నించింది. ఈ దశలో పిటిషనర్ల న్యాయవాదులు కల్పించుకుంటూ.. కమిషన్ రిపోర్టు ఆధారంగా పిటిషనర్లపై చర్యలు ఉండరాదని ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. తిరిగి ఏజీ జోక్యం చేసుకుని, సీబీఐ దర్యాప్తునకు ప్రభుత్వం నోటిఫికేషన్ జారీచేసిందని, సీబీఐ సొంతంగా దర్యాప్తు చేస్తుందని తెలిపారు. హైకోర్టు స్పందిస్తూ, సీబీఐ దర్యాప్తునకు జారీచేసిన ఆదేశాల్లో ఎవరి పేర్లయినా ప్రస్తావించారా? అని అడిగితే ఏజీ లేదని బదులిచ్చారు. కావాలంటే సీబీఐ దర్యాప్తునకు ఆదేశిస్తూ వెలువడిన జీవోను పరిశీలించవచ్చునంటూ ఆ ప్రతులను అందజేశారు. హైకోర్టు.. అసెంబ్లీలో ప్రవేశపెట్టిన కమిషన్ రిపోర్టులో తమకు ప్రతికూల అంశాలు ఉన్నాయని పిటిషనర్లు చెప్తున్నారని, మరోవైపు వాటి ఆధారంగా ఎలాంటి చర్యలూ ఉండబోవని, అంతేకాకుండా సీబీఐ దర్యాప్తునకు కూడా రిపోర్టు ఆధారం కాబోదని ప్రభుత్వం చెప్తున్నది కదా.. అని గుర్తుచేసింది. అసెంబ్లీలో నివేదికపై చర్చ జరిగిన తర్వాత సీబీఐకి అప్పగించాలనే నిర్ణయం జరిగిందని, తదుపరి చర్యలపై ఏ నిర్ణయమూ తీసుకోలేదని ఏజీ జవాబు చెప్పారు. అయితే, ఐఏ, ప్రధాన పిటిషన్లపై కౌంటర్ దాఖలు చేయాలని, తదుపరి విచారణలో పిటిషన్‌లోని అంశాలపై తుది నిర్ణయం తీసుకుంటామని హైకోర్టు స్పష్టం చేసింది.

### తెలివైన కుట్రతో సర్కార్

దామా శేషాద్రి నాయుడు వాదనలు కొనసాగిస్తూ, కమిషన్ రిపోర్టుతో సంబంధం లేకుండా సీబీఐ దర్యాప్తునకు ఆదేశిస్తున్నామని, రిపోర్టు ఆధారంగా చర్యలు తీసుకోబోమని ప్రభుత్వం చెప్తున్నదని, మరోవైపు అదే రిపోర్టులోని అంశాలను సీబీఐ దర్యాప్తు కోరుతూ వెలువరించిన నోటిఫికేషన్‌లో ఎందుకు ప్రస్తావించిందని ప్రశ్నించారు. నిన్నటివరకు కమిషన్ రిపోర్టును అసెంబ్లీలో ప్రవేశపెట్టాక తదుపరి చర్యలు ఉంటాయని ప్రభుత్వం చెప్పిందని గుర్తుచేశారు. అసెంబ్లీలో చర్చ సమయంలో కూడా కమిషన్ అనేక అవకతకలను నిగ్గు తేల్చిందని, బాధ్యులపై చర్యలు తప్పవని హెచ్చరించిందని కూడా గుర్తుచేశారు. ఇప్పుడేమో కమిషన్ రిపోర్టుపై చర్యలు తీసుకోబోమని అంటూనే అందులోని అంశాలను ప్రస్తావిస్తూ సీబీఐ దర్యాప్తునకు నోటిఫికేషన్ జారీచేయడం ద్వారా ప్రభుత్వం తన ద్వంద్వ వైఖరిని చాటుకుందని అన్నారు. ప్రభుత్వం చాలా తెలివిగా కుట్రతో వ్యవహరిస్తున్నదని చెప్పారు. దీనిపై హైకోర్టు స్పందిస్తూ, ప్రభుత్వ హామీకి భిన్నంగా జరిగితే అది కోర్టు పరిధిలోని అంశాల కిందకు వస్తుందని గుర్తుచేసింది. పిటిషనర్ల పరువు ప్రతిష్టకు భంగం వాటిల్లే చర్యలు ఏమీ ఉండబోవని ప్రభుత్వమే హామీ ఇస్తున్న విషయాన్ని ప్రస్తావించింది. నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక ఆధారంగానే సీబీఐ దర్యాప్తు ఉండాలని ఉత్తర్వులను జారీచేసింది. తిరిగి ఏజీ కల్పించుకుని, కమిషన్ రిపోర్టు మినహా ఇతర అంశాల ఆధారంగా సీబీఐ దర్యాప్తు ఉంటుందని చెప్పడాన్ని న్యాయవాదులు అడ్డుకున్నారు. ప్రధాన పిటిషన్లు, ఐఏల్లోని అంశాలపై ప్రభుత్వం కౌంటర్లు దాఖలు చేయాలని హైకోర్టు ప్రభుత్వానికి నోటీసులు జారీ చేసింది. కౌంటర్లపై పిటీనర్లు రిప్లైకౌంటర్లు కూడా దాఖలు చేయాలని ఆదేశించింది. తదుపరి విచారణను అక్టోబర్ 7వ తేదీకి వాయిదా వేసింది.

### సీబీఐకి ఇవ్వడాన్ని సవాలు చేస్తాం..

**ఒక** దశలో ఘోష్ కమిషన్ నివేదికలోని అంశాలపై ఇరుపక్షాలు గట్టిగా వాదప్రతివాదాలు చేసుకున్నారు. దీంతో ధర్మాసనమే ఆ అంశాలను చదివింది. పేరా 3లో కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మూడు బ్యారేజీల నిర్మాణంలో అవకతవకలు, ప్రజాధనం దుర్వినియోగం జరిగినందున కమిషన్ ఆఫ్ ఎంక్వైరీస్ యాక్ట్‌లోని సెక్షన్ 3 కింద జస్టిస్ ఘోష్ కమిషన్ ఏర్పాటు చేయడం జరిగిందని ఉంది. కమిషన్ ఈ ఏడాది జులై 31న ప్రభుత్వానికి సమర్పించిన నివేదికలో నిర్మాణంలో తీవ్ర నిర్లక్ష్యం, లోపాలు, అవకతవకలను గుర్తించినట్టు పేర్కొంది. తీవ్రమైన క్రిమినల్ చర్యలకు అవసరమయ్యే అనేక లోపాలను గుర్తించింది. ప్రణాళిక లేకుండానే మూడు బ్యారేజీల నిర్మాణం జరిగింది.. అని ఉంది. ఈ విషయాలను హైకోర్టు దృష్టికి తెచ్చేందుకు పిటిషనర్ల తరఫు న్యాయవాదులు ప్రయత్నించారు. అందులోని 8వ పేరాలో మేడిగడ్డ పిల్లర్ల కుంగుబాటు వల్ల రాష్ట్ర ఖజానాకు తీవ్ర ఆర్థిక నష్టం వాటిల్లినట్టు నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ నివేదిక పేర్కొంది. ఈ వ్యవహారంలో కమిషన్ నివేదికపై అసెంబ్లీ చర్చ జరిపింది. దీనిపై సీబీఐ దర్యాప్తునకు అప్పగించాలనే నిర్ణయం అసెంబ్లీ తీసుకుంది.. అని ఏజీ చెప్పే ప్రయత్నం చేశారు. ఈ అంశాలన్నింటినీ పూర్తిగా చదివిన తర్వాత ధర్మాసనం.. కమిషన్ నివేదికపై ప్రభుత్వం చర్యలు లేవుకాబట్టి పిటిషనర్లు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని చెప్పగా, అవునని ఏజీ మరోసారి భరోసా ఇచ్చారు. పిటిషనర్ల న్యాయవాదులు కల్పించుకుని, సీబీఐ దర్యాప్తునకు ఆదేశించడాన్ని సవాలు చేస్తామని చెప్పగా, అది వేరే విషయమని, విడిగా మరో పిటిషన్ దాఖలు చేసుకునే స్వేచ్ఛ పిటిషనర్లకు ఉందని ధర్మాసనం స్పష్టం చేసింది.



# జస్టిస్ ఘోష్.. రిపోర్టు ట్రాష్

## కేసీఆర్‌ను బద్నాం చేసే కుట్ర

- అదే లక్ష్యంతో పనిచేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి
- మేడిగడ్డను రిపేర్ చేయాలని కమిషన్ చెప్పింది
- బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ సతీశ్‌రెడ్డి



హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): కేసీఆర్‌ను బద్నాం చేయడమే లక్ష్యంగా సీఎం రేవంత్‌రెడ్డి పనిచేస్తున్నారని బీఆర్ఎస్ సోషల్ మీడియా కన్వీనర్ వై సతీశ్‌రెడ్డి ధ్వజమెత్తారు. కాళేశ్వరంపై సీఎం రేవంత్‌రెడ్డి వ్యవహరిస్తున్న తీరుపై మంగళవారం ఆయన 'ఎక్స్' వేదికగా మండిపడ్డారు. ప్రజా ప్రయోజనాల దృష్ట్యా మేడిగడ్డను రిపేర్ చేయాలని కాళేశ్వరం కమిషన్ చెప్పిందని పేర్కొన్నారు. దీన్నిబట్టి మిగతా ప్రాజెక్ట్ అంతా బాగానే ఉన్నదని స్పష్టమైందని తెలిపారు. దీంతో కాళేశ్వరం కొట్టుకుపోలేదు, రూ.93,000 కోట్లు వృథా కాలేదని పేర్కొన్నారు. అన్ని బరాజ్‌లు, పంప్‌హౌస్‌లు, కాలువలు, రిజర్వాయర్లు బాగానే ఉన్నాయని, ప్రస్తుతం అవి పని చేస్తున్నాయని తెలిపారు. ఇదే విషయాన్ని ఎన్డీఎస్ఏ మే 2024లోనే సూచించిందని, తక్షణ చర్యలు తీసుకోవాలని చెప్పిందని పేర్కొన్నారు. కానీ రేవంత్ ప్రభుత్వం ఏడాది గడిచినా మరమ్మతు పనులు ఎందుకు చేయలేదు? అని ప్రశ్నించారు. ఉద్దేశపూర్వకంగానే బరాజ్‌ను మరమ్మతు చేయకుండా వదిలేశారని ఆరోపించారు. ఎన్డీఎస్ఏ చెప్పి సంవత్సరం దాటినా చర్యలు తీసుకోకుండా ప్రజాధనాన్ని వృథా చేసింది రేవంత్ ప్రభుత్వం కాదా? ఒక్కరోజులో అసెంబ్లీలో కమిషన్ రిపోర్ట్ పెట్టి, తీర్మానం చేసి, సీబీఐకి అప్పగించడానికి పాత జీవోను మార్చి సీబీఐకి సిఫారసు లేఖ పంపిన ప్రభుత్వం.. అంతే శ్రద్ధ ప్రాజెక్ట్ మరమ్మతుపై ఎందుకు పెట్టలేదని ప్రశ్నించారు.

## మోదీ చెప్తేనే రేవంత్ సీబీఐ డ్రామా!



తెలంగాణభవన్‌లో మీడియాతో మాట్లాడుతున్న బీఆర్ఎస్ మైనార్టీ నేత ఆజం అలీ

### కాళేశ్వరం.. ఒక మహాద్భుత ప్రాజెక్టు

- దానిపైనే సీబీఐ విచారణ జరుపుతరా?
- రాష్ట్రంలో మైనారిటీలకు కరువైన రక్షణ
- క్యాబినెట్‌లో ఒక్క మైనారిటీ లేరు!
- కాంగ్రెస్‌పై బీఆర్ఎస్ మైనారిటీ నేతల ఫైర్

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): 'ప్రధాని నరేంద్ర మోదీ చెప్తేనే సీఎం రేవంత్‌రెడ్డి కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణ అంటూ మరో కొత్త డ్రామాకు తెరలేపారు. బడే భాయ్, ఛోటే భాయ్ బంధంలో భాగంగానే ఈ నిర్ణయం తీసుకున్నారు' అని బీఆర్ఎస్ మైనారిటీ నేత ఆజం అలీ విమర్శించారు. హైదరాబాద్ తెలంగాణ భవన్‌లో మంగళవారం ఆయన ఇతర మైనారిటీ నేతలతో కలిసి మీడియాతో మాట్లాడారు. కాళేశ్వరం.. అద్భుతమైన ప్రాజెక్టు అని, తెలంగాణకు అది జీవధార అని, అలాంటి ప్రాజెక్టుపై సీబీఐ విచారణ జరిపించడమా? అని నిలదీశారు. సీఎం రేవంత్‌రెడ్డి తన స్కూల్ ఆర్ఎస్ఎస్ అని, టీడీపీ తన కాలేజీ లాంటిదన్న విషయాలను ఈ ఘటనతో నిరూపించుకున్నారని ధ్వజమెత్తారు. తన కాలేజీ ప్రిన్సిపాల్ అయిన చంద్రబాబు ఆదేశాలతోనే, విద్యార్థి రేవంత్‌రెడ్డి సీబీఐ విచారణకు ఆదేశించారని ఎద్దేవా చేశారు. అసలు సీబీఐ విచారణ జరుపాల్సింది కాళేశ్వరంపై కాదని, రైతులకు కావాల్సిన యూరియా బ్లాక్ మార్కెట్ చేస్తున్న వారిపై అని స్పష్టం చేశారు. కేసీఆర్ వల్ల పెరిగిన తెలంగాణ ప్రతిష్ఠను, రేవంత్‌రెడ్డి తన వైఖరితో దిగజార్చుతున్నారని విమర్శించారు.

### మైనారిటీలకు రక్షణ కరవు

కాంగ్రెస్ పాలనలో రాష్ట్రంలోని మైనారిటీలకు రక్షణ కరువైందని ఆజం అలీ ఆందోళన వ్యక్తంచేశారు. బీఆర్ఎస్ సర్కార్ హయాంలో అమలైన ప్రజా సంక్షేమ పథకాలను రేవంత్‌రెడ్డి బంద్ పెట్టారని విమర్శించారు. క్యాబినెట్‌లో మైనారిటీలకు స్థానం కల్పించలేదని దుయ్యబట్టారు. ఎమ్మెల్సీ పదవిని సైతం మజాక్ చేశారని మండిపడ్డారు. కేసీఆర్‌పై కక్ష సాధింపు చర్యలకు దిగడాన్ని మైనారిటీలు హర్షించడం లేదని తేల్చిచెప్పారు. కేసీఆర్ కుటుంబాన్ని టార్గెట్ చేయడానికి బదులు.. ప్రజా సంక్షేమ పథకాల అమలుపై దృష్టి పెట్టాలని హితవు పలికారు.

### ప్రతీకార రాజకీయాలు మానుకోవాలి

కాంగ్రెస్ నేతలు ప్రతీకార రాజకీయాలను మానుకోకపోతే ఆ పార్టీ భూస్థాపితం కాక తప్పదని ఆజం అలీ హెచ్చరించారు. తెలంగాణను సాధించిన మహానేతగా, అద్భుతంగా రాష్ట్రాన్ని తీర్చిదిద్దిన తొలి తెలంగాణ సీఎంగా కేసీఆర్‌పై ప్రజలకు ఎనలేని అభిమానం ఉన్నదని, అలాంటి నేతపై అసత్య ఆరోపణలతో వేధించాలని చూడటం మానుకోకుంటే కాంగ్రెస్‌కు ప్రజలే బుద్ధి చెప్తారని తెలిపారు. సీబీఐ విచారణను అక్టోబర్ 7 దాకా చేయొద్దని న్యాయస్థానం ఆదేశాలు ఇవ్వడాన్ని స్వాగతిస్తున్నామని పేర్కొన్నారు. అర్షద్ అలీఖాన్, అక్బర్ హుస్సేన్, మహ్మద్ మోయిద్‌ఖాన్, ఎండీ యూసుఫ్, మహ్మద్ ఖలీం, ఖాజా బద్రుద్దీన్, అబ్దుల్ బాసిత్ తదితరులు పాల్గొన్నారు.

## నదులకే నడక నేర్పిన కేసీఆర్



తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న రాకేశ్‌రెడ్డి. చిత్రంలో రామ్మూర్తి, విజయ్‌కుమార్

### గొలుసుకట్టు రిజర్వాయర్ల నిర్మాణ ఘనత ఆయనదే..

- సీబీఐ విచారణను న్యాయ పరంగా ఎదుర్కొంటాం
- కాళేశ్వరంపై పీపీటీలో బీఆర్ఎస్ నేత రాకేశ్‌రెడ్డి

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : నదులకే నడక నేర్పిన మహానేత కేసీఆర్ అని, మేడిగడ్డ, అన్నారం, సుందిల్ల దగ్గర నుంచి రివర్స్ పంపింగ్ ద్వారా శ్రీరాంసాగర్‌లో వరద నీటిని నింపిన గ్రేట్ లీడర్ అని బీఆర్ఎస్ నేత ఏనుగుల రాకేశ్‌రెడ్డి కొనియాడారు. కాకతీయులు గొలుసుకట్టు చెరువులు తవ్విస్తే.. కేసీఆర్ గొలుసుకట్టు రిజర్వాయర్లు నిర్మించారని గుర్తుచేశారు. కాళేశ్వరం ప్రాజెక్టులపై అపోహలు, దుష్ప్రచారాలపై నిగ్గు తేల్చేందుకు గత నెల 28, 29, 30 తేదీల్లో రాకేశ్‌రెడ్డి స్టడీ టూర్ నిర్వహించారు. ప్రాజెక్టు ప్రాధాన్యతలు, వినియోగంలోకి వచ్చిన తీరు, కుంగిన రెండు పిల్లర్ల ప్రస్తుత స్థితిగతులపై వీడియోలు, ఆధారాలతో మంగళవారం తెలంగాణ భవన్‌లో పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ఇచ్చారు. కాళేశ్వరమే లేకుంటే గంధమల్ల రిజర్వాయర్‌కు రేవంత్‌రెడ్డి ఎందుకు శంకుస్థాపన చేశాడని నిలదీశారు. మల్లన్నసాగర్ నుంచి గండిపేట ద్వారా నీటిని తీసుకెళ్లి మూసి ప్రక్షాళన చేస్తామని ఎలా హామీ ఇచ్చారని ప్రశ్నించారు. కాంగ్రెస్ తీరు చూస్తే ప్రభుత్వమే ప్రత్యేక నిధులు కేటాయించి, కాళేశ్వరాన్ని బాంబులు పెట్టి కూల్చేలా ఉన్నదని మండిపడ్డారు. కాంగ్రెస్ నాయకులంతా కాళేశ్వరాన్ని మేడిగడ్డ నుంచి బస్వాపురం వరకు పూర్తిగా సందర్శించాలని, అప్పుడే వారికి ఈ ప్రాజెక్టు గురించి స్పష్టంగా అర్థమవుతుందని హితవు పలికారు. ప్రపంచంలోనే మొట్ట మొదటి ఎత్తిపోతల ప్రాజెక్టు కాళేశ్వరం అని కొనియాడారు. ప్రస్తుతం అక్కడ వరద ఉధృతంగా పోతున్నా బరాజ్‌లు తట్టుకొని దృఢంగా ఉన్నాయన్న విషయాన్ని పీపీటీ ద్వారా వివరించారు.

### రికార్డు సమయంలో ప్రాజెక్టు పూర్తి..

కాళేశ్వరం ప్రాజెక్టులను రికార్డు సమయంలో పూర్తి చేస్తే అసెంబ్లీ సాక్షిగా సీఎం, మంత్రులు ఏం తొందర వచ్చిందని అంత తక్కువ టైంలో కట్టారని మాట్లాడటం సిగ్గుచేటని రాకేశ్‌రెడ్డి మండిపడ్డారు. '60 ఏండ్లలో కాంగ్రెస్ చేయలేనిది, ఆరేండ్లలో కేసీఆర్ చేసినందుకా? కాంగ్రెస్ పాలకులు ఇష్టం వచ్చినట్టు మాట్లాడుతున్నరు?' అని దుయ్యబట్టారు. కాళేశ్వరం నీళ్లు తెలంగాణకు రాకుండా పాకిస్తాన్, బంగ్లాదేశ్‌కు పోతున్నాయా? అని నిలదీశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు బొమ్మెర రామ్మూర్తి, కురవ విజయ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఘోష్ కమిషన్ నివేదికను సస్పెండ్ చేయండి

- హైకోర్టులో రిటైర్డ్ ఐఏఎస్ శైలేంద్ర జోషి పిటిషన్
- నేడు విచారణ చేయనున్న సీజే బెంచ్

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు జరిగాయని అంశంపై జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ ప్రభుత్వానికి సమర్పించిన నివేదికను సస్పెండ్ చేయాలని కోరుతూ రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శైలేంద్రకుమార్ జోషి హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో శైలేంద్రకుమార్ జోషి నీటిపారుదల శాఖలో ముఖ్యకార్యదర్శిగా పనిచేశారు. తన పిటిషన్‌పై అత్యవసరంగా విచారణ చేపట్టాలని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఏకే సింగ్, జస్టిస్ మొహియుద్దీన్‌తో కూడిన ధర్మాసనాన్ని కోరారు. దీనిపై బుధవారం విచారణ చేపడతామని ధర్మాసనం ప్రకటించింది. జూలై 31న జస్టిస్ పీసీ



ఘోష్ కమిషన్ నివేదిక ఇచ్చిందని, ఈ నివేదికలోని ముఖ్యాంశాలను ప్రభుత్వం సంక్షిప్తం చేయించాక నేరుగా పాలకులు మీడియా సమావేశంలో పవర్ పాయింట్ ప్రజంటేషన్‌లో బహిర్గతం చేశారని పిటిషన్‌లో పేర్కొన్నారు. ఆగస్టు 4వ తేదీ నాటి పవర్ పాయింట్ ప్రజంటేషన్ సారాంశాన్ని, వెబ్ సైట్స్ నుంచి దాని తొలగింపునకు ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కమిషన్ నివేదిక ఆధారంగా ప్రభుత్వం పిటిషనర్‌పై తదుపరి చర్యలు తీసుకోకుండా మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వాలని కోరారు. కమిషన్ నివేదిక అమలును నిలిపివేయాలని కూడా విజ్ఞప్తిచేశారు. కమిషన్ తనను సాక్షిగా మాత్రమే విచారణకు పిలిచిందని, ఈ మేరకు సమన్లు ఇచ్చిందని చెప్పారు. అభియోగాలు చేసే ముందు కమిషన్ ఎలాంటి నోటీసు ఇవ్వలేదని తెలిపారు. సాక్షిగా విచారణకు పిలిచి నివేదికలో ఆరోపణలు చేయడం హక్కులను హరించడమేనని చెప్పారు. కమిషన్ నిర్దిష్ట ఆరోపణలు చేసే ముందు క్రాస్ ఎగ్జామిన్ చేసేందుకు ఆస్కారం ఇవ్వలేదని తప్పుపట్టారు. ఐఏఎస్ అధికారిగా చేసిన తన వ్యక్తిగత జీవితానికి కళంకం కలిగించేలా కమిషన్ వ్యవహరించడానికి వీల్లేదని తెలిపారు. 1984 నుంచి 31-12-2019న పదవీ విరమణ చేసేవరకు తెలంగాణలో తాను ఎంతో నిజాయితీగా పని చేసినట్టు వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలలో అత్యంత కీలకమైన ఉన్నత పదవులను సమర్థంగా నిర్వహించినట్టు వివరించారు. పదవీ విరమణ తర్వాత జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ విచారణ పేరుతో తనకు అపకీర్తి వచ్చేలా నివేదిక ఇచ్చిందని పేర్కొన్నారు. తక్షణమే కమిషన్ నివేదిక అమలును నిలిపివేస్తూ ఆదేశించాలని కోరారు.

## ఏఎన్ఎంల సమస్యలు పరిష్కరించాలి

- టీజీయూఎంహెచ్ఈయూ కార్యదర్శి యాదనాయక్
- రేపు కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నాకు పిలుపు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : వైద్యారోగ్యశాఖలో పనిచేస్తున్న రెగ్యులర్, రెండో ఏఎన్ఎంలు సహా మిగతా ఏఎన్ఎంల సమస్యలను వెంటనే పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి యాదనాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. సమస్యల పరిష్కారమే లక్ష్యంగా గురువారం ఆరోగ్య, కుటుంబ సంక్షేమశాఖ కమిషనర్ కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టనున్నట్టు తెలిపారు.

## ఐఏఎస్ అధికారి శివశంకర్ రిలీవ్

### ఉత్తర్వులు జారీ చేసిన ప్రభుత్వం

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): తెలంగాణ నుంచి ఐఏఎస్ అధికారి శివశంకర్‌ను ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు మంగళవారం ఉత్తర్వులు జారీచేశారు. ఏపీ క్యాడర్‌కు చెందిన శివశంకర్ ప్రత్యేక అనుమతితో తెలంగాణలో విధులు నిర్వహిస్తున్నారు. దీంతో ఆయనను తిరిగి ఏపీకి పంపించాలని కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర ప్రభుత్వం ఆయనను రిలీవ్ చేసింది.

## మోదీ చేతికి.. రేవంత్ అధికారం!

మొదటిపేజీ తరువాయి...

కాళేశ్వరంపై విచారణను సీబీఐకి ఇవ్వాలనే సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయంపై సొంత పార్టీ నేతలు విస్మయం వ్యక్తంచేస్తున్నారు. కాంగ్రెస్ పార్టీకి బద్ధశత్రువైన బీజేపీ ప్రభుత్వం చేతిలో విచారణ పెట్టడం ఏమిటని ప్రశ్నిస్తున్నారు. అంటే రాష్ట్ర ప్రభుత్వం తమ అధికారాలను కేంద్రానికి అప్పగించడమేనని విమర్శిస్తున్నారు.

### రాష్ట్ర వ్యవస్థలపై నమ్మకం లేదా?

రాష్ట్ర హోం శాఖను కూడా సీఎం రేవంత్‌రెడ్డే స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. అలాంటప్పుడు కాళేశ్వరంపై విచారణను తన ఆధీనంలోని రాష్ట్ర విచారణ సంస్థలకు కాకుండా కేంద్ర దర్యాప్తు సంస్థలకు అప్పగించడం ఏమిటనే విమర్శలొస్తున్నాయి. ప్రాజెక్టు నిర్మాణంలో ఆర్థిక అవకతవకలు జరిగాయని భావిస్తే విచారణను ఏసీబీకి అప్పగించొచ్చు.. లేదా స్పెషల్ ఇన్వెస్టిగేషన్ టీం(సిట్) ఏర్పాటుచేసే అవకాశం కూడా ఉన్నది. ఒకవేళ ఇదీ కాదనుకుంటే.. అత్యంత పవర్‌ఫుల్ గల అసెంబ్లీలో ఎమ్మెల్యేలతో స్పీకర్ నిర్ణయంతో హౌస్‌కమిటీ వేసే అవకాశం కూడా ఉన్నది. కానీ వీటన్నింటినీ వదిలేసి... కేంద్ర ప్రభుత్వం వద్ద గల సీబీఐని ఆశ్రయించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అంటే సీఎం రేవంత్‌రెడ్డికి తన ఆధీనంలోనే ఉన్న రాష్ట్ర విచారణ సంస్థలపై, పోలీస్ వ్యవస్థపై నమ్మకం లేదా? అనే ప్రశ్నలు ఎదురవుతున్నాయి. ఇలా రాష్ట్రంలో జరిగే వ్యవహారాలన్నింటినీ కేంద్ర ప్రభుత్వ సంస్థలకు అప్పగిస్తూ పోతే... ఇక రాష్ట్ర ప్రభుత్వం, రాష్ట్ర విచారణ వ్యవస్థలు ఉండి ఎందుకు అనే ప్రశ్నలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి కాళేశ్వరంపై సీబీఐతో విచారణ చేయించే అంత పెద్ద అవినీతి ఏమీకాదని కాంగ్రెస్ పార్టీ నేతలు గుసగుసలాడుతున్నారు. ఇప్పటికే విజిలెన్స్ రిపోర్ట్, ఘోష్ కమిషన్ నివేదికలో కాళేశ్వరం అవినీతికి సంబంధించి ఎలాంటి ఆధారాలూ లభించలేదని, అందుకే రాష్ట్ర సంస్థలతో విచారణ చేయిస్తే ఎలాంటి ప్రయోజనం ఉండదని రేవంత్‌రెడ్డి భావించినట్టుగా గాంధీభవన్ వర్గాలు చర్చించుకుంటున్నాయి. అందుకే బట్టకాల్చి మీదేసే విధంగా ఈ విచారణను సీబీఐకి ఇవ్వడం ద్వారా బీఆర్ఎస్‌ను, కేసీఆర్‌ను, హరీశ్‌రావును బద్నాం చేయాలనే రాజకీయ కుట్ర చేస్తున్నారని చర్చించుకుంటున్నారు.

### మోదీ ఏజెంట్‌గా రేవంత్?

సీఎం రేవంత్‌రెడ్డి పరిస్థితి తనవొకచోట.. మనసొకచోట అనే విధంగా ఉన్నదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఆయన మనసంతా బీజేపీ, మోదీ వద్ద ఉన్నదని, కానీ తప్పని పరిస్థితుల్లో ఆయన తనువు మాత్రం కాంగ్రెస్‌లో ఉన్నదనే విమర్శలున్నాయి. ఇందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి ఎప్పటికైనా బీజేపీకి, మోదీకి దగ్గరవ్వడం ఖాయమనే విమర్శలు రాజకీయవర్గాల్లో వినిపిస్తూనే ఉన్నాయి. అందుకే ఇప్పటినుంచే రూట్‌మ్యాప్ తయారుచేసుకుంటున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఇందులో భాగంగానే సీఎం రేవంత్‌రెడ్డి ప్రధాని మోదీకి ఏజెంట్‌గా మారారని ఆరోపిస్తున్నారు. ఇందుకు అనుగుణంగానే అవసరం లేకపోయినప్పటికీ, రాష్ట్ర వ్యవహారాలపై కేంద్ర ప్రభుత్వాన్ని ఇన్వాల్వ్ చేయించి.. రాష్ట్ర అధికారాలపై కేంద్రం పెత్తనం పెంచేలా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అదే విధంగా ఇప్పటివరకు సీఎం రేవంత్‌రెడ్డి తమ పార్టీ అగ్రనేత రాహుల్‌గాంధీ కన్నా.. ప్రధాని మోదీనే ఎక్కువసార్లు కలిశారని చెప్తున్నారు. రాహుల్‌గాంధీని కలిసినప్పుడు రేవంత్ ముఖంలో పెద్దగా సంతోషం కనిపించదని, మోదీని కలిసినప్పుడు మాత్రం ఆయన ముఖం వెయ్యి ఓల్టుల బల్బ్‌లా వెలిగిపోతుందని అంటున్నారు.



## మూడు రోజులు భారీ వర్షాలు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): వాయవ్య బంగాళాఖాతంలో అల్పపీడనం ఏర్పడిందని, ఇది రానున్న 24గంటల్లో బలపడనున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నది. దీని ప్రభావంతో వచ్చే మూడ్రోజులు రాష్ట్రంలో భారీ నుంచి అతి భారీ వర్షాలు కురుస్తాయని అంచనా వేసినట్టు తెలిపింది. 48 గంటల్లో ఒడిశా తీరాన్ని దాటే అవకాశం ఉన్నట్టు వెల్లడించింది. మంగళవారం ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, హనుమకొండ, జనగామ, జయశంకర్ భూపాలపల్లి, కామారెడ్డి, ఖమ్మం, కుమ్రంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మహబూబ్‌నగర్, మంచిర్యాల, మెదక్, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, సంగారెడ్డి, వరంగల్, వికారాబాద్ జిల్లాల్లో ఉరుములు, మెరుపులు, ఈదురుగాలులతో భారీ వర్షాలు కురిసినట్టు తెలిపింది. బుధ, గురువారాల్లో ఆదిలాబాద్, భద్రాద్రి కొత్తగూడెం, జగిత్యాల, జయశంకర్ భూపాలపల్లి, కరీంనగర్, కుమ్రంభీం ఆసిఫాబాద్, మహబూబాబాద్, మంచిర్యాల, ములుగు, నిర్మల్, నిజామాబాద్, పెద్దపల్లి, రాజన్న సిరిసిల్ల జిల్లాల్లో ఉరుములు, మెరుపులతో గంటకు 40కిలోమీటర్ల వేగంతో ఈదురు గాలులతో కూడిన భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నట్టు పేర్కొన్నది. దీంతో ఆయా జిల్లాలకు ఎల్లో అలర్ట్ జారీ చేసినట్టు వెల్లడించింది.

## కాళేశ్వరం కోసమే గేట్లు ఓపెన్

మొదటిపేజీ తరువాయి...

ప్రాజెక్టు విచారణ కోసమంటూ రెడ్‌కార్పెట్ పరిచి మరీ కేంద్ర దర్యాప్తు సంస్థను ఆహ్వానించారు. కేవలం ఈ ఒక్క కేసు దర్యాప్తునకు మాత్రమే సీబీఐకి ద్వారాలు తెరిచారు. ఈ మేరకు రాష్ట్రంలోకి సీబీఐ ప్రవేశాన్ని నిషేధిస్తూ గతంలో జారీచేసిన జీవో 51ని సవరించి.. జీవో 104 ద్వారా సీబీఐకి సాధారణ అనుమతి ఇచ్చారు. ప్రాజెక్టుపై దర్యాప్తును సీబీఐకి అప్పగిస్తున్నట్టు ఆదివారం అర్ధరాత్రి ప్రకటించిన ప్రభుత్వం తెల్లవారేసరికి శాసనసభ ప్రతిపాదనను సీబీఐ హెడ్ క్వార్టర్స్‌కు పంపింది. ఈ కేసును సీబీఐ దర్యాప్తునకు స్వీకరించడంపై రాజకీయవర్గాల్లో ఆసక్తికర విశ్లేషణలు వినిపిస్తున్నాయి.

### కక్ష సాధించేందుకే

సీబీఐ, ఈడీ, ఈసీ వంటి దర్యాప్తు సంస్థలను బీజేపీ తన జేబు సంస్థలుగా మార్చిందని, వాటిని ఉసిగొల్పుతూ ప్రతీకార రాజకీయాలకు పాల్పడుతున్నదని కాంగ్రెస్ కొన్నేండ్లుగా ఆరోపిస్తున్న సంగతి తెలిసిందే. సీఎం రేవంత్‌రెడ్డి సైతం నాలుగు రోజుల కిందటి వరకు ఇదే పాట పాడారు. కాంగ్రెస్ అధికారంలో ఉన్న పలు రాష్ట్రాల్లో సీబీఐకి ప్రవేశం లేకుండా ఇప్పటికీ నిషేధం కొనసాగుతున్నది. ఇప్పుడు కాళేశ్వరం కేసులో మాత్రం ప్లేటు ఫిరాయించారు. కేంద్రంలో కాంగ్రెస్ ప్రభుత్వాలు అధికారంలో ఉన్నంత కాలం తమ



ప్రత్యర్థులను వేధించడానికి సీబీఐని పావుగా వాడుకున్నదన్న విమర్శలు ఎదుర్కొన్నాయి. ఆ తరువాత బీజేపీ సైతం అదే ఒరవడిని మరింత ఉధృతంగా కొనసాగించిన ఘటనలు కోకొల్లలుగా ఉన్నాయి. ఈ నేపథ్యంలోనే తెలంగాణ సహా పలు రాష్ట్రాలు సీబీఐ ప్రవేశాన్ని నిషేధిస్తూ జీవోలు విడుదల చేశాయి. తాజాగా కేవలం తమ రాజకీయ లక్ష్యం కోసమే కాంగ్రెస్ సీబీఐ విషయంలో తన వైఖరిని మార్చుకున్నదని నిపుణులు అభిప్రాయపడుతున్నారు. కేవలం కేసీఆర్‌పై సీబీఐని ఉసిగొల్పి, ఆయనపై కక్ష సాధించేందుకే రేవంత్ సర్కారు ఈ ఒక్క కేసు కోసమే కేంద్ర సంస్థకు ద్వారాలు తెరిచిందని భావిస్తున్నారు.

### వారి బంధం బయటపడ్డట్టే

ప్రధానమంత్రి నరేంద్ర మోదీకి వ్యక్తిగతంగా ఆసక్తి ఉంటేనే సీబీఐ కేసులు ముందుకు కదులుతాయని ఇప్పటికే ప్రచారం జరుగుతున్నది. ఇందుకు ఏపీ ఘటనను ఉదాహరణగా పేర్కొంటున్నారు. రాజధాని అమరావతి నిర్మాణంలో చంద్రబాబు అవకతవకలకు పాల్పడ్డారని, సీబీఐ దర్యాప్తు జరపాలని ఏపీ మాజీ సీఎం జగన్మోహన్‌రెడ్డి ఎన్నిసార్లు విజ్ఞప్తిచేసినా సీబీఐ స్పందించలేదని గుర్తుచేస్తున్నారు. ఇప్పుడు సైతం కేంద్ర ప్రభుత్వరంగ సంస్థ ఎన్‌డీఎస్‌ఏ నివేదికను రాష్ట్ర ప్రభుత్వం ముందు పెడుతున్నా, బీజేపీ పెద్దల ప్రోద్బలం అవసరమని చెప్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల పర్యవేక్షణ, అజమాయిషీ కిందనే కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణం జరిగిందని, సీబీఐ దర్యాప్తు జరపాలంటే ముందుగా వారినే విచారించాల్సి ఉంటుందని సీనియర్ అధికారి తెలిపారు. కానీ రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులను నేరుగా దర్యాప్తు చేసే అధికారం సీబీఐకి లేదని, దానికి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అనుమతి తప్పనిసరి అని పేర్కొన్నారు. ఇందుకోసం రాష్ట్ర ప్రభుత్వం సెక్షన్-6 కింద నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంటుందని, దానికి అనుగుణంగా కేంద్రప్రభుత్వం సెక్షన్-5 కింద అనుమతించాల్సి ఉంటుందని సదరు సీనియర్ అధికారి వివరించారు. ఈ రెండు జరగాలంటే ప్రధానమంత్రికి, ముఖ్యమంత్రికి మధ్య కోఆర్డినేషన్ ఉంటేనే సాధ్యం అవుతుందని చెప్పారు. అదే జరిగితే రేవంత్‌రెడ్డి, మోదీకి మధ్య ఉన్న బంధం బయటపడుతుందని విశ్లేషించారు.

### తనను నమ్మడం లేదనే సీబీఐకి..

కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో భారీ అవినీతి జరిగిందని ప్రతిపక్షంలో ఉన్నప్పుడు, అధికారంలోకి వచ్చిన తర్వాత ఎంత గొంతు చించుకొని ప్రచారం చేస్తున్నా, కమిషన్లు వేసినా ప్రజలు నమ్మడం లేదని సీఎం రేవంత్‌రెడ్డికి అర్థమైందని విశ్లేషకులు చెప్తున్నారు. అందుకే కేసును సీబీఐకి అప్పగించాలని నిర్ణయించినట్టు అభిప్రాయపడుతున్నారు. ఫలితం విరుద్ధంగా వచ్చినా కాంగ్రెస్ ప్రభుత్వానికి రాజకీయంగా నష్టం తక్కువగా ఉండటానికే ఈ నిర్ణయం తీసుకున్నారన్న విమర్శలు కూడా ఉన్నాయి. ఇదే సమయంలో సీబీఐ దర్యాప్తు అంటే సుదీర్ఘకాలం సాగుతుంది. అనేక కేసుల్లో ఈ విషయం వెల్లడైంది. ఈ కేసులోనూ సీబీఐ దర్యాప్తులో ఆలస్యం జరిగితే కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీపై విమర్శలు చేయడానికి ఉపయోగపడుతుందని సీఎం భావిస్తున్నారట. అందుకోసమే తన చేతికి మట్టి అంటకుండా సీబీఐ పావును కదిపారని చర్చించుకుంటున్నారు. కాంగ్రెస్ చేసే విమర్శలను, సీబీఐ దర్యాప్తును ప్రజలు నమ్ముతారా? లేదా అనేదే ముఖ్యమని ఓ అధికారి పేర్కొన్నారు.

### బీఆర్ఎస్ నాయకులపై కేసు



బోథ్, సెప్టెంబర్ 2 : ఆదిలాబాద్ జిల్లా సొనాల మండల కేంద్రంలో బీఆర్ఎస్ నాయకులపై మంగళవారం కేసులు పెట్టారు. కాళేశ్వరంపై కాంగ్రెస్ తీరును నిరసిస్తూ సీఎం రేవంత్ దిష్టిబొమ్మను దహనం చేసి రాస్తారోకో చేశారు. అనుమతి తీసుకోలేదని మాజీ ఎంపీపీ తుల శ్రీనివాస్‌తోపాటు ఎనిమిది మందిపై కేసు నమోదు చేసినట్టు బోథ్ సీఐ వెంకటేశ్వర్‌రావు, ఎస్సై శ్రీసాయి తెలిపారు.



## కాళేశ్వరంపై సీబీఐతో దర్యాప్తు చేయండి

### కేంద్ర హోంశాఖకు రాష్ట్ర ప్రభుత్వం లేఖ

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అవకతవకలు, ప్రజాధనం దుర్వినియోగం, అవినీతి ఆరోపణలపై సీబీఐ దర్యాప్తు జరపాలని కోరుతూ రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర హోంశాఖకు లేఖ రాసింది. రాష్ట్రంలోకి సీబీఐ ప్రవేశాన్ని నిషేధిస్తూ గతంలో జారీచేసిన జీవో 51ని సవరిస్తూ.. జీవో 104 ద్వారా సీబీఐకి సాధారణ అనుమతి ఇచ్చినట్టు తెలిపింది. ఈ మేరకు సెక్షన్ 6 ప్రకారం నోటిఫికేషన్ విడుదల చేసినట్టు పేర్కొంది. మేడిగడ్డ బ్యారేజీలో పిల్లర్లు కుంగిపోవడంపై నేషనల్ డ్యామ్ సేఫ్టీ అథారిటీ (ఎన్‌డీఎస్‌ఏ) ఇచ్చిన నివేదిక ఆధారంగా ఈ దర్యాప్తునకు సిఫారసు చేసింది. ఆ నివేదికలో ప్రాజెక్టు ప్రణాళిక, డిజైన్, నాణ్యత, నిర్మాణంలో లోపాలు ఉన్నాయని పేర్కొంది. అలాగే జస్టిస్ పినాకి చంద్ర ఘోష్ కమిషన్ కూడా మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీల నిర్మాణంలో తీవ్రమైన లోపాలు, అవకతవకలు జరిగినట్టు నివేదికలో వెల్లడించిందని, దానిపై అసెంబ్లీలో చర్చ జరిపి.. ఆ నివేదికల ఆధారంగానే సీబీఐ దర్యాప్తునకు అప్పగించాలని ప్రభుత్వం నిర్ణయించినట్టు పేర్కొన్నది. కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంలో అంతర్రాష్ట్ర అంశాలు, కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రమేయం ఉన్నందున, దర్యాప్తు కోసం సీబీఐని ఆశ్రయించినట్టు తెలిపింది. సీబీఐ దర్యాప్తునకు అవసరమైన అన్ని రకాల సహకారాన్ని అందిస్తామని తెలంగాణ ప్రభుత్వం కేంద్రానికి తెలిపింది.



# జస్టిస్ ఘోష్.. రిపోర్టు ట్రాష్



- సీబీఐకి అప్పగించడం సిగ్గుచేటు: శ్రీనివాస్‌గౌడ్



నాగర్‌కర్నూల్, సెప్టెంబర్ 2: మాజీ సీఎం కేసీఆర్‌ను ఇబ్బంది పెట్టేందుకు కుట్ర జరుగుతున్నదని, ఇందులో భాగమే కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ విచారణను ప్రభుత్వం కోరిందని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ పేర్కొన్నారు. మంగళవారం నాగర్‌కర్నూల్ జిల్లా కేంద్రంలోని మాజీ ఎమ్మెల్యే మర్రి జనార్దన్‌రెడ్డి ఇంటి నుంచి అంబేద్కర్ చౌరస్తా వద్దకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాలన చేతగాని నేతలు కుట్రలకు తెరలేపుతున్నారని ధ్వజమెత్తారు. ఏదో రకంగా కేసీఆర్‌ను ఇబ్బందిపెట్టాలన్నదే రేవంత్ సర్కార్ ఆలోచన అని విమర్శించారు. ప్రాణాలను సైతం పణంగా పెట్టి తెలంగాణ సాధించుకున్నామని, కాంగ్రెస్ కుట్రలకు భయపడేదిలేదని తెలిపారు.

- తెలంగాణను ఏడారి చేసే కుట్ర: సబితా ఇంద్రారెడ్డి



కేసీఆర్‌పై కక్షతోనే కాళేశ్వరంపై సీబీఐ విచారణను రేవంత్ సర్కార్ కోరిందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. ప్రభుత్వ తీరును నిరసిస్తూ మంగళవారం మహేశ్వరం నియోజకవర్గ పరిధిలోని జిల్లెలగూడ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం నుంచి బాలాపూర్ చౌరస్తా వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ 'ప్రధాని మోదీ, ఏపీ సీఎం చంద్రబాబు, రేవంత్ కలిసి తెలంగాణను ఏడారిగా మార్చడానికి కుట్ర చేస్తున్నారు. బనకచర్లకు గోదావరి నీళ్లను తరలించుకుపోవడానికి మేడిగడ్డను నిర్వీర్యం చేస్తున్నారు. కాళేశ్వరం ప్రాజెక్టు అద్భుతమని సుప్రీంకోర్టు పేర్కొన్నప్పటికీ రేవంత్ సర్కార్‌కు కోర్టులపై నమ్మకం లేదు. కేంద్ర దర్యాప్తు సంస్థలను రాహుల్‌గాంధీ వ్యతిరేకిస్తుంటే రేవంత్ రెడ్‌కార్పెట్ పర్చుతున్నరు. 3 రోజుల కిందట సురవరం సంస్మరణ సభలో సీబీఐ మోదీ జేబు సంస్థ అని పేర్కొన్న రేవంత్‌రెడ్డి.. ఇప్పుడు సీబీఐకి స్వాగతం పలుకడం కుట్రకోణాన్ని ప్రతిభింభిస్తున్నది' అని పేర్కొన్నారు. – బడంగ్‌పేట

# కేసీఆర్‌ను ముట్టుకుంటే రాష్ట్రం అగ్నిగుండమే


న్యూస్ నెట్‌వర్క్ (నమస్తే తెలంగాణ), సెప్టెంబర్ 2: తెలంగాణ వరప్రదాయిని అయిన కాళేశ్వరం ప్రాజెక్టుపై సీబీఐ దర్యాప్తును కోరడాన్ని నిరసిస్తూ మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా నిరసనలు జరిగాయి. రేవంత్ సర్కార్‌కు వ్యతిరేకంగా బీఆర్ఎస్ శ్రేణులు రోడ్డెక్కారు. ఎక్కడికక్కడ రాస్తారోకోలు, ధర్నాలు చేపట్టారు. తెలంగాణను ఎడారిగా మార్చడానికి మోదీ, రేవంత్, చంద్రబాబు కుట్ర పన్నుతున్నారని ధ్వజమెత్తారు. కేసీఆర్‌పై చెయ్యి వేస్తే రాష్ట్రం అగ్ని గుండం అవుతుందని హెచ్చరించారు.




వనపర్తి టౌన్, సెప్టెంబర్ 2 : బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ జోలికొస్తే తెలంగాణ అగ్నిగుండంగా మారుతుందని మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి పేర్కొన్నారు. మంగళవారం వనపర్తి జిల్లా కేంద్రంలోని అంబేద్కర్ చౌరస్తాలో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా నిరంజన్‌రెడ్డి మాట్లాడుతూ తెలంగాణ సాధించిన కేసీఆర్ కృష్ణానదిపై పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టును నిర్మించి 12లక్షల ఎకరాలకు సాగునీరు, గోదావరి నదిపై రికార్డు స్థాయిలో మూడేండ్లలో కాళేశ్వరం ప్రాజెక్టును పూర్తి చేసి 70 లక్షల ఎకరాలకు నీళ్లు ఇచ్చి తెలంగాణను సస్యశ్యామలం చేశారని తెలిపారు. అటువంటి మహానాయకుడిపై కమిషన్ వేసి రేవంత్ పైశాచిక ఆనందాన్ని పొందుతున్నారని విమర్శించారు.



కురవి, సెప్టెంబర్ 2: కాళేశ్వరం ప్రాజెక్టును సీబీఐకి అప్పగించడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉన్నదని మాలోత్ కవిత, సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. మంగళవారం మహబూబాబాద్ పట్టణంలోని మెడికల్ కళాశాల హాస్టల్ భవన ప్రారంభోత్సవానికి వెళ్తున్న వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహా కాన్వాయ్‌ను కవిత, సత్యవతి ఆధ్వర్యంలో అడ్డుకున్నారు. అనంతరం సత్యవతి రాథోడ్, మాలోత్ కవిత మాట్లాడుతూ కాల్వల్లో తుమ్మలు మొలవడమే కాంగ్రెస్ పాలనకు నిదర్శనమన్నారు.



దేవరుప్పుల/తొర్రూరు/కొడకండ్ల, సెప్టెంబర్ 2: కాళేశ్వరం ప్రాజెక్టు విషయంలో ఎన్ని కుట్రలు చేసినా అంతిమంగా విజేతగా నిలిచేది కేసీఆరేనని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు తెలిపారు. స్థానిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకొనే సీబీఐని తెరపైకి తెచ్చారని చెప్పారు. జనగామ జిల్లా దేవరుప్పుల మండల కేంద్రం, కొడకండ్ల మండల కేంద్రంలోని అమరవీరుల చౌరస్తా వద్ద, మహబూబాబాద్ జిల్లా తొర్రూరు బస్టాండ్ చౌరస్తాలో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో ధర్నా చేపట్టారు. ఆయా కార్యక్రమాల్లో ఎర్రబెల్లి మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్ట్‌తో తెలంగాణ సస్యశ్యామలమైందని చెప్పారు.



ఆదిలాబాద్ (నమస్తే తెలంగాణ), సెప్టెంబర్ 2: బీఆర్ఎస్ పదేళ్ల పాలనలో సస్యశ్యామలంగా మారిన తెలంగాణను ఎడారిగా మార్చడానికి కాంగ్రెస్, బీజేపీ, తెలుగుదేశం పార్టీలు కుట్రలు చేస్తున్నాయని మాజీ మంత్రి జోగు రామన్న మండిపడ్డారు. ఆదిలాబాద్‌లో నిర్వహించిన ధర్నాలో రామన్న మాట్లాడారు. ఇది బడే భాయ్, చోటా భాయ్ అడుతున్న నాటకమని, దీని వెనుక చంద్రబాబు పాత్ర ఉన్నదని ధ్వజమెత్తారు.




రాజన్న సిరిసిల్ల జిల్లా వేములవాడ మండలం ఆరెపల్లి బ్రిడ్జి వద్ద కేసీఆర్ చిత్రపటానికి కాళేశ్వరం జలాలతో అభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



ఖమ్మం జిల్లా తల్లాడ మండల కేంద్రంలో మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య నేతృత్వంలో బీఆర్ఎస్ శ్రేణుల రాస్తారాకో




యాదగిరిగుట్టలో రాస్తారోకోలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి




జడ్చర్ల టౌన్, సెప్టెంబర్ 2 : కాంగ్రెస్ కుట్ర రాజకీయాలకు పాల్పడుతున్నదని, కేసీఆర్‌ను బద్నాం చేసేందుకు యత్నిస్తున్నదని మాజీ మంత్రి డాక్టర్ లక్ష్మారెడ్డి మండిపడ్డారు. మంగళవారం మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్ల తాసీల్దార్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణను ముంచి గోదావరి జలాలను ఆంధ్రాకు తరలించుకుపోయేందుకు చంద్రబాబు, రేవంత్‌రెడ్డి, మోదీ కలసి ఆడుతున్న నాటకంలో భాగమే కాళేశ్వరం ప్రాజెక్టుపై విచారణను సీబీఐకి అప్పగించే నిర్ణయమని పేర్కొన్నారు.

సీబీఐ విచారణ కోరడాన్ని నిరసిస్తూ మంగళవారం వికారాబాద్‌లో మాజీ ఎమ్మెల్యే మెతకుఆనంద్ ఆధ్వర్యంలో ర్యాలీ





కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుపెట్టుకొని సీబీఐ పేరిట ప్రభుత్వం కుట్రలు చేస్తున్నదని పేర్కొంటూ మంగళవారం తాండూరులో నిరసన వ్యక్తం చేస్తున్న బీఆర్ఎస్ సీనియర్ నేత పంజుగుల శ్రీశైల్‌రెడ్డి తదితరులు



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ఎమ్మార్వో సెంటర్‌లో ధర్నా చేస్తున్న మాజీ ఎమ్మెల్యే శంకర్‌నాయక్, బీఆర్ఎస్ నాయకులు



సంగారెడ్డి జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ వద్ద ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా, రాస్తారోకో చేస్తున్న ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, బీఆర్ఎస్ శ్రేణులు




సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పట్టణంలోని ప్రధాన రోడ్డు మార్గంలో కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన ర్యాలీ చేపడుతున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



సీబీఐ విచారణ పేరుతో కేసీఆర్‌ను ముట్టుకుంటే తెలంగాణ అగ్నిగుండం అవుతుందని జనగామ ఎమ్మెల్యే డాక్టర్ పల్లా రాజేశ్వర్‌రెడ్డి హెచ్చరించారు. కాలికి శస్త్ర చికిత్స అనంతరం రెండున్నర నెలల తర్వాత మంగళవారం తొలిసారి జనగామ జిల్లా కేంద్రానికి వచ్చిన పల్లాకు గులాబీశ్రేణులు, అభిమానులు స్వాగతం పలికారు. సాధించుకున్న రాష్ట్రంలో ప్రతి ఎకరాకు నీరందించాలనే సంకల్పంతో కాళేశ్వరం ప్రాజెక్టు కట్టిన బీఆర్ఎస్ అధినేతపై అసత్యాలు ప్రచారం చేస్తున్నారని పల్లా మండిపడ్డారు.



కుమురం భీం ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో ధర్నా చేస్తున్న ఎమ్మెల్యే కోవ లక్ష్మి



వనపర్తి జిల్లా కొత్తకోటలో నిర్వహించిన నిరసన కార్యక్రమంలో పాల్గొన్న దేవరకద్ర మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి


• క్యూలో పడిగాపులు

మహబూబాబాద్ జిల్లా గూడూరు పీఏసీఎస్‌లో యూరియా కోసం భారీగా తరలివచ్చి క్యూలో నిల్చున్న రైతులు, మహిళా రైతులు

# అల్లాడుతున్న అన్నదాత

## యూరియా కోసం బారులు.. గంటల తరబడి నిరీక్షణ.. రేవంత్‌రెడ్డి సర్కారు తీరుపై ఆగ్రహం

వేసిన పంటల అదును దాటిపోవడంతో యూరియా కోసం రైతులు అల్లాడిపోతున్నారు. పనులన్నీ మానుకొని ఎరువుల కేంద్రాల వద్ద పడిగాపులు కాస్తున్నారు. మంగళవారం ఉదయం నుంచే అన్నదాతలు ఎరువుల కేంద్రాల వద్ద క్యూ కట్టారు. పలుచోట్ల యూరియా బస్తాలు తక్కువ రావడంతో తోపులాట జరిగి పలువురికి గాయాలయ్యాయి. సొసైటీల వద్ద రోజుల తరబడి వేచియున్నా యూరియా దొరకకపోవడంతో అన్నదాతలు రోడ్డెక్కి ధర్నాలు చేశారు. వీరికి మద్దతుగా పలుచోట్ల బీఆర్ఎస్ నాయకులు రాస్తారోకో చేపట్టారు. మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డిని, మహబూబాబాద్ జిల్లా మరిపెడలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రూనాయక్‌ను కర్షకులు చుట్టుముట్టారు.

రాజన్న సిరిసిల్ల జిల్లాలో క్యూలో నిలబడలేక పెండెల మల్లయ్య సొమ్మసిల్లి పడిపోయాడు. మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో ఎల్లయ్య యూరియా కోసం రోదిస్తూ బోర్లా పడుకుని నిరసన వ్యక్తంచేశాడు. నర్సింహులపేటలో మహిళా రైతును హెడ్ కానిస్టేబుల్ నెట్టేయడంతో ఉద్రిక్తత చోటుచేసుకుంది. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలం పొగుళ్లపల్లి సొసైటీ వద్ద క్యూలో నిల్చొన్న ఆవుల నారాయణ ఫిట్స్ వచ్చి కిందపడిపోగా రైతులు స్థానిక దవాఖానకు తరలించారు. మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఐటీడీఏ భవనం వద్ద జరిగిన తోపులాటలో పలువురు రైతులు కిందపడ్డారు. ఖమ్మం జిల్లాలో బీఆర్ఎస్ శ్రేణులు రాస్తారోకో చేపట్టారు. వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురంలో మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి రైతులతో మాట్లాడి కేసీఆర్ హయాంలో యూరియా కొరతలేని విషయాన్ని గుర్తుచేశారు. రాష్ట్రంలో యూరియా కొరతపై సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు జూలకంటి రంగారెడ్డి తీవ్ర ఆందోళన వ్యక్తంచేశారు. సమస్యను వెంటనే పరిష్కరించాలని సీఎం రేవంత్‌రెడ్డికి లేఖ రాశారు.

-నమస్తే తెలంగాణ నెట్‌వర్క్

• యూరియా ఇచ్చేదాకా కదలం..


మహబూబాబాద్ జిల్లా బయ్యారంలో జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

• మహిళా రైతుపై పోలీస్ జులుం


మహబూబాబాద్ జిల్లా నర్సింహులపేటలో యూరియా కోసం వచ్చిన మహిళా రైతును నెట్టేస్తున్న హెడ్‌కానిస్టేబుల్

• క్యూకట్టిన రైతుకు ఫిట్స్


మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ మండలంలోని పొగుళ్లపల్లి సొసైటీ వద్ద క్యూలో నిల్చోగా ఫిట్స్ వచ్చి కిందపడిపోయిన రైతు ఆవుల నారాయణ

• మహిళా రైతుల ధర్నా


మంచిర్యాల జిల్లా చెన్నూర్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయం వద్ద యూరియా కోసం ధర్నా చేస్తున్న రైతులు

• రాస్తాపై రణం..


కరీంనగర్ జిల్లా గంగాధర మండలం కురిక్యాల వద్ద కరీంనగర్ -జగిత్యాల జాతీయ రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

• కేసీఆర్ ప్రభుత్వంలో కొరత లేదు


వనపర్తి జిల్లా ఖిల్లాఘణపురం సింగిల్‌విండో కార్యాలయంలో రైతులతో మాట్లాడుతున్న మాజీ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి

• కూపన్లతో సరిపెట్టుకోండి..


భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ఇల్లెందు వ్యవసాయ మార్కెట్ యార్డులోని సొసైటీ కార్యాలయం వద్ద రైతులు పొద్దంతా బస్తాల కోసం పడిగాపులుపడ్డారు. అధికారులు కూపన్లు పంపిణీ చేసి.. యూరియా వచ్చినప్పుడు వచ్చి తీసుకెళ్లాలని సూచించారు.

• అన్నదాతలకు దన్నుగా బీఆర్ఎస్ ధర్నా


కరీంనగర్ జిల్లా వీణవంకలో ధర్నా చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు

• మాజీ ఎమ్మెల్యేకు రైతుల గోడు..


భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నిజాంపేట సొసైటీ వద్ద రైతులు వరుసలో చెప్పులు పెట్టి పక్కన సేద తీరారు. ఇల్లెందు మాజీ ఎమ్మెల్యే హరిప్రియానాయక్‌కు రైతులు తమ గోడును వివరించారు.

• బీఆర్ఎస్ నాయకుల రాస్తారోకో


రైతుల పంటలకు సరిపడా యూరియా అందించాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో ఖమ్మం జిల్లా రూరల్ మండలం నాయుడుపేట బైపాస్ రింగ్‌రోడ్డు వద్ద జాతీయ రహదారిపై రాస్తారోకో చేస్తున్న బీఆర్ఎస్ శ్రేణులు.

• తోపులాటలో కిందపడిపోయిన రైతులు


మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం ఐటీడీఏ భవనం వద్ద తోపులాటలో కిందపడిన రైతులు

• ఎమ్మెల్యే కార్యాలయం ముట్టడికి యత్నం


మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలోని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి క్యాంప్ కార్యాలయం ముట్టడికి రైతులు యత్నించగా విషయం తెలుసుకున్న పోలీసులు వెంటనే అక్కడికి చేరుకొని రైతులను అడ్డుకున్నారు.

• ఎమ్మెల్యే నిలదీత


మహబూబాబాద్ జిల్లా మరిపెడలో ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ రాంచంద్రూనాయక్‌ను చుట్టుముట్టిన రైతులు

• పోలీస్ పహారా నడుమ పంపిణీ


ఖమ్మం జిల్లా కొణిజర్ల మండలం గోపవరం సొసైటీ వద్ద పోలీసు పహారాలో ఒక్కో రైతుకు ఒక బస్తా చొప్పున యూరియా పంపిణీ చేశారు.

'వేదిక' పేజీ కోసం సమకాలీన అంశాలపై వ్యాసాలను ఈ చిరునామాకు పంపించండి. మీ వ్యాసం 700 పదాలకు మించకుండా ఉండాలి. చిరునామా: 8-2-603, 1/7,8,9 కృష్ణాపురం, రోడ్ నం.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. e-mail: editpage@ntnews.com

## నమస్తే తెలంగాణ

# ట్రంప్ టారిఫ్‌లకు చుక్కెదురు

రాజు కన్నా మొండివాడు బలవంతుడంటారు. అమెరికా అధ్యక్షుడు ట్రంప్ రెండు లక్షణాలూ కలగలిసిన వ్యక్తి. ప్రజాస్వామిక పాలకునిలా కాకుండా రాజరికపు ఫర్మానాల తరహాలో పాలించడమంటే ఆయనకు ఇష్టం. ఆయన వ్యవహారశైలిని గమనించిన వారెవరికైనా ఇది చిరపరిచితమే. చతుర్విధోపాయాల్లో ఆయనకు దండోపాయమంటేనే ఎక్కువ మక్కువ. ఇష్టారాజ్యంగా ఆయన ప్రయోగిస్తున్న టారిఫ్‌లు ప్రపంచవ్యాప్తంగా అల్లకల్లోలం సృష్టిస్తున్నా, చివరకు అమెరికాలోనే వ్యతిరేకత వ్యక్తమవుతున్నా ఆయన పట్టించుకోరు. 1977లో వచ్చిన అంతర్జాతీయ అత్యవసర ఆర్థిక అధికారాల చట్టాన్ని ప్రయోగించిన మొదటి అధ్యక్షుడు ఆయనే. ఎడాపెడా సుంకాలు బాదిన అధ్యక్షుడిగా ఆయన చరిత్రలో నిలిచిపోతారు. కాకపోతే ఆ టారిఫ్‌లు మూణ్ణాళ్ల ముచ్చటే అయ్యే ప్రమాదం ఎదురవుతున్నది. తాజాగా ఆయన విధిస్తున్న టారిఫ్‌లు చట్టవిరుద్ధమని న్యాయస్థానం తీర్పు చెప్పడమే కాకుండా, టారిఫ్‌లను విధించే అధికారం రాజ్యాంగం కేవలం కాంగ్రెస్‌కే కట్టబెట్టిందని స్పష్టంచేసింది. టారిఫ్‌లు పన్నుల నిర్వచనంలోకి వస్తాయని, పన్నులను నిర్ణయించే బాధ్యత కాంగ్రెస్‌దే అని ఫెడరల్ అప్పీల్స్ కోర్టు తేల్చిచెప్పింది. పరిపాలనా వ్యవస్థ కట్టు తప్పి వ్యవహరిస్తే మొట్టికాయలు వేసి మూలకు కూర్చోబెట్టడంలో న్యాయవ్యవస్థ ప్రాముఖ్యం తెలిసేది ఇలాంటి సందర్భాల్లోనే.

ఇండియాపై ట్రంప్ 25 శాతం సాధారణ సుంకం, రష్యా దగ్గర చమురు, ఆయుధాలు కొంటున్నందుకు అదనంగా మరో 25 శాతం జరిమానా సుంకం, మొత్తంగా 50 శాతం బాదుతున్న సంగతి తెలిసిందే. ముఖ్యంగా వస్త్ర పరిశ్రమ, వ్యవసాయరంగం ఈ సుంకాల బరువు వల్ల తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నాయి. ఇప్పుడు ఆ దూకుడుకు కళ్లెం పడుతున్న సూచనలు కనిపిస్తున్నాయి. కాకపోతే ప్రస్తుత కీలక కోర్టు తీర్పు తక్షణమే అమల్లోకి రాదు. అక్టోబర్ 14 వరకు సుంకాలు అమల్లో ఉంటాయి. ఈలోగా దాఖలయ్యే అప్పీళ్లు అన్నిటిని కలిపి తర్వాత సుప్రీంకోర్టు విచారణ జరుపుతుంది. ప్రస్తుత తీర్పును ట్రంప్ సహజంగానే కొట్టిపారేశారు. వామపక్ష భావాలు కలిగిన జడ్జీలు దేశ వ్యతిరేక తీర్పునిచ్చారని మండిపడ్డారు. టారిఫ్‌లు విధించకపోతే అమెరికా ఆర్థిక, సైనిక శక్తి నిర్వీర్యమైపోతుందని గగ్గోలు పెడుతున్నారు. మరోవైపు ఈ తీర్పు ఫలితంగా అమెరికాతో పలుదేశాలు జరుపుతున్న వాణిజ్య చర్చలు డోలాయమానంలో పడ్డాయి. భారత్, బ్రెజిల్ తదితర బాధిత దేశాలు సహజంగానే వేచిచూసే ధోరణి ఎంచుకున్నాయి.

ఇప్పుడు అందరి దృష్టి సుప్రీంకోర్టుపై పడింది. అమెరికా సర్వోన్నత న్యాయస్థానంలోని తొమ్మిది మంది న్యాయమూర్తుల్లో ఆరుగురు రిపబ్లికన్ అధ్యక్షుల ద్వారా నియమితులైనవారే. అందులో ముగ్గురు స్వయంగా ట్రంప్ ఆమోదముద్రతో ధర్మపీఠాలెక్కినవారే. వారంతా ట్రంప్‌ను, ఆయన దుందుడుకు, దుస్సాహసిక విధానాలను గుడ్డిగా సమర్థిస్తారా? లేక రాజ్యాంగం సూచించిన అధికార విభజన సిద్ధాంతం వైపు మొగ్గుచూపి టారిఫ్‌లను కొట్టివేస్తారా? అనేది ఇప్పుడు బిలియన్ డాలర్ల ప్రశ్న. ఒకవేళ మెజారిటీ న్యాయమూర్తులు ట్రంప్‌కే జై కొడితే అప్రకటిత రాజరికంలోకి అమెరికా కూరుకుపోయినట్టే అనే వ్యాఖ్యలు వినిపిస్తుండటం గమనార్హం.

# రాళ్లెత్తిన కూలీపై సీబీఐ విచారణా?



గోసుల శ్రీనివాస్ యాదవ్

'తెలంగాణ కోటి ఎకరాల మాగాణం' కావాలని తపించిన అపర భగీరథుడిపై సీబీఐ దర్యాప్తు జరుపాలని రాష్ట్ర ప్రభుత్వం కేంద్ర ప్రభుత్వాన్ని కోరడం చూస్తుంటే 'తెలంగాణ కోసం కేసీఆర్ పడ్డ కష్టానికి ఇదా ప్రతిఫలం' అన్న నిర్వేదం ప్రజల్లో కనిపిస్తున్నది. ఏ ఉద్యమ స్ఫూర్తితో ప్రత్యేక తెలంగాణను సాధించారో, అదే ఉత్సాహంతో ప్రజల ఆశలను నెరవేర్చడానికి ఆయన కష్టించి పనిచేయడం ఇప్పుడు నేరమైపోయింది. గోదావరి-కృష్ణా నదులను కలపడానికి ఆయన చేసిన కృషి నేటి పాలకులకు తప్పులా కనిపిస్తున్నది.

ఈ నేపథ్యంలో కాళేశ్వరం ప్రాజెక్టు గురించి మరోసారి మననం చేసుకుందాం. కాళేశ్వరం ప్రాజెక్టు అంటే అది శ్రీరాంసాగర్ వలెనో, నాగార్జునసాగర్ వలెనో ఏక ప్రాజెక్టు కాదు. ఇది పలు ప్రాజెక్టుల సమాహారం. కాళేశ్వరం గొలుసుకట్టు ఎత్తిపోతల పథకాల హారం లాంటిది. రిజర్వాయర్లలో నీటిని నిల్వచేసి, ఎత్తిపోతల పథకాల ద్వారా వాటిని మళ్లించడం ఈ ప్రాజెక్టు ముఖ్య లక్ష్యం. దిగువన పోతున్న గోదావరిని ఎగువన ఉన్న హైదరాబాద్ వరకు ఎత్తిపోయడం, ఇందుకోసం పలుచోట్ల రిజర్వాయర్లు, ఎత్తిపోతల పథకాలు నిర్మించడం పెద్ద ఇంజినీరింగ్ అద్భుతం. అందుకే ఈ ప్రాజెక్టు ప్రపంచంలో అతిపెద్ద ఎత్తిపోతల పథకంగా గుర్తింపు పొందింది.

ఈ మహోన్నత ప్రాజెక్టులో అంతర్భాగంగా ఉన్న మేడిగడ్డ ప్రాజెక్టులో రెండు పిల్లర్లు పగుళ్లు రావడంతో ప్రస్తుతం రాద్ధాంతం నడుస్తున్నది. రూ.350 కోట్లు వెచ్చించి దీనికి మరమ్మతు చేయిస్తామని నిర్మాణ పనులు చేపట్టిన కాంట్రాక్టు సంస్థ అయిన ఎల్ అండ్ టీ కంపెనీ ముందుకు వచ్చింది. దానిపై దృష్టి పెట్టకుండా ఏడాదిగా అవినీతి, దర్యాప్తులు, కేసులంటూ కాలయాపన చేయడం ఎందుకో సామాన్యులకు అర్థం కావడం లేదు. ఇంత భారీ నిర్మాణంలో ఎక్కడైనా ఒకటి రెండు తప్పులు జరిగితే వాటిపై సంబంధిత ఇంజినీర్లపైనో, అధికారులపైనో చర్యలు తీసుకోకుండా ఏకంగా ముఖ్యమంత్రిగా పనిచేసిన వ్యక్తిపైనే దర్యాప్తునకు ఆదేశించడం విస్మయం కలిగించే విషయం. మాజీ మంత్రి హరీశ్‌రావుపైనా సీబీఐ కేసు పెట్టాలని కాంగ్రెస్ సిఫారసు చేసింది. తగిన పరిశీలనలు జరుపకుండా హడావుడిగా ప్రాజెక్టు పనులపై నిర్ణయాలు తీసుకున్నారన్నది కేసీఆర్‌పై ఉన్న ప్రధాన ఆరోపణ.

ఇక్కడ తెలంగాణ ఉద్యమాన్ని ఒకసారి యాది చేసుకోవాలి. నీళ్లు, నిధులు, నియామకాల కోసమే ప్రత్యేక తెలంగాణ ఉద్యమం వచ్చింది. తెలంగాణ సాధించిన తర్వాత యుద్ధ ప్రాతిపదికన ఆ లక్ష్యాలను సాధించుకోవాలన్న ఆశ, ఆశయం ఉద్యమనేతకు ఉండవా? అందుకే కాళేశ్వరం వంటి బృహత్తర ప్రాజెక్టు నిర్మాణాన్ని కేసీఆర్ లక్ష్యంగా పెట్టుకున్నారు. ఈలోగా ఎత్తిపోతల కోసం అవసరమైన విద్యుత్తు ఉత్పాదనపై దృష్టిపెట్టారు. మరోవైపు అత్యధికంగా నీటిని ఎత్తిపోయడానికి అవకాశాలు ఏమిటా అని మేధావులతో కలిసి ఆలోచనలు చేశారు. అందులో భాగమే ప్రాజెక్టుల రీ డిజైనింగ్. ప్రతిపాదనలకే పరిమితమైన ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు దుమ్ముదులిపారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని తుమ్మిడిహట్టి వద్ద ప్రాణహిత నదిపై ఆనకట్ట నిర్మించి అక్కడి నుంచి రామగుండం సమీపంలోని ఎల్లంపల్లి ప్రాజెక్టులోకి నీరు నింపాలన్నది ఆ ప్రాజెక్టు సారాంశం. ప్రాణహితలో తగినంతగా నీళ్లు లేకపోవడం, ముంపు విషయమై పొరుగున ఉన్న మహారాష్ట్ర నుంచి అభ్యంతరాలు రావడం, సింగరేణి బొగ్గు గనులున్న ప్రాంతాల మీదుగా కాల్వ తవ్వాల్సి ఉండటంతో అది అంత అనువైనది కాదని భావించారు. అందుకే ప్రాణహిత, గోదావరి సంగమ ప్రాంతమైన కాళేశ్వరం వద్ద ప్రాజెక్టు నిర్మించాలని ప్రతిపాదించారు. అది తుమ్మిడిహట్టికి 116 కిలోమీటర్ల దూరంలో ఉంటుంది. తుమ్మిడిహట్టి తర్వాత ప్రాణహిత నదిలో చెలిమెల వాగుతో పాటు, మరికొన్ని వాగులు, వంకలు కలవడంతో నీటి లభ్యత పెరిగింది. కట్టినదేదో భారీగానే ఉండాలని భావించి గొలుసుకట్టు రిజర్వాయర్లు, ఎత్తిపోతల పథకాలకు రూపకల్పన చేశారు. ఉమ్మడి కరీంనగర్, మెదక్, వరంగల్, నల్లగొండ జిల్లాలతో పాటు హైదరాబాద్ నగరానికి నీరందించాలని రూపకల్పన చేశారు. హైదరాబాద్‌లోని మూసీలో గోదావరి నీరు కలిస్తే



అనంతరం అది కృష్ణలో కలిసినట్టే. ఇంత తాపత్రయం పడటమే కేసీఆర్ చేసిన నేరమైంది.

కాళేశ్వరం ప్రాజెక్టుకు రూ.లక్ష కోట్ల రుణం తీసుకొచ్చారని ప్రభుత్వమే చెప్తున్నది. రుణం ఇచ్చినవాటిలో కేంద్ర ప్రభుత్వం నెలకొల్పిన పవర్ ఫైనాన్స్ కార్పొరేషన్ కూడా ఉన్నది. ఎటువంటి అనుమతులు, ధ్రువీకరణలు లేకుంటే ఇన్ని కోట్ల రుణం వస్తుందా? అనుమతులు లేకపోవడం వల్ల ఏదో నష్టం జరిగిపోయిందని చెప్పడం ప్రజలను తప్పుదోవ పట్టించడానికే. కాళేశ్వరం ప్రాజెక్టు ద్వారా భవిష్యత్తులో రాష్ట్ర ఆదాయం పెరుగుతుందన్న నమ్మకంతోనే ఇంత భారీగా రుణాలు ఇచ్చాయి. ప్రాజెక్టుల కోసం ఎక్కువ వడ్డీలకు రుణాలు తెచ్చారన్నది మరో ఆరోపణ. ఇచ్చిందెవరు? కేంద్ర సంస్థలు. అంటే తల్లి... బిడ్డకు అప్పు ఇచ్చినట్టు లెక్క. దీనికోసం భయపడలా? వడ్డీ రేట్లు తగ్గించుకునే అవకాశాలే లేవా? అవసరమైతే మొత్తం రుణాన్నే రద్దు చేసే పరిస్థితి రాదా? విదేశాల నుంచి తీసుకువచ్చే రుణాలంటే భయపడాలి కానీ, కేంద్రం ఇచ్చే అప్పులతో ముప్పు ఏముంటుంది? దీనిపై సీబీఐ ఏమని దర్యాప్తు చేస్తుంది?

> కాళేశ్వరం కారణంగా మేలు జరగలేదని ఎవరైనా అనగలరా? వరిసాగు విస్తీర్ణం పెరుగుదలకు, నాణ్యమైన సన్నరకం ధాన్యాల ఉత్పత్తికి కాళేశ్వరం సహకరించిందనే విషయం నిజం కాదా? రేషన్ షాపుల ద్వారా సన్నబియ్యం ఇవ్వగలుగుతున్నారన్నా, ఫిలిప్పీన్, సింగపూర్ వంటి దేశాలకు బియ్యం ఎగుమతి చేయగలుగుతున్నారన్నా అందులో కాళేశ్వరం పాత్ర లేదంటారా?

రైతుల కడుపు కొట్టి కేసీఆర్ ఏదో కమీషన్లు తీసుకున్నారని ఆరోపణలు వింటుంటే కడుపులో దేవినట్టవుతున్నది. ఆయన రైతులకు మోసం చేయడం ఏమిటి? ఆయన నిజంగా 'రైతు బంధు' కాదా? రైతుల కోసం ఆయన చేయనిదేమిటి? ఆయన రూపొందించిన రైతుబంధు పథకం ఇప్పుడు కేంద్రం పీఎం కిసాన్ పేరుతో దేశమంతటా అమలుచేయడం లేదా? ఈ పథకం వెనుక ఎంత ఆర్థికశాస్త్రం దాగి ఉన్నది. మార్కెట్ పరిస్థితులు, ఇతర కారణాల వల్ల పంటలకు గిట్టుబాటు ధర కల్పించలేకపోవచ్చు. కానీ, పంటకయ్యే ఖర్చులో కొంత భాగాన్ని ప్రభుత్వమే భరిస్తే రైతుపై భారం తగ్గుతుంది. రైతులు నాలుగు పైసలు కళ్లజూస్తారు. తద్వారా ఆత్మహత్యలు తగ్గుతాయి. ఆయన చేసిన మరో మంచి పని రైతు బీమా. బీమా ప్రీమియంను ప్రభుత్వమే చెల్లిస్తుంది. రైతు మరణిస్తే అతని కుటుంబానికి వారం రోజుల్లోనే రూ.5 లక్షల పరిహారం అందుతుంది. రైతుల కోసం ఇంతగా చేసిన నాయకుడిపై సీబీఐ దర్యాప్తు అంటే ఆయన పడ్డ శ్రమను పూర్తిగా విస్మరించడమే. బహుళ ప్రయోజనాలున్న ప్రాజెక్టును నిష్ప్రయోజనమని, వృథా వ్యయమని విమర్శలు చేస్తే అర్థం ఏముంటుంది? ప్రాజెక్టు కోసం మొత్తం రూ.లక్ష కోట్లు ఖర్చు చేస్తే ఆ లక్ష కోట్లు వృథా అయ్యాయనడం ఏ మేరకు సబబు?

ప్రాజెక్టుల నిర్మాణాల్లో చిన్న చిన్న లోపాలుండటం ప్రపంచంలో కొత్తేమీ కాదు. ఏపీలో పోలవరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన డయాఫ్రం వాల్ దెబ్బతిన్నది. మళ్లీ కొత్తది కడుతున్నారే తప్ప సీబీఐ విచారణలు జరిపించలేదు. ప్రజాధనం దుర్వినియోగమైతే బాధ్యులను గుర్తించి శిక్షించడంలో తప్పులేదు. కానీ, ఆ పేరుతో రాజకీయ, వ్యక్తిగత కక్షలు తీర్చుకుంటామంటే అది అభివృద్ధిని అపహాస్యం చేయడమే. కాళేశ్వరం ప్రాజెక్టును ఏదో మొక్కుబడిగా, హడావుడిగా నిర్మించలేదు. ఉద్యమ లక్ష్యసాధనలో భాగంగా జాప్యం లేకుండా సత్వరమే నిర్మించాలన్న ప్రయత్నం జరిగింది. ఆ క్రమంలో సాంకేతికంగా, నిర్మాణపరంగా చిన్న లోపాలు దొర్లాయి. అవి సరిచేయతగ్గవే. అందుకుతగ్గ ఇంజినీరింగ్ నైపుణ్యాలూ ఉన్నాయి. వాటిపై దృష్టి పెట్టి ఉంటే ఇప్పటికే సమస్యలన్నీ పరిష్కారమై ఉండేవి. ప్రాజెక్టు నిర్మాణంలో లోపాలున్నాయని చెప్పిన ప్రభుత్వం అసెంబ్లీలో చేసినదేమిటి? 665 పేజీల నివేదికను అసెంబ్లీలో ప్రవేశపెట్టి పూర్తిగా చదువుకోవడానికి కూడా సభ్యులకు పూర్తిగా అవకాశం ఇవ్వలేదు. క్షుణ్ణంగా చర్చించడానికి వీలు కలిగించకుండా ఒక్కరోజులో సమావేశాన్ని ముగించారు. సీబీఐచే దర్యాప్తు చేయించనున్నట్టు అర్ధరాత్రి ప్రకటించారు. దురుద్దేశాలే లేకపోతే ఇంత హడావుడి ఎందుకు?

(వ్యాసకర్త: బీఆర్ఎస్ సీనియర్ నాయకులు)

> **ప్రాజెక్టుల నిర్మాణాల్లో చిన్న చిన్న లోపాలుండటం ప్రపంచంలో కొత్తేమీ కాదు. ఏపీలో పోలవరం ప్రాజెక్టులో భాగంగా నిర్మించిన డయాఫ్రం వాల్ దెబ్బ తిన్నది. మళ్లీ కొత్తది కడుతున్నారే తప్ప సీబీఐ విచారణలు జరిపించలేదు. ప్రజాధనం దుర్వినియోగమైతే బాధ్యులను గుర్తించి శిక్షించడంలో తప్పులేదు. కానీ, ఆ పేరుతో రాజకీయ, వ్యక్తిగత కక్షలు తీర్చుకుంటామంటే అది అభివృద్ధిని అపహాస్యం చేయడమే అవుతుంది**

# నీళ్లిచ్చినందుకు నిప్పులు పోస్తరా..?

ఒక అబద్ధాన్ని నిజమని నమ్మించేందుకు మరో వంద అబద్ధాలు ఆడాలి! అనేక అపచారాలు చేయాలి!ఇప్పుడు కాంగ్రెస్ ప్రభుత్వం అదే చేస్తున్నది. ఒక అబద్ధాన్ని పదే పదే చెప్పి జనాన్ని మాయ చేయవచ్చు. కానీ, నిటారుగా కండ్లముందు నిలబడ్డ నిజాన్ని మాత్రం నీరుగార్చలేరు. ప్రపంచంలో అతి పెద్ద ఎత్తిపోతల పథకమైన కాళేశ్వరమే దీనికి సాక్ష్యం.



కోలేటి దామోదర్

ఒక బరాజ్‌లోని రెండు పియర్లు కుంగితే, ఒకే ఒక్క (7వ) బ్లాకులో సమస్య తలెత్తితే, మొత్తం కాళేశ్వరమే వృథా అయినట్టు ప్రచారం చేసి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. ఇప్పుడూ కాంగ్రెస్ ప్రభుత్వం అదే పాట పాడుతున్నది. కాళేశ్వరం ప్రాజెక్టు తెలంగాణకు వరప్రదాయిని. తెలంగాణను అన్నపూర్ణగా నిలిపిన కేసీఆర్‌ను రాజకీయంగా అప్రతిష్టపాలు చేసేలా రేవంత్‌రెడ్డి ప్రభుత్వం వ్యవహరిస్తుండటం హేయం. ప్రాజెక్టులు కట్టడమే పాపమా? నీళ్లు ఇవ్వడమే నేరమా? నీళ్లు ఇచ్చిన కేసీఆర్ మీద రాళ్లు వేస్తున్నారు. నీళ్లు తెచ్చిన తెలంగాణ కాటన్ మీద నిందలు వేస్తున్నారు. ఇదంతా చూసి తెలంగాణ అమరవీరుల ఆత్మలు ఘోషిస్తున్నాయి.

తెలంగాణకు వెన్నుపోటు పొడిచి ఏపీకి గోదావరి జలాలను రాసిచ్చేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న కుట్రలు అసెంబ్లీ సాక్షిగా బట్టబయలయ్యాయి. అసెంబ్లీలో జరిగిన దంతా తెలంగాణను బలిపెట్టి, బనకచర్ల కోసం రేవంత్ ఆడిన నాటకమే తప్ప, ఇంకోటి కాదనేది బహిర్గతమైంది. కాళేశ్వరంపై సీబీఐ విచారణ అనేది ఒక పార్టీపై జరుగుతున్న దాడి కాదు, తెలంగాణను ఎడారిగా మార్చే విద్రోహచర్య. ఓ వైపు రేవంత్, మరోవైపు బాబు, ఇంకో వైపు మోదీ.. ముగ్గురూ కలిసి తెలంగాణను శాశ్వతంగా దెబ్బతీసే దుర్మార్గమైన కుట్రలకు తెరతీశారు. అందులో భాగమే సీబీఐ విచారణ. ముందు నుంచి బీఆర్ఎస్ చెప్తున్న మాటే ఇప్పుడు నిజమైంది. గోదావరి జలాలపై తెలంగాణ హక్కులను కాలరాయడమే రేవంత్‌రెడ్డి ఎజెండా. కాళేశ్వరాన్ని బలిచేసేందుకే ఏపీ సీఎం చంద్రబాబు తెరపైకి తెచ్చిన బనకచర్లతోనే ఈ కుట్రలకు బీజం పడింది. మరోవైపు గోదావరి-కావేరి లింక్ పేరిట గోదావరి జలాలను తమిళనాడుకు తరలించుకుపోయేందుకు మోదీ కుట్ర చేస్తున్నారు. తెలంగాణ స్వీయ రాజకీయ అస్తిత్వ పార్టీ అయిన బీఆర్ఎస్ ఉన్నంత కాలం తమ ఆటలు సాగవని ఈ ముగ్గురికి ఎప్పుడో అర్థమైంది. అందుకే అందరూ కలిసి బీఆర్ఎస్‌పై ముప్పేట దాడి చేసే కుయుక్తులకు పాల్పడుతున్నారు. ఓ వైపు బనకచర్ల ముప్పుతోపాటు ఇచ్చంపల్లిని తెరపైకి తెచ్చి మొత్తంగా కాళేశ్వరాన్ని ముంచే కుతంత్రం చేస్తున్నారు. తెలంగాణ రైతుకు మరణశాసనం రాయాలన్నదే ఈ ముగ్గురి అంతిమ లక్ష్యం.

> బీడువారిన భూముల్లో నీళ్లు పారించి, పచ్చని పంటలతో తెలంగాణను సస్యశ్యామలంగా మార్చారు అపరభగీరథుడు కేసీఆర్. కాళేశ్వరం నిర్మించి రైతులకు కరువు తీరా సాగునీళ్లు అందించారు. వట్టిపోయిన శ్రీరాంసాగర్‌కు పునర్జీవం పోసి ఆయకట్టుకు పూర్తిస్థాయిలో ఆయువుపోశారు.


కానీ, తెలంగాణ జీవరేఖ లాంటి కాళేశ్వరాన్ని పడావు పెట్టాలని కాంగ్రెస్ చూస్తున్నది. అసెంబ్లీ వేదికగా ముఖ్యమంత్రి, మంత్రులు చేసిన వ్యాఖ్యలే అందుకు నిదర్శనం. మేడిగడ్డ ప్రాజెక్టుకు ఇప్పట్లో మరమ్మతులు చేసే ఉద్దేశమే ప్రభుత్వానికి లేదని స్పష్టంగా తేలిపోయింది. అధికారంలోకి వచ్చి 20 నెలలు గడుస్తున్నా కాంగ్రెస్ ప్రభుత్వం మేడిగడ్డను రిపేర్ చేయకపోవడం వెనుక పెద్ద కుట్ర దాగి ఉంది. ఆ కుట్రలో భాగంగానే సీబీఐను కాంగ్రెస్ సర్కార్ అస్త్రంగా వాడుకుంటున్నది.



తన నిర్వాకంతో ఎస్ఎల్‌బీసీ సొరంగాన్ని కుప్పకూల్చిన కాంగ్రెస్ ప్రభుత్వం నెలలు గడుస్తున్నా కార్మికుల మృతదేహాలను బయటికి తీసుకురావడం లేదు. ఇంత జరిగినా సొరంగాన్ని త్వరలోనే పునరుద్ధరించి, ఏడాదిన్నర, రెండేండ్లలో ఎస్ఎల్‌బీసీ ద్వారా నాలుగు లక్షల ఎకరాలకు నీళ్లిస్తామని చెప్తున్నారు. ఎస్ఎల్‌బీసీని పునరుద్ధరించేవాళ్లు 20 నెలలైనా కాళేశ్వరం ప్రాజెక్టులోని రెండు పిల్లర్లకు ఎందుకు మరమ్మతులు చేయలేకపోతున్నారు? ఆ పనెందుకు చేయడం లేదనే ప్రశ్నకు ప్రభుత్వం నుంచి సమాధానం కరువైంది. కాళేశ్వరానికి అయిన ఖర్చు రూ.94 వేల కోట్లయితే, అందులో మేడిగడ్డకైన ఖర్చు రూ.4 వేల కోట్లని, బరాజ్‌లో పగుళ్లు వచ్చిన బ్లాక్‌ను మరమ్మతు చేసేందుకు రూ.300 కోట్లు అవుతాయి. ఆ మొత్తాన్ని కూడా తామే భరిస్తామని నిర్మాణ సంస్థ ఎల్అండ్‌టీ చెప్తున్నది. కానీ, ప్రభుత్వం కావాలనే ఆ సంస్థకు అనుమతివ్వడం లేదు. దీని వెనుక కేసీఆర్‌ను ఎలాగైనా బద్నాం చేయాలన్న ఏకైక ఎజెండా కనిపిస్తున్నది. గోదావరి నీళ్లు వస్తే పిల్లర్లు కొట్టుకుపోతాయని కాంగ్రెస్ మంత్రులు అంటున్నారు. కానీ, ఇప్పటికీ లక్షల క్యూసెకుల నీళ్లు ఆ బరాజ్ గుండా పోతున్నాయి. ప్రాజెక్టులోని కెనాల్స్, టన్నెల్స్, ఇతర నిర్మాణాలు పటిష్ఠంగా ఉన్నాయి. 'ఇప్పుడు ప్రాజెక్టును ఇలాగే పడావు పెడతారా? కూలగొడుతున్నారా? లక్ష కోట్లు పెట్టి కట్టిన ప్రాజెక్టుకు మరమ్మతు చేయాలి కదా' అంటే కాంగ్రెస్ ప్రభుత్వం డొంకతిరుగుడు సమాధానంతో కాలయాపన చేస్తున్నది.

'కాళేశ్వరం ఓ సక్సెస్‌ఫుల్ ప్రాజెక్టు' అని వాటర్ మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేందర్‌సింగ్ కితాబిచ్చారు. కాళేశ్వరాన్ని ఇంజినీరింగ్ మార్వెల్‌గా పొగుడుతూ డిస్కవరీ చానల్ ఓ డాక్యుమెంటరీనే ప్రసారం చేసింది. కాళేశ్వరం భారత్‌లోనే అతిపెద్ద సాగునీటి ప్రాజెక్టు అంటూ అమెరికా పత్రిక 'వాషింగ్టన్ పోస్ట్' కొనియాడింది. ఇలా ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది ఇంజినీరింగ్ నిపుణులు, మేధావులు, ఆర్థికవేత్తలు, పత్రికలు మన కాళేశ్వరాన్ని వేనోళ్ల కొనియాడాయి. కాళేశ్వరం ఓ అద్భుతమని సుప్రీంకోర్టే ఇటీవల వ్యాఖ్యానించింది. అయినా, దానిపై బురదజల్లేందుకు కాంగ్రెస్ పెద్దలు చేయని విషప్రచారం లేదు. తెలంగాణ ప్రజలకు మేలు చేయాలన్న, కాళేశ్వరాన్ని రక్షించాలన్న ఆలోచన కాంగ్రెస్ ప్రభుత్వానికి లేనే లేదు. కేసీఆర్‌ను బద్నాం చేయాలన్న ఏకైక లక్ష్యంతో కాంగ్రెస్ ముందుకు పోతున్నదనేది నిర్వివాదాంశం. సూర్యుడిపైకి ఉమ్మితే అది తిరిగి మన ముఖానే పడుతుందనే సంగతిని రేవంత్ సర్కార్ మరిచిపోయింది. సీబీఐ లాంటి ఎన్ని విచారణలు జరిపించినా కేసీఆర్‌ను ఎవ్వరూ ఏమీ చేయలేరు. అరచేతిని అడ్డుపెట్టి సూర్యకాంతిని ఆపలేరన్నట్టుగా, కేసీఆర్ చరిష్మాను శాశ్వతంగా తొలగించి రాజకీయ లబ్ధి పొందాలనే భ్రమల్లో ఉన్న రేవంత్ సర్కార్‌కు తెలంగాణ ప్రజలు మాత్రం 'కీలెరిగి వాతపెట్టడం' ఖాయం.

(వ్యాసకర్త: తెలంగాణ రాష్ట్ర పోలీసు హౌసింగ్ కార్పొరేషన్ మాజీ చైర్మన్)




## ట్రంప్‌కు వ్యాపారమే ముఖ్యం



**భారతదేశంతో సంబంధాలను మెరుగుపరిచేందుకు దశాబ్దాలుగా అమెరికా ఎంతగానో కృషిచేసింది. చైనాతో పొంచి ఉన్న ప్రమాదాన్ని ఎదుర్కొనేందుకు వ్యూహాత్మకంగా అమెరికాకు భారత్ ఎంతో కీలకం. ఆ దిశగా ఎంతో పురోగతి కూడా సాధించాం. కానీ, ట్రంప్ తన కుటుంబ వ్యాపారాల కోసం అమెరికా ప్రయోజనాలను పణంగా పెట్టారు. పాక్‌తో వ్యాపారాల కోసం భారత్‌ను పక్కన పెట్టేశారు.**

**- జేక్ సలీవాన్,**
యూఎస్ మాజీ జాతీయ భద్రతా సలహాదారు

కొన్ని నెలలుగా కాలయాపన చేసి బీసీ సమాజాన్ని నమ్మిస్తూ, బురిడీ కొట్టిస్తూ వస్తున్న కాంగ్రెస్ పార్టీ.. స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహణకు ముందు మరో అధికారిక మోసానికి తెగబడింది. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు రాజ్యాంగబద్ధంగా కల్పిస్తామన్న ఆ పార్టీ ఇప్పుడు ప్రత్యేక జీవో ద్వారా కోటా పరిమితి ఎత్తివేసి స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్లు అమలు చేస్తామని ఊదరగొడుతున్నది. అసెంబ్లీ సాక్షిగా బిల్లులు మార్చి రాష్ట్ర ప్రజలను మరోసారి ఏమార్చింది.

# ఉత్తుత్తి ఉత్తర్వులు



శుభప్రద్ పటేల్



మూడు దశాబ్దాల కిందట సుప్రీంకోర్టు తీర్పుతో అమల్లోకి వచ్చిన రిజర్వేషన్ సీలింగ్‌ను సడలించే రాజ్యాంగ హక్కు రాష్ట్రానికి ఉంటుందా? న్యాయ సమీక్ష ముందు ప్రభుత్వ జీవో నిలబడుతుందా? దేశంలో ఏ రాష్ట్రమైనా సొంత జీవోలతో కోటా పరిమితికి మించి రిజర్వేషన్లు అమలు చేస్తున్నదా? రాష్ట్రపతి, గవర్నర్ వద్ద పెండింగ్‌లో ఉన్న బిల్లులపై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకోకూడదని, తీసుకున్నా అవి రాజ్యాంగపరంగా, న్యాయపరంగా చెల్లుబాటు కావని న్యాయనిపుణులు చెప్తున్నా, బీహార్ ఎన్నికల కోసం తెలంగాణలోని బీసీలను మోసం చేసేందుకు కాంగ్రెస్ ప్రయత్నిస్తున్నది.

దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 79 ఏండ్లు అయినా, నేటికీ బీసీ రిజర్వేషన్ల కోసం ఇంకా పోరాటాలు చేయాల్సి వస్తుందంటే దానికి కారణం తొలి ప్రధాని నెహ్రూనే. 1951లో జరిగిన జనగణనలో కులగణనను విస్మరించడమే కాకుండా, 1953లో నియమించిన కాకా కాలేల్కర్ కమిషన్ నివేదికను కూడా తిరస్కరించారు. 1980 మండల్ కమిషన్ సిఫారసు చేసిన విద్య, ఉద్యోగాల్లో బీసీలకు 27 శాతం రిజర్వేషన్లను కాంగ్రెస్ ప్రధానులు ఇందిర, రాజీవ్‌గాంధీ దశాబ్దం పాటు అమలు చేయలేదు. 1990లో వీపీ సింగ్ సర్కార్ మండల్ కమిషన్ సిఫారసులను అమలు చేయాలనుకున్నప్పుడు నాటి ప్రతిపక్ష నేత రాజీవ్‌గాంధీ వ్యతిరేకించారు. మండల్ కమిషన్ నివేదికను అమలు చేస్తే జాతి విచ్ఛిన్నమవుతుందని లోక్‌సభ సాక్షిగా చెప్తూ, బీసీ రిజర్వేషన్లను అడ్డుకునే ప్రయత్నం చేశారు. యూపీఏ-2 ప్రభుత్వంలో 2011లో చేసిన సామాజిక, ఆర్థిక కులగణన సర్వే డేటాను 2014 వరకు బహిర్గతం చేయలేదు. అంతేకాదు, ఉదయ్‌పూర్ డిక్లరేషన్ ప్రకారం బీసీలకు తెలంగాణలో 34 అసెంబ్లీ సీట్లు ఇవ్వాల్సి ఉండగా, 19 సీట్లు మాత్రమే ఇచ్చారు. రూ.150 కోట్లు ఖర్చు చేసి చేయించిన కులగణన సర్వే తప్పులతడకగా మారింది. 2014లో కేసీఆర్ సర్కారు అద్భుతంగా నిర్వహించిన సమగ్ర కులగణనలో తెలంగాణలో 3.68 కోట్ల మంది ఉన్నట్టు తేలగా, తాజా సర్వేలో 3.54 కోట్ల మంది ఉన్నట్టు తేలడం విడ్డూరం. 2014లో 51 శాతం బీసీలుంటే, రేవంత్ ప్రభుత్వం మాత్రం 46 శాతమే ఉన్నట్టు చెప్తున్నది. పదేండ్లలో జనాభా తగ్గుతుందా? పెరుగుతుందా?

స్థానిక సంస్థల్లో బీసీలకు జనాభా దామాషా ప్రకారం రిజర్వేషన్లు దక్కాలంటే రాజ్యాంగంలోని 243 డీ (6), 243 టీ (6)లను సవరణ చేయాల్సి ఉంటుంది. కానీ, ఈ విషయాన్ని కాంగ్రెస్ సర్కారు విస్మరిస్తున్నది. కాగా, రాష్ట్ర ప్రభుత్వానికి కులగణన చేసే అధికారం లేదన్న విషయం దేశాన్ని 50 ఏండ్లు పాలించిన కాంగ్రెస్‌కు తెలియదా? బీహార్ ప్రభుత్వం పెంచిన 65% రిజర్వేషన్లను పాట్నా హైకోర్టు కొట్టేసిన విషయం ఆ పార్టీకి తెలియదా? రిజర్వేషన్ల బిల్లులు రాష్ట్రపతి వద్ద పెండింగ్‌లో ఉండగా, ఆర్డినెన్స్ ఆమోదం పొందుతుందా? లోక్‌సభలో 234 ఎంపీలున్న కాంగ్రెస్ కూటమి 42% బీసీ రిజర్వేషన్ల కోసం పార్లమెంట్‌లో ఎందుకు పోరాటం చేయట్లేదు? 52 సార్లు ఢిల్లీ వెళ్లిన సీఎం రేవంత్ ప్రధాని మోదీని కలిసి రిజర్వేషన్ల గురించి ఎందుకు విజ్ఞప్తి చేయడం లేదు? కోటా పరిమితి ఎత్తివేతపై ఎవరైనా కోర్టులో పిటిషన్ వేస్తే, ఈ ప్రక్రియ నిలిచిపోతుందని న్యాయ నిపుణులు చెప్తున్నారు. కోర్టుకు ఎవరెళ్లినా, కేసీఆరే ఎన్నికలను అడ్డుకున్నారని ప్రచారం చేసి, పార్టీపరంగా రిజర్వేషన్లతో ఎన్నికలకు వెళ్లాలని కాంగ్రెస్ చూస్తున్నది. కాంగ్రెస్ చేస్తున్న ఇలాంటి కుట్రలను బీసీ సమాజం చూస్తూ ఊరుకోదు.

(వ్యాసకర్త: న్యాయవాది, తెలంగాణ బీసీ కమిషన్ మాజీ సభ్యులు)

# ఉత్తరాది విలవిల

**భారీ వర్షాలు, వరదలతో అతలాకుతలం ▪ జల దిగ్బంధంలో చిక్కుకున్న అనేక రాష్ట్రాలు**

- పదుల సంఖ్యలో ప్రజల మృత్యువాత, పలువురి గల్లంతు
- కొండచరియలు విరిగిపడి హైవేలపై ట్రాఫిక్‌కు అడ్డంకులు
- ఉప్పొంగుతున్న యమున.. ఢిల్లీలో ఇళ్ల లోకి వరద నీరు
- మరో అయిదు రోజుల పాటు భారీ వర్షాల హెచ్చరిక



వరద ధాటికి హిమాచల్‌లోని కుల్లు జిల్లా మనల్బూ డ్రైన్‌లో చిక్కుకున్న వాహనం

న్యూఢిల్లీ: భారీ వర్షాలు, వరదలతో ఉత్తర భారతం అతలాకుతలం అవుతున్నది. అనేక రాష్ట్రాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఊర్లకు ఊర్లు చెరువులను తలపిస్తుండగా రోడ్లు నీటమునిగిపోయాయి. అనేక ఇళ్లు కొట్టుకుపోయాయి. డజన్ల సంఖ్యలో ప్రజలు మృత్యువాత పడగా జమ్ము కశ్మీరు, ఉత్తరాఖండ్‌లో అనేకమంది వరద ప్రవాహంలో గల్లంతయ్యారు. గత కొన్ని రోజులుగా మేఘ విస్ఫోటాల వల్ల సంభవించిన ఆకస్మిక వరదల్లో ఉత్తరాఖండ్ చిక్కుకుంది. పంజాబ్‌లో 29 మంది మరణించగా, వేలాదిమంది నిరాశ్రయులయ్యారు. ఇటీవలి కాలంలో ఎన్నడూ లేనంత భీకరమైన వరదలను పంజాబ్ ఎదుర్కొంటున్నది. దేశ రాజధాని ఢిల్లీ, దాని పొరుగున ఉన్న నేషనల్ క్యాపిటల్ రీజియన్(ఎన్‌సీఆర్) కూడా ఇటువంటి పరిస్థితినే ఎదుర్కొంటున్నాయి. యమునా నది ఉప్పొంగి ప్రవహిస్తూ ఇళ్లను ముంచెత్తుతుండడంతో సమీపంలోని బ్యారేజీల నుంచి నీటి విడుదల ఎప్పటికప్పుడు జరుగుతున్న కారణంగా మరింత ప్రమాదం పొంచి ఉందని అధికారులు ప్రజలను అప్రమత్తం చేశారు. మరో ఏడు రోజుల వరకు తెరపి ఉండబోదని వాతావరణ శాఖ హెచ్చరించింది.

**మూతబడిన స్కూళ్లు, ఆఫీసులు**

జమ్ము కశ్మీరు, గురుగ్రామ్, యూపీ, చండీగఢ్‌తోసహా అనేక ప్రాంతాలలో పాఠశాలలు, ప్రైవేట్ కార్యాలయాలు మూతపడ్డాయి. భారీ వర్షం కారణంగా సోమవారం దాదాపు 20 కిలోమీటర్ల మేర ట్రాఫిక్ జామ్ కావడంతో మంగళవారం గురుగ్రామ్‌లోని ప్రైవేట్, కార్పొరేట్ కార్యాలయాలు మూతపడ్డాయి. వరదలు రోడ్లను ముంచెత్తడంతో ఢిల్లీ-ఎన్‌సీఆర్‌లో అనేక చోట్ల ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. జమ్ము కశ్మీరు, ఉత్తరాఖండ్‌లో అనేక చోట్ల కొండచరియలు హైవేలపై పడడంతో అనేక చోట్ల ట్రాఫిక్ స్తంభించిపోయింది.

**పంజాబ్‌లో 10 జిల్లాల్లో వరదలు**

భారీ వర్షాల కారణంగా వరదలు సంభవించడంతోపాటు డ్యాంల నుంచి నీటిని విడుదల చేయడంతో పంజాబ్‌లోని 10కిపైగా జిల్లాలు వరదల్లో చిక్కుకున్నాయి. గడచిన 25 ఏళ్లలో మొట్టమొదటిసారి సాధారణం కన్నా 74 శాతం అధిక వర్షపాతం నమోదైంది. ఆగస్టులో రాష్ట్రంలో రికార్డు స్థాయిలో 253.7 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. రానున్న రోజుల్లో పరిస్థితి మరింత దారుణంగా ఉండగలదని ముఖ్యమంత్రి భగవంత్ మాన్ ప్రజలను హెచ్చరించారు. వారం రోజుల్లో 29 మంది మరణించగా వేలాదిమంది నిరాశ్రయులయ్యారని మాన్ చెప్పారు.

**కశ్మీరులో 50 మంది మృత్యువాత**

జమ్ము కశ్మీరులో భారీ వర్షాలు, ఆకస్మిక వరదల కారణంగా గత పక్షం రోజుల్లో 50 మందికిపైగా మరణించారు. వరుసగా 8వ రోజు మంగళవారం కూడా జమ్ము-శ్రీనగర్ హైవే మూతపడింది. ఎడతెరపిలేని వర్షాల వల్ల రాజౌరీ, సంబా జిల్లాల్లో భూమి కుంగినట్లు వార్తలు అందాయి. దీంతో 19 కుటుంబాలను అధికారులు ఖాళీ చేయించినట్లు తెలిసింది. వర్షాలు, వరదల కారణంగా 500 ఇళ్లు దెబ్బతిన్నట్లు తెలిసింది.

**ఉత్తరాఖండ్‌లో 10 మంది మృతి**


భారీ వర్షాలు, మేఘ విస్ఫోటాలు సృష్టించిన ఆకస్మిక వరదలు ఉత్తరాఖండ్‌లో విలయాన్ని సృష్టిస్తున్నాయి. వరదల కారణంగా 10 మంది మరణించగా మరో 69 మంది కనిపించకుండాపోయారు. ఆకస్మిక వరదలకు అనేక ఇళ్లు ధ్వంసం కావడంతో ప్రజలతోపాటు జంతువులు సైతం శిథిలాల కింద చిక్కుకున్నాయి. ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, పంజాబ్, ఉత్తరాఖండ్, జమ్ము కశ్మీరు, హర్యానాలతోసహా వాయువ్య భారత్‌లో సెప్టెంబర్ 7 వరకు భారీ వర్షాలు ఉంటాయని వాతావరణ శాఖ హెచ్చరించింది. పంజాబ్, హర్యానా, చండీగఢ్, ఉత్తరాఖండ్, రాజస్థాన్, పశ్చిమ ఉత్తర ప్రదేశ్‌లో మంగళవారం అతి భారీ వర్షాలు పడతాయని కూడా ఐఎండీ తెలిపింది.

**హిమాచల్‌లో వరద విధ్వంసం**

హిమాచల్ ప్రదేశ్‌లోని మండి జిల్లాలో భారీ వర్షాలు పడుతూనే ఉన్నాయి. రోడ్లపై కొండచరియలు విరిగిపడడంతో అనేక ప్రాంతాలకు సంబంధాలు తెగిపోయాయి. వందలాది మంది నిరాశ్రయులయ్యారు. 257 రోడ్లు తెగిపోవడంతో వేలాదిమంది వాహనాలు ఎక్కడికక్కడే నిలిచిపోయాయి. మండి, బనాలా మధ్య అనేక చోట్ల కొండచరియలు పడడంతో వరుసగా రెండవ రోజు కులూ-మనాలీ, లహోల్-స్పిటి, లేహ్-లద్దాఖ్‌ను కలిపే మార్గాలను కలిపే కిరాత్‌పూర్-మనాలీ నాలుగు లేన్ల రహదారి మూతపడింది. దీంతో మండి, కులూలో 2,000కిపైగా వాహనాలు నిలిచిపోయాయి. పర్యాటకులు, ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటున్నారు.

## జిన్‌పింగ్, పుతిన్‌తో మోదీ చేతులు కలపడం సిగ్గుచేటు

**ట్రంప్ వాణిజ్య సలహాదారు వ్యాఖ్యలు**



వాషింగ్టన్, సెప్టెంబర్ 2: రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్, చైనా అధ్యక్షుడు జీ జిన్‌పింగ్‌తో భారత ప్రధాని నరేంద్ర మోదీ సన్నిహితంగా మెలగడం సిగ్గుచేటని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ వాణిజ్య సలహాదారు పీటర్ నవారో వ్యాఖ్యానించారు. అమెరికాతో సంబంధాలు కొనసాగించాలని ఆయన భారత్‌కు సూచించారు. "జీ జిన్‌పింగ్, వ్లాదిమిర్ పుతిన్ పక్కన మోదీ నిలబడడం సిగ్గుచేటు. మోదీ ఏం ఆలోచిస్తున్నారో నాకు తెలియదు. కాని రష్యాకు బదులుగా తాను అమెరికాతోనే ఉండాలని ఆయన అర్థం చేసుకుంటారని ఆశిస్తున్నాను" అని సోమవారం ఫాక్స్ న్యూస్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో నవారో తెలిపారు. చైనాలోని టియాంజిన్‌లో షాంఘై సహకార సంస్థ(ఎస్‌సీఓ) శిఖరాగ్ర సదస్సుకు హాజరైన మోదీ.. జీ జిన్‌పింగ్, పుతిన్‌తో భేటీ అయ్యారు. ఆ సందర్భంగా వారు ముగ్గురూ తీసుకున్న ఫొటోపై నవారో ఈ వ్యాఖ్యలు చేశారు. ఎస్‌సీఓ సదస్సును ఓ నాటకంగా నవారో అభివర్ణించారు. రష్యా నుంచి చమురు కొనుగోలు ద్వారా భారతీయ బ్రాహ్మణులు(బోస్టన్ బ్రాహ్మణులను సంపన్న వ్యాపారులుగా అమెరికాలో వ్యవహరిస్తారు) లబ్ధిపొందుతున్నారని కూడా ఆయన ఆరోపించారు.

## రాష్ట్రపతి, గవర్నర్లపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవచ్చా?

**బిల్లులకు గడువు కేసులో సుప్రీంకోర్టు ప్రశ్న**



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: తమిళనాడు కేసులో ఏప్రిల్ 8న ఇచ్చిన తీర్పులో నిర్దేశించిన మేరకు బిల్లుల ఆమోదంపై గడువును రాష్ట్రపతి లేదా గవర్నర్లు పాటించని పక్షంలో పర్యవసానాలు ఏమిటని సుప్రీంకోర్టు మంగళవారం తెలుసుకోగోరింది. అన్ని బిల్లులకు గంపగుత్తగా ఒకే గడువును నిర్దేశించే అధికారం తమకు ఉందా అన్న అనుమానాలను కూడా సుప్రీంకోర్టు ప్రశ్నించింది. రాష్ట్ర అసెంబ్లీలు ఆమోదించిన బిల్లులపై సమ్మతి తెలియచేసేందుకు గవర్నర్లు, రాష్ట్రపతికి గడువు విధించవచ్చా అన్న ప్రశ్నపై ఆరవ రోజు విచారణ సందర్భంగా సీజేఐ బీఆర్ గవాయ్ నేతృత్వంలోని ఐదుగురు న్యాయమూర్తుల సుప్రీంకోర్టు ధర్మాసనం ఈ వ్యాఖ్యలు చేసింది. ఏ రాజకీయ పార్టీ అధికారంలో ఉన్నదీ లేక ఉండిందీ అన్న అంశం ప్రాతిపదికన కాకుండా తాము ఈ విషయమై నిర్ణయం తీసుకుంటామని కూడా సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. గడువు లోపల బిల్లులపై గవర్నర్లు లేదా రాష్ట్రపతి నిర్ణయం తీసుకోని పక్షంలో వారిపై కోర్టు ధిక్కరణ కింద చర్యలు తీసుకునే అవకాశం ఉందా అని ధర్మాసనం ప్రశ్నించింది. గడువు దాటిన బిల్లులకు ఆమోదం లభించినట్లేనని భావించడమే దీని పర్యవసానమని తమిళనాడు ప్రభుత్వం తరపున హాజరైన సీనియర్ న్యాయవాది అభిషేక్ మనూ సింఘ్వీ జవాబిచ్చారు.

**రాష్ట్రపతి అంశాలపైనే రాజ్యాంగ వివరణ**

రాష్ట్రపతికి సంబంధించిన అంశాలకు మాత్రమే తమ రాజ్యాంగ వివరణను పరిమితం చేసుకుంటామని, కొన్ని రాష్ట్రాలు లేదా కొందరు వ్యక్తులకు సంబంధించిన కేసులకు కాదని సుప్రీంకోర్టు మంగళవారం స్పష్టం చేసింది. ఆంధ్రప్రదేశ్, తెలంగాణ లేదా కర్ణాటక వంటి రాష్ట్రాలను కూడా ఉదాహరణలుగా చూపిన పక్షంలో కేంద్రం సవివరంగా సమాధానం ఇవ్వవలసి ఉంటుందని కేంద్రం తరపున సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా వాదించారు. దీనికి ధర్మాసనం స్పందిస్తూ తాము ఒక్కో రాష్ట్రం కేసును చర్చించబోమని, కాని రాజ్యాంగ నిబంధనలను మాత్రమే చర్చిస్తామని తెలిపింది. తమిళనాడు అసెంబ్లీ ఆమోదించిన బిల్లులను గవర్నర్ సమ్మతి తెలియచేయకుండా ఏళ్ల తరబడి పెండింగ్‌లో ఉంచుతున్నారని ఫిర్యాదుచేస్తూ తమిళనాడు ప్రభుత్వం దాఖలు చేసిన పిటిషన్‌పై ఏప్రిల్ 8న సుప్రీంకోర్టు తీర్పు చెప్పింది. బిల్లులను తిరస్కరించే అధికారం గవర్నర్లకు లేదని సుప్రీంకోర్టు తన తీర్పులో స్పష్టం చేసింది.

## జడ్జితో బీజేపీ ఎమ్మెల్యే బేరాలు

- ఓ కేసులో ప్రలోభ పెట్టేందుకు యత్నాలు
- బండారం బయటపెట్టిన న్యాయమూర్తి
- కేసును విచారించబోనని బహిరంగ ప్రకటన
- మధ్యప్రదేశ్ న్యాయవర్గాల్లో సంచలనం

డబుల్ ఇంజిన్ ట్రబుల్ ఇంజిన్



భోపాల్, సెప్టెంబర్ 2: అధికార బీజేపీ ఎమ్మెల్యే ఒకరు ఒక కేసులో తనను ప్రభావితం చేయడానికి, ప్రలోభ పెట్టడానికి నేరుగా సంప్రదింపులు జరిపాడని రాతపూర్వకంగా పేర్కొంటూ, ఆ కేసును విచారించనని ఒక జడ్జి బహిరంగంగా ప్రకటించడం బీజేపీ పాలిత మధ్యప్రదేశ్‌లో సంచలనం సృష్టించింది. గనుల కంపెనీ యజమాని, బీజేపీ ఎమ్మెల్యే సంజయ్ పాఠక్ కేసు విషయమై తనతో చర్చించడానికి ప్రయత్నించాడని హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ విశాల్ మిశ్రా ఈ నెల 1న జారీ చేసిన ఉత్తర్వులో పేర్కొని, ఆ పిటిషన్‌ను విచారించడానికి తిరస్కరించారు. జడ్జి నిర్ణయం కోర్టు రూములో బాంబులా పేలి న్యాయవర్గాల్లో సంచలనం సృష్టించింది. అధికార బీజేపీ ఎమ్మెల్యే తనను నేరుగా కలిసి, కేసు విషయమై ప్రభావితం చేయడానికి ప్రయత్నించాడని సిట్టింగ్ జడ్జి ప్రకటించడం ఇదే తొలిసారి. ఈ కేసును చూస్తే మైనింగ్ మాఫియా ఎంత శక్తివంతమైనదో అర్థమవుతున్నది. ఈ కేసు వివరాల్లోకి వెళితే.. ఎమ్మెల్యే పాఠక్, ఆయన కుటుంబ సభ్యులకు చెందిన మైనింగ్ కంపెనీలు పలు అక్రమాలకు పాల్పడుతున్నాయని, దీనిపై ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా దర్యాప్తు సంస్థలు కూడా ఏమీ చర్యలు తీసుకోవడం లేదని ఆరోపిస్తూ కాట్నీకి చెందిన అశుతోష్ మను దీక్షిత్ ఈ ఏడాది జూన్‌లో హైకోర్టును ఆశ్రయించారు. ఇది జరిగిన కొద్ది రోజులకే చిత్రంగా ఎమ్మెల్యే మైనింగ్ సంస్థల్లో అక్రమాలు నిజమేనని ఖనిజ శాఖ ప్రకటించింది. అతనికి చెందిన మూడు కంపెనీలకు 443 కోట్ల రూపాయల జరిమానా విధిస్తున్నట్టు తెలిపింది. దీనికి అదనంగా జీఎస్టీ కూడా చెల్లించాలని ఆదేశించింది. ఈ క్రమంలోనే ఈ కేసులో న్యాయమూర్తిని కలిసి ప్రలోభ పెట్టడానికి ఎమ్మెల్యే పాఠక్ ప్రయత్నించారు.

## మేడ్ ఇన్ ఇండియా చిప్ విక్రమ్-32

**అంతరిక్ష ప్రయోగాలకు కీలకం**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: పూర్తి స్వదేశీ పరిజ్ఞానంతో రూపొందించిన 32-బిట్ ప్రాసెసర్ 'విక్రమ్'ను కేంద్ర ఐటీశాఖ మంత్రి అశ్వనీ వైష్ణవ్ ఢిల్లీలో నిర్వహించిన సెమికాన్ ఇండియా 2025లో మంగళవారం ఆవిష్కరించారు. భారత అంతరిక్ష పరిశోధన సంస్థ (ఇస్రో) రూపొందించిన ఈ చిప్‌ను అంతరిక్ష వాహక నౌకలలో ఉపయోగించనున్నారు. అత్యంత కఠినమైన వాతావరణ పరిస్థితులను తట్టుకొనేలా ఈ చిప్‌ను రూపొందించారు. మేక్ ఇన్ ఇండియా కార్యక్రమంలో భాగంగా మంత్రి ప్రభుత్వ ఆమోదిత ప్రాజెక్టులకు చెందిన మరో నాలుగు టెస్ట్ చిప్స్‌ను కూడా ప్రవేశపెట్టారు.

## వీసీల నియామకంలో సీఎం ప్రమేయం వద్దు

**సుప్రీంను ఆశ్రయించిన కేరళ గవర్నర్**

తిరువనంతపురం: యూనివర్సిటీ వైస్ చాన్సలర్ (వీసీ)ల నియామకంలో ముఖ్యమంత్రి పాత్రను సవాల్ చేస్తూ కేరళ గవర్నర్ రాజేంద్ర ఆర్లేకర్ మంగళవారం సుప్రీం కోర్టును ఆశ్రయించారు. ఏపీజే అబ్దుల్ కలామ్ టెక్నాలజికల్ యూనివర్సిటీ, కేరళ డిజిటల్ యూనివర్సిటీలకు చాన్సలర్‌గా కూడా ఉన్న గవర్నర్ ఈ రెండు రాష్ట్ర యూనివర్సిటీలలో వీసీలను నియమించే ప్రక్రియలో ముఖ్యమంత్రికి స్థానం కల్పించ రాదని కోరుతూ సుప్రీంకోర్టు కెక్కారు. అంతేగాక, వీసీల నియామకంలో ముఖ్యమంత్రి పాత్ర ఉంటుందన్న ఆగస్టు 18 నాటి సుప్రీం తీర్పును సమీక్షించాలని పిటిషన్ కోరింది.

## పోలీసులపై కాల్పులు జరిపి ఆప్ ఎమ్మెల్యే పరారీ

- పంజాబ్‌లో రేప్ కేసులో అరెస్ట్ సందర్భంగా ఘటన

కర్నాల్: పంజాబ్‌లో ఆప్ తిరుగుబాటు ఎమ్మెల్యే హర్మీత్ సింగ్ ధిల్లాన్ పఠన్‌మజ్రాను రేప్, మోసం అభియోగాలపై మంగళవారం కర్నాల్‌లో పోలీసులు అరెస్ట్ చేశారు. కస్టడీలో ఉన్న ఆయన పోలీస్ అధికారులపై కాల్పులు జరిపి అక్కడి నుంచి పరారయ్యారు. అంతకు ముందు ఆయన ఒక అధికారిపైకి వాహనాన్ని పోనిచ్చి ఆ తర్వాత స్కార్పియో వాహనంలో పరారయ్యారు. జిరక్‌పూర్‌కు చెందిన మహిళ ఒకరు హర్మీత్ సింగ్‌పై రేప్, చీటింగ్ ఆరోపణలు చేశారు. విడాకులు తీసుకున్నట్టు నమ్మించి తనను 2021లో హర్మీత్ సింగ్ పెండ్లి చేసుకున్నారని తెలిపారు. ఆ తర్వాత ఆయన తనను లైంగికంగా వేధించారని, అశ్లీల విషయాలను పంపించి బెదిరించారని ఆమె ఆరోపించారు.

## వరదలను వరంగా భావించండి!

- నీటిని టబ్బుల్లో దాచుకోండి
- పాక్ రక్షణ మంత్రి సలహా

ఇస్లామాబాద్: పాకిస్థాన్‌ను భారీ వరదలు ముంచెత్తిన వేళ.. ఆ దేశ రక్షణ మంత్రి ఖవాజా ఆసిఫ్ చేసిన వింత వ్యాఖ్యలపై సామాజిక మాధ్యమంలో నెటిజన్లు ట్రోల్ చేస్తున్నారు. ప్రస్తుతం వచ్చిన వరదలను ఒక వరంగా భావించాలని, దేశంలో ఆనకట్టలు కట్టే వరకు ఆ నీటిని టబ్బుల్లో నిల్వ ఉంచుకోవాలని ఆయన కోరారు. 'వరద పరిస్థితుల్లో చిక్కుకుని ఆందోళన చేస్తున్న వారు నీటిని మీ ఇంటికి తీసుకుపోండి. ఈ నీటిని ప్రజలు తమ ఇళ్లలోని టబ్బులు, కంటైనర్లలో నిల్వ ఉంచుకోండి. ఈ వరదలను దీవెనలుగా భావించి నీటిని దాచి ఉంచండి' అని ఆయన పాకిస్థాన్ న్యూస్ ఛానల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో పేర్కొన్నారు.

## 13న మోదీ మణిపూర్ పర్యటన!

**అల్లర్లు తర్వాత తొలిసారిగా**

ఇంఫాల్, సెప్టెంబర్ 2: ప్రధాని నరేంద్ర మోదీ ఈ నెల 13న మణిపూర్, మిజోరాం రాష్ట్రాల్లో పర్యటిస్తారని అధికారులు వెల్లడించారు. 2023లో మణిపూర్ అల్లర్లు ప్రారంభమైన తర్వాత మోదీ ఆ రాష్ట్రంలో పర్యటించడం ఇదే మొదటిసారి. అలాగే కొత్త బైరాబీ-సైరాంగ్ రైల్వే లైన్‌ను ప్రారంభించడానికి ఆయన తొలిసారి మిజోరాంకు వెళ్తున్నారు. మణిపూర్‌లో ఆయన కొత్తగా నిర్మించిన సచివాలయం, ఇతర అభివృద్ధి పనులను ప్రారంభిస్తారు. కాగా, మణిపూర్‌లో గత రెండేండ్లకు పైగా మైతీ, కుకీ జాతుల మధ్య హింస కారణంగా 260 మంది ప్రజలు మరణించారు. రాష్ట్రంలో ఫిబ్రవరి నుంచి రాష్ట్రపతి పాలన కొనసాగుతున్నది.



## పీఏతో ఎఫైర్.. నెస్లే సీఈవోపై వేటు

వేవీ: తన సహోద్యోగినితో సీక్రెట్ ఎఫైర్ కలిగి ఉన్నారన్న కారణంగా నెస్లే సంస్థ తన సీఈవో లారెంట్ ఫ్రెయిక్స్‌ను ఉద్యోగం నుంచి తొలగించింది. ఈ సంబంధం గురించి ఆయన కంపెనీకి తెలియజేయలేదని, ఇది నియమాల ఉల్లంఘన అని సోమవారం విడుదల చేసిన ఒక నోటిఫికేషన్‌లో పేర్కొంది. ఫ్రెయిక్స్ స్థానంలో సీనియర్ వైస్ ప్రెసిడెంట్, కంపెనీ కాఫీ వ్యూహాత్మక వ్యాపార యూనిట్ అధిపతి ఫిలిప్ నవ్రాటిల్‌ను కొత్త సీఈవోగా నియమించినట్టు చెప్పింది. ఫ్రెయిక్స్ తన వ్యక్తిగత సహాయకురాలితో ఎఫైర్ కలిగి ఉన్నట్టు తమ దర్యాప్తులో వెల్లడైనట్టు కంపెనీ తెలిపింది. న్యాయవాదుల సాయంతో కంపెనీ అధ్యక్షుడు పాల్ బల్కీ, లీడ్ ఇండిపెండెంట్ డైరెక్టర్ పాబ్లో ఇస్లా ఈ దర్యాప్తును చేపట్టినట్టు వెల్లడించింది. ఈ సందర్భంగా పాల్ బల్కీ మాట్లాడుతూ 'ఈ నిర్ణయం అవసరం. నెస్లే విలువలు, సూత్రాలు మాకు ఎంతో ముఖ్యం. 40 ఏండ్ల పాటు లారెంట్ చేసిన సేవలకు ధన్యవాదాలు' అని తెలిపారు.

## కచ్చతీవును వదులుకోం

**శ్రీలంక అధ్యక్షుడు దిసనాయకే స్పష్టీకరణ**

చెన్నై, సెప్టెంబర్ 2: భారత్, శ్రీలంక మధ్య దీర్ఘకాలంగా కొనసాగుతున్న కచ్చతీవు వివాదం శ్రీలంక అధ్యక్షుడు అనుర కుమార దిసనాయకే తాజా వ్యాఖ్యలతో మరోసారి తమిళనాడులో రాజకీయ చిచ్చు రగిల్చింది. తమిళనాడుకు చెందిన మత్స్యకారుల భావోద్వేగంతో ముడిపడిన ఈ భూవివాదం మళ్లీ తెరపైకి వచ్చింది. రెండు రోజుల పర్యటన నిమిత్తం సోమవారం జాఫ్నా చేరుకున్న దిసనాయకే కచ్చతీవుపై తమ సార్వభౌమాధికారాన్ని వదులుకునే ప్రసక్తి లేదని స్పష్టం చేశారు. కచ్చతీవును భారత్‌కు అప్పగించే విషయంపై చర్చలు జరపబోమని కూడా ఆయన చెప్పారు. దిసనాయకే నేవీ గస్తీ పడవలో జాఫ్నా నుంచి కచ్చతీవు ద్వీపాన్ని చేరుకున్నారు.

## లండన్‌లో రోడ్డు ప్రమాదం.. ఇద్దరు హైదరాబాదీల మృతి

**వినాయక నిమజ్జనానికి వెళ్లి వస్తుండగా ఘటన**



బడంగ్‌పేట, సెప్టెంబర్ 2: లండన్‌లో చదువుకునేందుకు వెళ్లిన హైదరాబాద్‌కు చెందిన ఇద్దరు విద్యార్థులు అక్కడ జరిగిన రోడ్డు ప్రమాదంలో మరణించారు. తెలుగు రాష్ట్రాలకు చెందిన తొమ్మిది మంది విద్యార్థులు వినాయక నిమజ్జనానికి వెళ్లి రెండు కారుల్లో తిరిగి వస్తుండగా ఒకదానినొకటి ఢీకొనడంతో నాదర్‌గుల్‌కు చెందిన తర్రె చైతన్య యాదవ్ (22), ఉప్పల్‌కు చెందిన రిషితేజ రాపోలు (21) మృతి చెందారు. ఈ ప్రమాదంలో నూతన్ తాటికాయలకు పక్షవాతం రాగా, సాయి గౌతమ్ రావుళ్ల వెంటిలేటర్‌పై ఉన్నాడు. ఈ ప్రమాదానికి సంబంధించి ఇద్దరిని పోలీసులు కస్టడీలోకి తీసుకోగా, మిగిలిన వారు రాయల్ లండన్ హాస్పిటల్‌లో చికిత్స పొందుతున్నారు. యూకేలోని ఎస్సెక్స్ నగరంలో సోమవారం ఈ ప్రమాదం జరిగింది. ప్రమాదకరమైన డ్రైవింగ్ కారణంగానే ఈ దుర్ఘటన జరిగినట్టు ఎస్సెక్స్ పోలీసులు అనుమానిస్తున్నారు. కాగా, మరణించిన చైతన్య యాదవ్ బాలాపూర్ మండలం నాదర్‌గుల్‌కు చెందిన ఐలయ్య, మల్లమ్మ దంపతుల చిన్న కుమారుడు. ఎంటెక్ చదవడానికి ఏడు నెలల క్రితం లండన్‌కు వెళ్లాడు.

## అర్హులైన మరాఠాలకు కున్బీ హోదా!

**మహారాష్ట్ర సర్కారు అంగీకారం ▪ దీక్ష విరమించిన మనోజ్ జరాంగే**

ముంబై, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఓబీసీలకు లభ్యమయ్యే రిజర్వేషన్ ప్రయోజనాలకు అర్హులయ్యే కున్బీ కుల సర్టిఫికెట్లను అర్హులైన మరాఠాలకు ఇవ్వడంతోసహా అన్ని డిమాండ్లను మహారాష్ట్ర ప్రభుత్వం అంగీకరించడంతో మరాఠా హక్కుల నాయకుడు మనోజ్ జరాంగే మంగళవారం తన ఐదురోజుల నిరాహార దీక్షను విరమించారు. ఆగస్టు 29న ముంబైలోని ఆజాద్ మైదాన్‌లో తన నిరశన దీక్షను ప్రారంభించిన జరాంగేకు రాష్ట్ర బీజేపీ సీనియర్ మంత్రి, మరాఠా రిజర్వేషన్‌పై క్యాబినెట్ ఉప సంఘం చైర్మన్ రాధాకృష్ణ విఖే పాటిల్ నిమ్మరసం ఇచ్చి దీక్షను విరమింపచేశారు. 43 ఏళ్ల జరాంగే తన దీక్ష ఫలప్రదం అయినందుకు కంటతడి పెట్టుకోగా ఆయన మద్దతుదారులు హర్షధ్వానాలు చేశారు. అనంతరం జరాంగే వైద్య చికిత్స నిమిత్తం అంబులెన్సులో అక్కడి నుంచి బయల్దేరి వెళ్లారు.

## బీహార్‌లో డిజిటల్ ఓటరు గుర్తింపు కార్డులు

**జారీచేయనున్న ఎన్నికల కమిషన్**

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: ఈ ఏడాది చివరిలో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న బీహార్ ఓటర్ల కోసం ఆధునిక టెక్నాలజీతో కూడిన ఓటరు గుర్తింపు కార్డులు అందచేయడానికి ఎన్నికల కమిషన్ సన్నద్ధమవుతోంది. ప్రస్తుతం జరుగుతున్న ఓటర్ల జాబితా సవరణలు పూర్తయి సెప్టెంబర్ 30న తుది జాబితా ప్రచురించిన తర్వాత అప్‌గ్రేడ్ చేసిన ఓటరు గుర్తింపు కార్డులు జారీచేసే ప్రక్రియ మొదలవుతుంది. ప్రస్తుతం ఓటర్ల వద్ద ఉన్న ఫొటో గుర్తింపు కార్డులకు(ఎపిక్) అదనపు సాంకేతిక హంగులను ఎన్నికల కమిషన్ కల్పించనున్నది. ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియ సందర్భంగా ఓటర్లు సమర్పించిన తాజా ఫొటోలతోపాటు పటిష్టమైన రక్షణ చర్యలతో కొత్త కార్డులను ఈసీ జారీ చేయనున్నది. ఎపిక్ కార్డులకు క్యూఆర్ కోడ్‌ను అదనంగా చేర్చడం ఓ ముఖ్యాంశంగా ఈసీ తెలిపింది. డూప్లికేషన్ లేదా ఫోర్జరీకి దీని వల్ల ఆస్కారం ఉండదని ఈసీ పేర్కొంది. ఈ డిజిటల్ కార్డును ఓటర్లు తమ స్మార్ట్‌ఫోన్లు లేక కంప్యూటర్లలో డౌన్‌లోడ్ చేసుకోవచ్చు. ఓటింగ్ సమయంలో ఓటరు కార్డు, డిజిటల్ కార్డు రెండూ చెల్లుబాటు అవుతాయి.



## సూడాన్‌లో కొండ చరియల బీభత్సం 1000 మంది దుర్మరణం

**తుడిచిపెట్టుకుపోయిన గ్రామం**

ఖార్టుమ్ (సూడాన్), సెప్టెంబర్ 2: ఆఫ్రికా దేశం సూడాన్‌లో భారీగా విరిగిపడిన కొండ చరియలు ఒక గ్రామాన్నే తుడిచిపెట్టేశాయి. పశ్చిమ సూడాన్‌లోని డార్ఫర్ రీజియన్‌లో మర్రా పర్వతాల సమీపంలో ఉన్న గ్రామంపైకి ఆగస్టు 31న భారీ వర్షం కారణంగా పెద్దయెత్తున కొండ చరియలు విరిగిపడటంతో సుమారు వెయ్యి మంది పౌరులు మరణించారు. ఈ ప్రమాదం నుంచి ఒక్క వ్యక్తి మాత్రమే ప్రాణాలతో బయటపడినట్టు సూడాన్ లిబరేషన్ ఆర్మీ సోమవారం తెలిపింది. మృతులలో పురుషులతో పాటు మహిళలు, పిల్లలు కూడా ఉన్నారని లిబరేషన్ ఆర్మీ ప్రతినిధి అబ్దుల్ వాహిద్ మహమ్మద్ తెలిపారు. బండరాళ్లు ఇళ్లను నుగ్గినుగ్గి చేశాయని, ఇప్పుడు ఆ ప్రాంతమంతా చదును చేసినట్టుగా మారిపోయిందని చెప్పారు. మృత దేహాలను వెలికితీయడానికి ఐరాస, అంతర్జాతీయ సంస్థలు సహాయం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు.

## అఫ్గాన్‌లో మరోసారి భూకంపం 1400 దాటిన మృతుల సంఖ్య


కాబుల్, సెప్టెంబర్ 2: సుమారు 6.0 తీవ్రతతో అల్లకల్లోలం చేసి జనావాసాలను శవాల దిబ్బగా మార్చిన భారీ భూకంపం దెబ్బ నుంచి ఇంకా తేరుకోకముందే మంగళవారం మరోసారి అఫ్గానిస్థాన్‌లో భూకంపం సంభవించింది. నాన్‌గర్హర్ ప్రావిన్స్‌లోని జలాలాబాద్ పట్టణానికి ఈశాన్యంలో 34 కిలోమీటర్ల దూరంలో భూకంప కేంద్రంగా 5.4 తీవ్రతతో సంభవించినట్టు అధికారులు తెలిపారు. కాగా, ఆదివారం నాటి భూకంపానికి 1,430 మందికి పైగా మరణించగా, మూడు వేల మందికి పైగా గాయపడినట్టు అధికారులు మంగళవారం వెల్లడించారు.



## వెలుగులు విరజిమ్మే మొక్కలు!


**చైనా పరిశోధకుల సృష్టి**

బీజింగ్, సెప్టెంబర్ 2: చీకట్లో వెలుగులు వెదజల్లే ఓ మొక్కను చైనా సైంటిస్టులు సృష్టించారు! ఈ విధమైన మొక్కలను రాబోయే రోజుల్లో వీధి దీపాలుగా వాడొచ్చునని వారు భావిస్తున్నారు. వెలుగులు విరజిమ్మేందుకు ఈ మొక్కలకు ఆఫ్టో-ఫ్లోఫర్ అనే ప్రత్యేక పార్టికల్స్‌ను చేర్చారు. ఇవి సూర్యరశ్మిని గ్రహించి కొన్ని గంటల పాటు కాంతిని వెదజల్లుతాయి. సూర్యరశ్మిలో కానీ, ఎల్ఈడీ వెలుతురులో కానీ కొన్ని నిమిషాల పాటు ఈ మొక్కలు ఉంచితే, తర్వాత దాదాపు రెండు గంటల పాటు ఇవి వెలుతురునిస్తాయని పరిశోధకులు వెల్లడించారు. 10 నిమిషాల్లో ఈ మొక్కను తయారుచేయవచ్చునని, ఇందుకు రూ.116 ఖర్చు అవుతుందని వివరించారు.



## బీట్‌రూట్ జ్యూస్‌తో వయోధికుల్లో బీపీకి చెక్!

న్యూఢిల్లీ: నైట్రేట్లు ఎక్కువగా ఉండే బీట్‌రూట్ జ్యూస్ వయోధికుల్లో రక్తపోటు(బీపీ)ను తగ్గిస్తుందని ఫ్రీ రాడికల్ బయాలజీ అండ్ మెడిసిన్‌లో ప్రచురితమైన తాజా అధ్యయనం వెల్లడించింది. బీట్‌రూట్ జ్యూస్ తాగినప్పుడు వాళ్ల నోళ్లలోని సూక్ష్మజీవుల్లో మార్పు వల్ల బీపీ తగ్గుతుందని తెలిపింది. నైట్రేట్ అధికంగా ఉన్న బీట్‌రూట్, తోటకూర, బచ్చలికూరల వంటి ఆహారం తిన్నప్పుడు నోట్లోని నైట్రేట్లు నైట్రిక్ ఆమ్లంగా మారతాయని పేర్కొన్నారు. ఇది రక్త నాళాలను శాంతపరిచి రక్త ప్రవాహం మెరుగవడానికి సహాయం చేస్తుందని అధ్యయనం తెలిపింది. బీట్‌రూట్ జ్యూస్ తాగడం వైద్యపరంగా ముఖ్యమైనదిగా, గుండె పోటు వచ్చే ప్రమాదాన్ని తగ్గించేందుకు తోడ్పడేదిగా పరిశోధకులు భావిస్తున్నారు.



## నటి రన్యారావుకు రూ.102 కోట్ల ఫైన్

బెంగళూరు, సెప్టెంబర్ 2: బంగారం స్మగ్లింగ్ కేసులో నటి రన్యారావుకు డైరెక్టరేట్ ఆఫ్ రెవెన్యూ ఇంటెలిజెన్స్ (డీఆర్ఐ) రూ.102 కోట్ల జరిమానా విధించింది. ఈ కేసులో మరో ముగ్గురికి కూడా రూ.50 కోట్లకు పైగా భారీ జరిమానా విధించారు. ప్రస్తుతం బెంగళూరు సెంట్రల్ జైలులో ఉన్న రన్యారావు, మరో ముగ్గురికి డీఆర్ఐ అధికారులు మంగళవారం 2,500 పేజీల జరిమానా నోటీసులు అందజేశారు. కాగా, రన్యారావు ఈ ఏడాది మార్చి 3న 14.8 కేజీల బంగారాన్ని దుబాయ్ నుంచి స్మగ్లింగ్ చేస్తూ బెంగళూరులోని కెంపెగౌడ అంతర్జాతీయ విమానాశ్రయంలో అధికారులకు చిక్కింది. ఆమె కర్ణాటక డీజీపీ ర్యాంక్ అధికారి కే రామచంద్రరావు సవతి కుమార్తె కావడం గమనార్హం.



## చిన్నబోతున్న చంద్రుడు!

న్యూఢిల్లీ: మన చంద్రుడు క్రమంగా కుంచించుకుపోతున్నాడు. వేలు, లక్షల సంవత్సరాలుగా ఇది కొనసాగుతున్నది. దాని పరిమాణం, ఉపరితలంపై వచ్చే మార్పులు భూమిపై తప్పక ప్రభావం చూపుతాయని తాజా అధ్యయనం గుర్తించింది. దీనిపై 'ప్లానెటరీ సైన్స్' జర్నల్ కథనం ప్రకారం, చంద్రుడు నెమ్మదిగా కుంచించుకుపోతున్నాడు. లక్షలాది సంవత్సరాలుగా జరుగుతున్న మార్పుల కారణంగా చంద్రుడి వ్యాసం 160 అడుగుల మేర తగ్గిందని నాసా సైంటిస్టులు అంచనా వేస్తున్నారు. చంద్రుడు భూమి మీద సముద్ర అలలను నియంత్రిస్తాడు కాబట్టి, దాని నిర్మాణం లేదా కక్ష్యలో చిన్న మార్పులు జరిగినా.. సముద్ర అలల తీరు మారుతుంది. తీరప్రాంత పర్యావరణ వ్యవస్థలు, వాతావరణ చక్రాలు కూడా ప్రభావితమవుతాయి.




## రోజుకు రెండు గంటలే స్మార్ట్ ఫోన్ వినియోగం!

**ప్రజలకు జపాన్ ప్రభుత్వం షాక్**

టోక్యో, సెప్టెంబర్ 2: ఒక అనూహ్య నిర్ణయంతో జపాన్ ప్రభుత్వం ప్రజలకు షాక్ ఇచ్చింది. డిజిటల్ వ్యసనం తగ్గించడానికి, ప్రజల మానసిక ఆరోగ్యాన్ని మెరుగుపర్చడానికి టయోకే పట్టణ పౌరులు ఇక నుంచి స్మార్ట్ ఫోన్ వినియోగాన్ని రోజుకు రెండు గంటలకు మాత్రమే పరిమితం చేయాలని ప్రతిపాదించింది. దీనికి సంబంధించిన ముసాయిదా ప్రతిపాదనలను మున్సిపల్ అసెంబ్లీ పరిశీలనలో ఉన్నాయి. ఆరోగ్యకరమైన డిజిటల్ అలవాట్ల పెంపు, నిద్ర నాణ్యతను పెంచడానికి, కుటుంబం, సమాజ బాంధవ్యాలు మెరుగుపర్చడానికి ఈ నిర్ణయం తీసుకుంటున్నట్టు తెలిపింది. అయితే ఈ ప్రతిపాదనను నగర పౌరులు తీవ్రంగా నిరసిస్తున్నారు.

## యోధుడు 'సురవరం'

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ప్రజాపోరాట యోధుడు సీపీఐ జాతీయ మాజీ ప్రధాన కార్యదర్శి, మాజీ ఎంపీ సురవరం సు ధాకర్‌రెడ్డి అని మాజీ న్యాయమూర్తి జస్టిస్ చంద్రకుమార్ కొనియాడారు. సుధాకర్‌రెడ్డి మరణం కమ్యూనిస్టు ఉద్యమానికే తీరనిలోటని శ్లాఘించారు. తెలంగాణ అమరవీరుల స్మారక ట్రస్ట్ ఆధ్వర్యంలో బంజారాహిల్స్‌లోని రావి నారాయణరెడ్డి ఆడిటోరియంలో మంగళవారం నిర్వహించారు.



తెలంగాణభవన్‌లో మాట్లాడుతున్న మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యేలు మాలోతు కవిత, గొంగిడి సునీత, టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రా ఆనంద్, వేద రజిని తదితరులు

# కేసీఆర్‌కు పార్టీనే ముఖ్యం

**కేటీఆర్, హరీశ్ కుడి ఎడుమ భుజాలు**

**పార్టీ ఉంటే ఎంత, పోతే ఎంత అని మాట్లాడొచ్చా?**

- ఎమ్మెల్సీ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేయడాన్ని స్వాగతించిన సత్యవతిరాథోడ్, బీఆర్ఎస్ మహిళా నేతలు
- ఎవరో.. కవిత భుజం మీద తుపాకీ పెట్టి కాల్చుతున్నారు
- ప్రజలు ఆమోదించేవిధంగా కవిత మాట్లాడలేదు: మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత
- కేసీఆర్‌కు కుటుంబం కంటే.. పార్టీ ముఖ్యమని కవిత సస్పెన్షన్‌తో మరోసారి రుజువైంది : మాలోత్ కవిత

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు బిడ్డ కంటే పార్టీనే ముఖ్యమని నిరూపితమైందని పలువురు బీఆర్ఎస్ మహిళా నేతలు పేర్కొన్నారు. కేసీఆర్‌కు పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రి హరీశ్‌రావు కుడి, ఎడుమ భుజాల వంటి వారని మాజీ మంత్రి సత్యవతి రాథోడ్ పేర్కొన్నారు. ఎమ్మెల్సీ కవితను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తున్నట్టు మంగళవారం బీఆర్ఎస్ పార్టీ అధికారికంగా ప్రకటించింది. అనంతరం తెలంగాణభవన్‌లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి సత్యవతి రాథోడ్, మాజీ ఎమ్మెల్యే గొంగిడి సునీత, మాజీ ఎంపీ మాలోత్ కవిత మాట్లాడారు. ఎమ్మెల్సీ కవిత సస్పెన్షన్‌ను స్వాగతిస్తున్నామని, ఇది గొప్ప నిర్ణయని చెప్పారు. సత్యవతి రాథోడ్ మాట్లాడుతూ.. గత మూడు నెలలుగా ఎమ్మెల్సీ కవిత తన తీరుతో బీఆర్ఎస్ పార్టీకి ఎంతో నష్టం కలిగించారని, ఆమె మాటలు పార్టీ శ్రేణులను ఎంతో బాధించాయని పేర్కొన్నారు. పేగు బంధం కన్నా, తనను నమ్ముకున్న కోట్లాది ప్రజలే ముఖ్యమని, కార్యకర్తల కన్నా.. తన కుటుంబసభ్యులు ఎక్కువేం కాదని కేసీఆర్ నిరూపించారని చెప్పారు. తన సొంత బిడ్డను పార్టీ నుంచి సస్పెండ్ చేస్తూ తీసుకున్న నిర్ణయం పట్ల సంతోషిస్తున్నామని తెలిపారు. ఈ విషయంలో గతంలో అనేకసార్లు ఎమ్మెల్సీ కవితకు నచ్చజెప్పాలని చూసినప్పటికీ, ఆమె వినలేదని పేర్కొన్నారు. అందువల్లే కేసీఆర్ ఇలాంటి సాహసోపేత నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. పార్టీ తర్వాతే ఎవరైనా అని కేసీఆర్ ఈ విధంగా సందేశం ఇచ్చారని చెప్పారు. కేసీఆర్ మళ్లీ ముఖ్యమంత్రిగా రావాలని తెలంగాణ ప్రజలు కోరుకుంటున్న తరుణంలో తన సొంత బిడ్డ పార్టీని అనేక ఇబ్బందులకు గురిచేసిందని చెప్పారు. కేటీఆర్, హరీశ్‌రావుపై కవిత నిరాధారమైన ఆరోపణలు చేశారని పేర్కొన్నారు. పీసీ ఘోష్ కమిషన్ కొండను తవ్వి ఎలుకను కూడా పట్టలేదని, అసెంబ్లీలో హరీశ్‌రావు ఒంటిచేత్తో కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఎదుర్కొన్నారని కొనియాడారు. ఒకవైపు హరీశ్‌రావు ప్రసంగాన్ని పార్టీ ఆస్వాదిస్తుంటే.. ఎమ్మెల్సీ కవిత మాత్రం విమర్శించడం చూస్తుంటే.. ఆమె ఏ లైన్‌లో ఉన్నారో రుజువు చేస్తున్నదని పేర్కొన్నారు.

**పార్టీ అవకాశాలు ఇచ్చినా మారలేదు : మాలోత్ కవిత**

కేసీఆర్‌కు కుటుంబం కంటే పార్టీనే ముఖ్యమని కవిత సస్పెన్షన్‌తో మరోసారి రుజువైందని మాజీ ఎంపీ మాలోత్ కవిత పేర్కొన్నారు. తనకు పార్టీ ఎన్నో అవకాశాలు ఇచ్చిందని వివరించారు. అసెంబ్లీలో హరీశ్‌రావు మాట్లాడిన తీరు బీఆర్ఎస్ కార్యకర్తల్లో ఎంతో ఉత్సాహం తెచ్చిందని తెలిపారు. ఈ ఉత్సాహాన్ని నీరుగార్చేందుకు ఎమ్మెల్సీ కవితతో కొందరు పార్టీ వ్యతిరేక వ్యాఖ్యలు చేయించారని పేర్కొన్నారు. ఆ వ్యాఖ్యల పట్ల పార్టీ కార్యకర్తలు కోపంగా ఉన్నారని చెప్పారు. సమావేశంలో టీజీపీఎస్సీ మాజీ సభ్యురాలు సుమిత్రా ఆనంద్, బీఆర్ఎస్ మహిళా నేతలునేతలు రజనీసాయిచంద్, సుశీలారెడ్డి, సత్యవతి, చారులత, నిరోషా తదితరులు పాల్గొన్నారు.

### కవిత భుజం మీద తుపాకీ పెట్టి కాల్చుతున్నారు: - గొంగిడి సునీత

ఎమ్మెల్సీ కవిత భుజం మీద తుపాకీ పెట్టి ఎవరో కాల్చుతున్నారని మాజీ ఎమ్మెల్సీ గొంగిడి సునీత ఆరోపించారు. కేసీఆర్ అంటే బీఆర్ఎస్, బీఆర్ఎస్ అంటే కేసీఆర్ అని స్పష్టంచేశారు. పార్టీ ఉంటే ఎంత, లేకుంటే ఎంత.. అని మాట్లాడటంపై క్షేత్రస్థాయిలో ఎంత ఆగ్రహం ఉన్నదో కవితకు తెలుసా? అని ప్రశ్నించారు. ప్రజలు ఆమోదించేవిధంగా ఆమె వ్యవహరించలేదని తెలిపారు. తన ప్రాణాన్ని పణంగా పెట్టి తెలంగాణ సాధించిన కేసీఆర్.. ఆ తర్వాత ప్రజలే తన బాస్‌లు అని ప్రకటించిన విషయాన్ని సునీత గుర్తుచేశారు.

## కేసీఆర్‌కు పార్టీయే ప్రథమం

### బీఆర్ఎస్ నేత, మాజీ మంత్రి కొప్పుల



హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ)/ధర్మపురి: బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు వ్యక్తిగత సంబంధాల కంటే పార్టీ ప్రయోజనాలే ముఖ్యమని మాజీ మంత్రి కొప్పుల ఈశ్వర్ పేర్కొన్నారు. కవితను పార్టీ నుంచి బహిష్కరిస్తూ కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నట్టు ఒక ప్రకటనలో తెలిపారు. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ పార్టీ 4కోట్ల మంది తెలంగాణ ప్రజల ఇంటి పార్టీగా మారిందని పేర్కొన్నారు. ఆనాడు ప్రత్యేక రాష్ట్రం కోసం ప్రాణత్యాగానికి కేసీఆర్ సిద్ధపడ్డారని, నేడు పార్టీ కోసం కన్నబిడ్డను కూడా సస్పెండ్ చేసిన గొప్ప నాయకుడు అని తెలిపారు. గతంలోనూ పార్టీ వ్యతిరేక చర్యలకు ఎవరు పాల్పడినా ఇలాంటి చర్యలే తీసుకున్నారని తెలిపారు. పార్టీకి నష్టం కలిగించే విధంగా మాట్లాడినందుకే కవితపై కేసీఆర్ కఠిన చర్యలు తీసుకున్నారని తెలిపారు. ఈ నిర్ణయంతో కేసీఆర్ నాయకత్వ పటిమ, కఠినమైన నిర్ణయాలు తీసుకోవడంలో తనకు ఉన్నటువంటి గొప్పతనాన్ని చాటుకున్నారని ప్రశంసించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై శాసనసభ, బయట బీఆర్ఎస్ పార్టీని బద్నాం చేసే కుట్ర జరుగుతున్న సమయంలో.. కవిత మాట్లాడిన మాటలు శత్రువు చేసే ఆరోపణలకు బలం చేకూర్చేలా ఉన్నాయని తెలిపారు. ప్రజలతో మమేకమైన నేతగా గుర్తింపు తెచ్చుకున్న హరీశ్‌రావుపై అవినీతి ఆరోపణలు చేయడం సరి కాదని పేర్కొన్నారు.

## కవిత కాళేశ్వరం వ్యాఖ్యల వెనుక కాంగ్రెస్

**ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి**



జనగామ, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): కాళేశ్వరంపై ఎమ్మెల్సీ కవిత వ్యాఖ్యల వెనుక కాంగ్రెస్ కుట్ర ఉన్నదనే అనుమానం కలుగుతుందని జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఒకపక్క సీబీఐ విచారణ అంటూ ప్రభుత్వం కుట్రలు పన్నుతుంటే.. మూలిగే నక్కపై తాటి పండు పడ్డచందంగా మరింత గాయపరిచేలా ఎమ్మెల్సీ కవిత మాట్లాడితే చర్య ఎందుకు తీసుకోవడం లేదని కార్యకర్తలు తమను అడిగారని పేర్కొన్నారు. కేసీఆర్ సమయం చూసి సముచిత నిర్ణయం తీసుకుంటారని నచ్చజెప్పామని తెలిపారు. పార్టీ, కార్యకర్తల కోసం కేసీఆర్ తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తామని తెలిపారు. పార్టీకి నష్టం కలిగించేలా ఎవరు మాట్లాడినా, కూతురైనా ఉపేక్షించేది లేదని తేల్చిన కేసీఆర్‌కు ధన్యవాదాలు తెలిపారు. కవిత గతంలో చేసిన వ్యాఖ్యలను సరిచేసుకుంటారని సమయం ఇచ్చారని, మారుతుందేమోనని వేచి చూశారని, అయి నా కాంగ్రెస్ కుట్రలకు ఆమె బలైపోయారని, పార్టీ బలికావొద్దనే కేసీఆర్ ఈ నిర్ణయం తీసుకున్నారని తెలిపారు.

## సీఎం కాన్వాయ్ వాహనాలపై 18 చలానాలు!

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కాన్వాయ్‌లోని ఒకే నంబర్‌గల వాహనాలు దారుణంగా ట్రాఫిక్ ఉల్లంఘనలకు పాల్పడుతున్నాయి. సీఎం కాన్వాయ్ వాహనాలు కావడంతో వాటిని నడిపేవారు ఇష్టారీతిన, మితిమీరిన వేగంతో ప్రయాణం చేస్తున్నారు. కాన్వాయ్‌లో ఉన్నప్పుడు కాకుండా.. అర్ధరాత్రిళ్లు, పట్టపగలు ఇష్టారీతిన సెక్యూరిటీ లేకుండా సీఎం కాన్వాయ్ వాహనాలు తిరుగుతుండటం పలు అనుమానాలకు తావిస్తున్నది. TG09 RR0009 నంబర్‌గల వాహనాలపై ఇప్పటివరకు మొత్తం 18 పెండింగ్ చలానాలు ఉన్నాయి. వాటి మొత్తం విలువ రూ.17,795. వీటిని ఎవరు చెల్లిస్తారనేది ప్రశ్నార్థకంగా మారింది.

# కవితపై వేటును స్వాగతిస్తున్నం

- కేసీఆర్‌తోనే కవితకు ప్రాధాన్యం
- కవిత వ్యాఖ్యలతో పార్టీకి నష్టం
- పార్టీ నుంచి బహిష్కరణ సరైనదే
- మాజీ ఎమ్మెల్యేలు, బీఆర్ఎస్ నేతలు

నమస్తే నెట్‌వర్క్: 'బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌తోనే ఎమ్మెల్సీ కవితకు ప్రాధాన్యం వచ్చింది. కేసీఆర్‌ను చూసే మేమంతా కవితతో పార్టీలో కలిసి పని చేశాం. గత కొన్నాళ్లుగా ఆమె వైఖరి పార్టీకి నష్టం చేకూర్చేలా ఉన్నది. పార్టీ ఎంతగా సహించినా, ఆమె మితిమీరి వ్యవహరించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలతోనే కవితను బీఆర్ఎస్ పార్టీ నుంచి అధిష్ఠానం బహిష్కరించింది. పార్టీ అధినేత కేసీఆర్ తీసుకున్న ఈ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం' అని బీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, పార్టీ నేతలు తెలిపారు. గతకొన్నాళ్లుగా ఎమ్మెల్సీ కవిత వైఖరి, విపరీత వ్యాఖ్యలతో బీఆర్ఎస్ పార్టీకి నష్టం జరిగే ప్రమాదం ఏర్పడిందని, అందుకే పార్టీ అధినేత కేసీఆర్ తగు నిర్ణయం తీసుకున్నారని మంథని మాజీ ఎమ్మెల్యే పుట్ట మధూకర్ పేర్కొన్నారు. కేసీఆర్‌పై సీబీఐ విచారణ పేరిట కాంగ్రెస్ సర్కార్ వేధించాలని చూస్తున్న తరుణంలోనే, కవిత కాళేశ్వరంపై ఆరోపణలు చేయడం క్షమించరాని విషయమని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అంటే నాలుగు కోట్ల తెలంగాణ ప్రజల పార్టీ అని, 60 లక్షల మంది సైనికులున్న పార్టీ అని చొప్పదండి మాజీ ఎమ్మెల్యే సుంకె రవిశంకర్ గుర్తుచేశారు. తప్పు చేస్తే ఎవరినీ సహించేది లేదని కేసీఆర్ గతంలో అన్నమాట ప్రకారం.. కన్నకూతురి కంటే కార్యకర్తల సంక్షేమమే ముఖ్యమని నమ్మి తీసుకున్న నిర్ణయం హర్షణీయమని పేర్కొన్నారు. కన్నకూతురు కంటే కష్టంలో ఉన్న పార్టీకి అండగా ఉన్న కార్యకర్తల భవిష్యత్తే ముఖ్యమని కేసీఆర్ భావించారని, ఆ మేరకు ఎమ్మెల్సీ కవితను పార్టీ నుంచి బహిష్కరిస్తూ తీసుకున్న నిర్ణయం హర్షించదగిందగినదని మాజీ ఎమ్మెల్యే పెద్ది సుదర్శన్‌రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పార్టీలో తప్పు చేస్తే కుటుం బ సభ్యులనైనా సహించబోనని కేసీఆర్ తేల్చి చెప్పినట్టయిందని చెప్పారు. పార్టీ కంటే ఎవరూ గొప్పకాదనే విషయాన్ని కేసీఆర్ నిరూపించారని మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి తెలిపారు. బీఆర్ఎస్ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న ఎమ్మెల్సీ కవితను పార్టీ నుంచి బహిష్కరిస్తూ తీసుకున్న నిర్ణయంతో అది నిరూపణ అయిందని తెలిపారు. 'పార్టీలో క్రమశిక్షణ తప్పిన ఎవరైనా, చివరకు కుటుంబ సభ్యులైనా సరే ఉపేక్షించేది లేదని గతంలో చెప్పిన కేసీఆర్ ఇప్పుడు అదే చేశారు. పార్టీకి నష్టం కలిగించే వ్యాఖ్యలు చేసినందుకే ఎమ్మెల్సీ కవితను బీఆర్ఎస్ నుంచి బహిష్కరించారు. ఆ నిర్ణయాన్ని స్వాగతిస్తున్నాం' అని రామగుండం మాజీ ఎమ్మెల్యే, బీఆర్ఎస్ పెద్దపల్లి జిల్లా అధ్యక్షుడు కోరుకంటి చందర్ తెలిపారు. కవిత వైఖరితో గత కొన్నిరోజులుగా బీఆర్ఎస్ పార్టీకి నష్టం జరుగుతున్నదని మాజీ ఎమ్మెల్యే నన్నపునేని నరేందర్ తెలిపారు. కార్యకర్తల భవిష్యత్తు కోసం కేసీఆర్ నిర్ణయం హర్షించతగినదని ఆయన పేర్కొన్నారు.

**మనోభావాలు దెబ్బతీసేలా కవిత వ్యాఖ్యలు**

బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల మనోభావాలను దెబ్బతీసేలా ఎమ్మెల్సీ కవిత పలుమార్లు పలు వ్యాఖ్యలు చేశారని నిజామాబాద్ ఎమ్మెల్యే బాజిరెడ్డి గోవర్ధన్ విమర్శించారు. పార్టీ వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతున్న కవితను అధినేత కేసీఆర్ పార్టీ నుంచి సస్పెండ్ చేయడాన్ని ఉమ్మడి నిజామాబాద్ జిల్లాకు చెందిన నేతలు, కార్యకర్తలు స్వాగతించారని తెలిపారు. క్రమశిక్షణ దాటితే సొంత బిడ్డ అయినా కూడా ఉపేక్షించబోమని కేసీఆర్ నిరూపించారని తెలిపారు. ఆపదలో ఉన్న పార్టీకి, అండగా ఉన్న కార్యకర్తల కంటే తన కూతురు ఎక్కువేమీ కాదని కేసీఆర్ నిరూపించారని కామారెడ్డి గంప గోవర్ధన్ తెలిపారు. బీఆర్ఎస్ పార్టీలో క్రమశిక్షణ దాటితే ఎంతటి వారైనా ఉపేక్షించబోమని కవిత సస్పెన్షన్ ద్వారా కేసీఆర్ నిరూపించారని హన్మంత్ షిండే ఒక ప్రకటనలో తెలిపారు. పార్టీకి నష్టం కలిగిస్తే సొంత కూతురిపై కూడా చర్యలు తీసుకోవడానికి వెనుకాడని వ్యక్తి కేసీఆర్ అని తెలిపారు.

**కవిత లేకున్నా బీఆర్ఎస్‌కు నష్టమేమీ లేదు**

ఎమ్మెల్సీ కవిత బీఆర్ఎస్ పార్టీలో లేకున్నా పార్టీకి వచ్చే నష్టమేమీ లేదని దేవరకొండ మాజీ ఎమ్మెల్యే రమావత్ రవీంద్రకుమార్ తేల్చి చెప్పారు. గత మూడు నెలలుగా కవిత తన వ్యాఖ్యలతో పార్టీకి ఎంతో నష్టం చేశారని ఆరోపించారు. పేగుబంధం కన్నా తనను నమ్ముకున్న కోట్లాది ప్రజలే ముఖ్యమంటూ కేసీఆర్ మరోసారి నిరూపించారని కొనియాడారు. పార్టీ లైన్ దాటితే ఎంతటి వారికైనా బీఆర్ఎస్‌లో శిక్ష తప్పదని అధినేత కేసీఆర్ నిరూపించారని నకిరేకల్ మాజీ ఎమ్మెల్యే చిరుమర్తి లింగయ్య చెప్పారు. బీఆర్ఎస్ అంటే క్రమశిక్షణ కలిగిన పార్టీ అని, పార్టీ అధినేత కేసీఆర్‌కు రక్త సంబంధీకులైనా, పార్టీ నాయకులైనా ఒక్కటేనని తెలిపారు.

### బీఆర్ఎస్‌కు కార్యకర్తలే ముఖ్యం

**బీఆర్ఎస్** పార్టీకి కార్యకర్తలే ముఖ్యమని, పార్టీ కంటే ఎవరూ గొప్పకాదని తెలంగాణ ఫుడ్స్ మాజీ చైర్మన్ మేడె రాజీవ్‌సాగర్, పేర్కొన్నారు. కవిత తీరుతో బీఆర్ఎస్ పార్టీకి నష్టం వాటిల్లుతున్నదని, అందుకే ఆమెను సస్పెండ్ చేస్తూ కేసీఆర్ నిర్ణయం తీసుకున్నారని రాజీవ్‌సాగర్ తెలిపారు. తెలంగాణ జా తిపిత కేసీఆర్ బాటలో, ఆయన స్ఫూర్తితో పార్టీలో పనిచేస్తామని పేర్కొన్నారు. పార్టీ నియమాలను ధిక్కరిస్తే ఎంతటి వారినైనా బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ ఉపేక్షించబోరని ఎమ్మెల్సీ కవిత విషయంలో తేటతెల్లమైందని బీఆర్ఎస్వీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పడాల సతీశ్ తెలిపారు. కవితను సస్పెండ్ చేస్తూ కేసీఆర్ తీసుకున్న నిర్ణ యం ఓ హెచ్చరికలాంటిదని పేర్కొన్నారు. బీఆర్ఎస్ అధినేత కేసీఆర్.. పార్టీలో తప్పు చేస్తే ఎవరినీ సహించబోరని రైతుబంధు సమితి ఉమ్మడి వరంగల్ జిల్లా మాజీ అధ్యక్షురాలు ఎల్లావుల లలితాయాదవ్ తెలిపారు. తప్పు చేస్తే కుటుంబ సభ్యులనైనా సహించమని కేసీఆర్ గతంలోనే తెలిపినట్లు గుర్తు చేశారు.

## పీఆర్సీ ప్రకటన లేదు.. సీపీఎస్ ఊసేలేదు!

మొదటిపేజీ తరువాయి...

చర్చలకు ఆహ్వానించింది. సచివాలయంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు పొన్నం ప్రభాకర్, డీ శ్రీధర్‌బాబు, ప్రభుత్వ సలహాదారు కే కేశవరావు, సీఎస్ రామకృష్ణారావు మంగళవారం జేఏసీ నేతలతో చర్చలు జరిపారు. మరికొన్ని అంశాలపై వచ్చే సోమవారం సీఎస్ వద్ద చర్చలు జరపాలని నిర్ణయించారు. ఈ సందర్భంగా నేతలు పీఆర్సీ, సీపీఎస్ రద్దు, టీచర్ల ఏకీకృత సర్వీస్‌రూల్స్ వంటి అంశాలను ప్రస్తావించగా సర్కారు దాటవేసింది. పెండింగ్‌లో ఉన్న బిల్లుల క్లియరెన్స్‌కు ఇకపై నెలకు రూ.700 కోట్ల చొప్పున మంజూరు చేస్తామని తెలిపింది. మెడికల్ ఇన్వాలిడేషన్ కమిటీ, జాయింట్ స్టాఫ్ కౌన్సిల్ ఏర్పాటు, డీపీసీల ఏర్పాటు, ఎన్నికల సందర్భంగా బదిలీ చేసిన వారిని పాత స్థానాలకు పంపించేందుకు ఒప్పుకుంది. హెల్త్‌కార్డుల విధివిధానాల ఖరారుకు ఈనెల 8న సమావేశం నిర్వహించనుంది. ఈహెచ్‌ఎస్‌తో పాటు, మరో 11 అంశాలను పరిశీలిస్తామని సర్కారు తెలిపింది.

**రాసిస్తేనే నమ్ముతాం..**


తమ సమస్యల పరిష్కారానికి మాటమాత్రం హామీ ఇస్తే ఒప్పుకోబోమని, అన్ని అంశాలపై లిఖితపూర్వకంగా హామీ ఇవ్వాలని జేఏసీ నేతలు డిమాండ్ చేశారు. తాము ఇచ్చిన డిమాండ్స్ నోటీసులోని వాటిలో వేటిని నెరవేర్చుతారో.. వాటిని లిఖితపూర్వకంగా ఇవ్వాల్సిందేనని పట్టుబట్టారు. దీంతో జేఏసీతో చర్చలు ముగిసిన వెంటనే అరగంటలో లిఖితపూర్వకంగా ఇస్తామని ప్రభుత్వం ప్రకటించింది. చర్చలు మధ్యాహ్నం 2:20 గంటల ప్రాంతంలో ముగిశాయి. అయితే సాయంత్రం 4:30 గంటల వరకు కూడా ప్రభుత్వం నుంచి లిఖితపూర్వక హామీ రాలేదు. ఎట్టకేలకు సాయంత్రం 5:30గంటల తర్వాత కొన్ని అంశాలపై స్పష్టతనిచ్చారు.

**కార్యాచరణ వాయిదా**

చర్చల సందర్భంగా కొన్ని అంశాలపై స్పష్టతరావడం, సోమవారం మళ్లీ చర్చలుండటంతో ఉద్యోగుల జేఏసీ తమ కార్యాచరణను వాయిదావేసింది. ఈ నెల 8 నుంచి 19 వరకు నిర్వహించనున్న బస్సుయాత్ర, అక్టోబర్ 12న తలపెట్టిన చలో హైదరాబాద్‌ను వాయిదావేసినట్టు జేఏసీ చైర్మన్ మారం జగదీశ్వర్, సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు ప్రకటించారు. జేఏసీ అదనపు ప్రధాన కార్యదర్శి పుల్గం దామోదర్‌రెడ్డి, సదానందంగౌడ్, ఏ సత్యనారాయణ, పీ మధుసూదన్‌రెడ్డి, వంగ రవీందర్‌రెడ్డి, బీ శ్యామ్, స్థితప్రజ్ఞ, మణిపాల్‌రెడ్డి, కస్తూరి వెంకటేశ్వర్లు తదితరులు ఈ సమావేశంలో పాల్గొన్నారు.

## సైబర్ నేరాల కట్టడికి 'వ్యూహ' ల్యాబ్స్

**డీజీపీ జితేందర్**



హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): సైబర్ నేరాలను ఎదుర్కొనేందుకు సృజనాత్మకత, ముందుచూపు అవసరమని డీజీపీ జితేందర్ పేర్కొన్నారు. రాష్ట్రంలో సైబర్ నేరాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ, సైబర్ సెక్యూరిటీ బ్యూరో (సీఎస్‌బీ) సంయుక్తంగా ఏర్పాటు చేసిన 'వ్యూహ ల్యాబ్స్- సైబర్ ఇన్నోవేషన్ హబ్'ను మంగళవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా డీజీపీ జితేందర్ మాట్లాడుతూ.. 'వ్యూహ ల్యాబ్స్' రాష్ట్రానికే కాకుండా దేశానికే ఆదర్శంగా నిలుస్తుందని చెప్పారు. డిజిటల్ సెక్యూరిటీ పరికరాలను అభివృద్ధి చేసే వ్యవస్థను 'వ్యూహ ల్యాబ్స్' అందిస్తుందని సీఎస్‌బీ డీజీ శిఖాగోయెల్ తెలిపారు. సైబర్ నేరాల నుంచి పౌరులు, సంస్థలను రక్షించేందుకు 'వ్యూహ ల్యాబ్స్' ఎంతో ఉపకరిస్తుందని హైదరాబాద్ ట్రిపుల్ ఐటీ డైరెక్టర్ ప్రొఫెసర్ సందీప్ శుక్లా చెప్పారు. 3,000 చదరపు అడుగుల విస్తీర్ణంలో ఏర్పాటైన సైబర్ ఇన్నోవేషన్ హబ్ ద్వారా స్టార్టప్‌లు, విద్యా సం స్థలు, పరిశ్రమలు కలిసి సైబర్ భద్రతకు ఆధునిక పరిష్కారాలను రూపొందిస్తాయి. ఆంత్రప్రెన్యూర్‌షిప్‌ను ప్రోత్సహిస్తూ కొత్త ఆలోచనలను ఆవిష్కరించడం, పరిశోధించడం, వాటిని విస్తృతంగా వినియోగించే ఉత్పత్తులుగా మార్చడం ఈ హబ్ ప్రధాన లక్ష్యం.

## ప్రతి 500 పశువులకు ఓ గోశాల

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ప్రతి 500 పశువులకు ఒక గోశాల ఏర్పాటు చేయడం వల్ల ప్రత్యక్షంగా 30-40 మందికి ఉద్యోగ అవకాశాలు, పరోక్షంగా 75-100 మందికి పరోక్ష జీవనోపాధి అవకాశాలు సృష్టిస్తుందని రాష్ట్ర పశుసంవర్ధకశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి సవ్యసాచి ఘోష్ చెప్పారు. గోశాలలకు ఏడాదికి 1కోటి ఆర్థిక సాయం అందించే కార్పొరేట్ కంపెనీలు బోర్డులో నాన్-ఎగ్జిక్యూటివ్ సభ్యత్వాన్ని పొందుతాయని తెలిపారు. ఈ మేరకు ఆయన గోశాల ప ర్యావరణ వ్యవస్థ అభివృద్ధి విధానం -2025 పాలసీని విడుదల చేశారు.




**సంధ్య 70MM A/c ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్**
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

రాజధాని డీలక్స్ ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్ | మల్లిఖార్జున 70ఎంఎం ఎ/సి - కూకట్‌పల్లి

ప్రసాద్ - ఎన్.టి.ఆర్.గార్డెన్స్
PVR ఆర్.కె - బంజారాహిల్స్
PVR పి.వి.ఆర్- మూసారాంబాగ్
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్
PVR నెక్సస్ మాల్ - కూకట్‌పల్లి
PVR గలేరియా - పంజాగుట్ట
PVR పివిఆర్ మాల్ - ఎర్రమంజిల్
PVR ప్రెస్టన్ ప్రైమ్ - గచ్చిబౌలి
PVR ఐకాన్ - హైటెక్ సిటీ
PVR SMR వినయ్- మియాపూర్
PVR ATRIUM మాల్ - గచ్చిబౌలి
PVR PRISM మాల్ - గచ్చిబౌలి
లులు మాల్ - కూకట్‌పల్లి
CCPL - మల్కాజ్‌గిరి
డి.ఎస్.ఎల్ - ఉప్పల్
మంత్రామాల్ - అత్తాపూర్
సుధ సినిమాస్- శాలిబండ
టిఎన్ఆర్ - కొంపల్లి
ఐనాక్స్ - బంజారాహిల్స్
జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ
ఎం.పి.మాల్ - కాచిగూడ
సత్వనెక్లిస్ మాల్స్ - కవాడిగూడ
అశోక ఎ/సి - వై.జంక్షన్
ఎఎంఆర్ మాల్ - మౌలాలి
ఎఎఎ సినిమాస్ - అమీర్‌పేట్
ఎఎంబి సినిమాస్ - గచ్చిబౌలి
ఎ.ఆర్.టి సినిమాస్ - ఎల్.బి.నగర్
మీరజ్ సినిమాస్ - దిల్‌సుఖ్‌నగర్
మీరజ్ సినిమాస్ - ఐడిపిఎల్
మీరజ్ సినిమాస్ - చందానగర్
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
లక్ష్మినరసింహ - మియాపూర్
స్కైమాల్ - సనత్‌నగర్
ప్లాటినమ్ - గచ్చిబౌలి
ఎంక్యూబ్ మాల్- అత్తాపూర్
ఏషియన్ సినీ స్క్వేర్ - ఉప్పల్
ముక్తా ఎం.జె.ఆర్ - నారపల్లి
జిపిఆర్ మాల్- కూకట్‌పల్లి
ఏషియన్ రాధిక - కాప్రా
సినీప్లానెట్ ఎ/సి - కొంపల్లి
లక్ష్మీకళ ఎ/సి - మూసాపేట్
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల
షా కాంప్లెక్స్ - చింతల్
టివోలి - సికింద్రాబాద్
విజయలక్ష్మి - ఎల్‌బినగర్
సినీమార్ట్ - ఆర్.సి.పురం
జెపి సినిమాస్ - చందానగర్
యుకె సినీప్లెక్స్ ఎ/సి - నాచారం

GEETHA FILM DISTRIBUTORS

# ఈ నెల 5న బ్రహ్మాండమైన విడుదల




**సుదర్శన్ 35 ఎంఎం ఎ/సి ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్**
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

అర్జున్ 70 ఎంఎం ఎ/సి- కూకట్‌పల్లి | వైజయంతి 70 ఎంఎం ఎ/సి-నాచారం | శ్రీరమణ కాంప్లెక్స్- అంబర్‌పేట్
శ్రీసాయిరాం 70 ఎంఎం ఎ/సి-మల్కాజ్‌గిరి | సూపర్ 70 ఎంఎం ఎ/సి-బాలాపూర్ | ఏషియన్ ముకుంద్ ఎ/సి-మేడ్చల్
ఎఎంబి సినిమాస్ - గచ్చిబౌలి | ఎ.ఆర్.టి సినిమాస్ - ఎల్.బి.నగర్ | ఎఎఎ సినిమాస్ - అమీర్‌పేట్

ప్రసాద్ - ఎన్.టి.ఆర్.గార్డెన్స్
PVR ఆర్.కె - బంజారాహిల్స్
PVR పి.వి.ఆర్- మూసారాంబాగ్
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్
PVR నెక్సస్ మాల్ - కూకట్‌పల్లి
PVR గలేరియా - పంజాగుట్ట
PVR పివిఆర్ మాల్ - ఎర్రమంజిల్
PVR ప్రెస్టన్ ప్రైమ్ - గచ్చిబౌలి
PVR ఐకాన్ - హైటెక్ సిటీ
PVR SMR వినయ్- మియాపూర్
PVR ATRIUM మాల్ - గచ్చిబౌలి
PVR PRISM మాల్ - గచ్చిబౌలి
లులు మాల్ - కూకట్‌పల్లి
CCPL - మల్కాజ్‌గిరి
డి.ఎస్.ఎల్ - ఉప్పల్
మంత్రామాల్ - అత్తాపూర్
సుధ సినిమాస్- శాలిబండ
టిఎన్ఆర్ - కొంపల్లి
ఐనాక్స్ - బంజారాహిల్స్
జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ
ఎం.పి.మాల్ - కాచిగూడ
సత్వనెక్లిస్ మాల్స్ - కవాడిగూడ
అశోక ఎ/సి - వై.జంక్షన్
ఎఎంఆర్ మాల్ - మౌలాలి
మీరజ్ సినిమాస్ - దిల్‌సుఖ్‌నగర్
మీరజ్ సినిమాస్ - ఐడిపిఎల్
మీరజ్ సినిమాస్ - చందానగర్
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
లక్ష్మినరసింహ - మియాపూర్
స్కైమాల్ - సనత్‌నగర్
ప్లాటినమ్ - గచ్చిబౌలి
ఎంక్యూబ్ మాల్- అత్తాపూర్
ఏషియన్ సినీ స్క్వేర్ - ఉప్పల్
ముక్తా ఎం.జె.ఆర్ - నారపల్లి
జిపిఆర్ మాల్- కూకట్‌పల్లి
ఏషియన్ రాధిక - కాప్రా
సినీప్లానెట్ ఎ/సి - కొంపల్లి
లక్ష్మీకళ ఎ/సి - మూసాపేట్
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల
షా కాంప్లెక్స్ - చింతల్
టివోలి - సికింద్రాబాద్
విజయలక్ష్మి - ఎల్‌బినగర్
సినీమార్ట్ - ఆర్.సి.పురం
జెపి సినిమాస్ - చందానగర్
యుకె సినీప్లెక్స్ ఎ/సి - నాచారం

కోణార్క్ 70ఎంఎం దిల్‌సుఖ్‌నగర్
వెంకటరమణ పద్మావతి 70 -కాచిగూడ
బిఆర్ హైటెక్ 70 ఎంఎం ఎ/సి-మాదాపూర్
భుజంగ 70 ఎంఎం ఎ/సి-జీడిమెట్ల
సుష్మ 70 ఎంఎం ఎ/సి-వనస్థలిపురం
విజేత 70 ఎంఎం ఎ/సి-బోరబండ
సెన్సేషన్ కాంప్లెక్స్ 70 ఎ/సి- ఖైరతాబాద్
ఈశ్వర్ 70 ఎంఎం ఎ/సి-అత్తాపూర్
శివశక్తి 70 ఎంఎం ఎ/సి-కాప్రా
శ్రీలక్ష్మి/ఇంద్రనాగేంద్ర ఎ/సి - కర్మన్‌ఘాట్
గోకుల్ 70 ఎంఎం ఎ/సి- ఎర్రగడ్డ
రాజ్యలక్ష్మి 70 ఎ/సి-ఉప్పల్
మహాలక్ష్మి కాంప్లెక్స్-కొత్తపేట
స్వప్న 70 ఎంఎం ఎ/సి-కాటేదాన్
తాల్కూరి 70ఎంఎం-ఇసిఐఎల్ క్రాస్ రోడ్స్
విఎల్ఎస్ శ్రీదేవి 70ఎంఎం-చిలకలగూడ
ఏషియన్ జ్యోతి 70ఎంఎం-ఆర్‌సిపురం
శ్రీప్రేమ 70ఎంఎం- తుక్కుగూడ
సంతోష్ 70- ఇబ్రహీంపట్నం
జగదాంబ 70ఎంఎం - ఘట్‌కేసర్
వెంకటసాయి 70- కీసర

GLOBAL CINEMAS LLP RELEASE

# BLOCK BUSTER




**MYTHRI THEATRES విమల్ 70 ఎంఎం ఎ/సి-బాలానగర్**
64 Channel Dolby Atmos 4k Laser Projection Centrally Air Conditioned

మెగా 70ఎంఎం ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్ | సంపూర్ణ 70ఎంఎం ఎ/సి-వనస్థలిపురం
జగదాంబ 70ఎంఎం ఎ/సి- ఘట్‌కేసర్ | ఇంద్రనాగేంద్ర 70ఎంఎం-కర్మన్‌ఘాట్ | అర్జున్ 70ఎంఎం- కూకట్‌పల్లి

ప్రసాద్ - ఎన్.టి.ఆర్.గార్డెన్స్
PVR ఆర్.కె - బంజారాహిల్స్
PVR పి.వి.ఆర్- మూసారాంబాగ్
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్
PVR నెక్సస్ మాల్ - కూకట్‌పల్లి
PVR గలేరియా - పంజాగుట్ట
PVR పివిఆర్ మాల్ - ఎర్రమంజిల్
PVR ప్రెస్టన్ ప్రైమ్ - గచ్చిబౌలి
PVR ఐకాన్ - హైటెక్ సిటీ
PVR SMR వినయ్- మియాపూర్
PVR ATRIUM మాల్ - గచ్చిబౌలి
PVR PRISM మాల్ - గచ్చిబౌలి
లులు మాల్ - కూకట్‌పల్లి
CCPL - మల్కాజ్‌గిరి
డి.ఎస్.ఎల్ - ఉప్పల్
మంత్రామాల్ - అత్తాపూర్
సుధ సినిమాస్- శాలిబండ
టిఎన్ఆర్ - కొంపల్లి
ఐనాక్స్ - బంజారాహిల్స్
జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ
ఎం.పి.మాల్ - కాచిగూడ
సత్వనెక్లిస్ మాల్స్ - కవాడిగూడ
అశోక ఎ/సి - వై.జంక్షన్
ఎఎంఆర్ మాల్ - మౌలాలి
ఎఎఎ సినిమాస్ - అమీర్‌పేట్
ఎఎంబి సినిమాస్ - గచ్చిబౌలి
ఎ.ఆర్.టి సినిమాస్ - ఎల్.బి.నగర్
మీరజ్ సినిమాస్ - దిల్‌సుఖ్‌నగర్
మీరజ్ సినిమాస్ - ఐడిపిఎల్
మీరజ్ సినిమాస్ - చందానగర్
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
లక్ష్మినరసింహ - మియాపూర్
స్కైమాల్ - సనత్‌నగర్
ప్లాటినమ్ - గచ్చిబౌలి
ఎంక్యూబ్ మాల్- అత్తాపూర్
ఏషియన్ సినీ స్క్వేర్ - ఉప్పల్
ముక్తా ఎం.జె.ఆర్ - నారపల్లి
జిపిఆర్ మాల్- కూకట్‌పల్లి
ఏషియన్ రాధిక - కాప్రా
సినీప్లానెట్ ఎ/సి - కొంపల్లి
లక్ష్మీకళ ఎ/సి - మూసాపేట్
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల
షా కాంప్లెక్స్ - చింతల్
టివోలి - సికింద్రాబాద్
విజయలక్ష్మి - ఎల్‌బినగర్
సినీమార్ట్ - ఆర్.సి.పురం
జెపి సినిమాస్ - చందానగర్
యుకె సినీప్లెక్స్ ఎ/సి - నాచారం

**వరంగల్**
వెంకటరామ - వరంగల్
పివిఆర్ఎస్2 - వరంగల్
జెమినీ 70 ఎంఎం- వరంగల్
లక్ష్మి - మహబూబాబాద్
ఎస్‌విసి దేవి ఎం- జనగాం
ఏషియన్ శ్రీదేవి - హన్మకొండ
అశోక 70ఎంఎం- హన్మకొండ

**ఖమ్మం**
కెపిఎస్ 70 ఎంఎం- ఖమ్మం
పరమేశ్వరి- కొత్తగూడెం
శ్రీనివాస 70ఎంఎం- సత్తుపల్లి

**కరీంనగర్**
శివ 70ఎంఎం-కరీంనగర్
ఏషియన్ ప్యారడైజ్ - కరీంనగర్
ఎబిఆర్ సినిమాస్ - కరీంనగర్
ఆర్ఆర్ శ్రీనివాస్ - కరీంనగర్
ప్రతిమ 70 ఎంఎం- కరీంనగర్
రాజేష్ 70-గోదావరిఖని
దుర్గ కళామందిర్ -జగిత్యాల
రాజేష్ 70-గోదావరిఖని

**మహబూబ్‌నగర్**
శ్రీకృష్ణ ఎస్1-మహబూబ్‌నగర్
ఎవిడి వెంకటాద్రి-మహబూబ్‌నగర్
శ్రీనివాస-వనపర్తి
ఎస్‌విసి-గద్వాల
సాయిబాబా - షాద్‌నగర్
మనోహర్-నారాయణపేట
పార్థసారథి-కల్వకుర్తి

**నల్లగొండ**
వెంకటేశ్వర-నల్లగొండ
వెంకటేశ్వర-మిర్యాలగూడ
విట్రోస్ 70ఎంఎం-మిర్యాలగూడ
జిహెచ్ఆర్ కాంప్లెక్స్-కోదాడ
విష్ణురామ్ 70 ఎంఎం-కోదాడ
నవ్య 70 ఎంఎం- సూర్యాపేట
ఏషియన్ తిరుమల -సూర్యాపేట
వెంకటేశ్వర-దేవరకొండ
వసుంధర 70ఎంఎం-భువనగిరి
రామకృష్ణ 70ఎం-నకిరేకల్

**నిజామాబాద్**
పివిఆర్ వేణు-నిజామాబాద్
ఏషియన్ ఉషాప్రసాద్ -నిజామాబాద్
ఎస్‌విసి లలిత 70ఎంఎం-నిజామాబాద్
దర్శన్ 70ఎంఎం-కామారెడ్డి
పివిఆర్ జీవన్‌రెడ్డి-ఆర్మూర్

**ఆదిలాబాద్**
మహేశ్వరి-ఆదిలాబాద్
వెంకటేశ్వర-మంచిర్యాల
ఎస్‌విసిజెమినీ-మంచిర్యాల
తిరుమల 70ఎంఎం-నిర్మల్


**మెదక్**
రుక్మిణి 70 ఎం-సంగారెడ్డి
మహేశ్వరి -జహీరాబాద్
యాదగిరి-గజ్వేల్
మహేశ్వరి -సదాశివపేట్

**రంగారెడ్డి**
లక్ష్మి 70 ఎంఎం-తాండూర్

**రాయిచూర్**
మీరజ్ 70ఎంఎం-రాయిచూర్
చంద్రహాస్70ఎం-గంగావతి
శరణబసవేశ్వర -సిందనూర్

MYTHRI MOVIE DISTRIBUTORS LLP

మరిన్ని వార్తలు ntnews.com లో చూడగలరు




ప్రసాద్- ఎన్.టి.ఆర్.గార్డెన్స్ 5.10,11.009
PVR పి.వి.ఆర్- మూసారాంబాగ్ 4.35,11.00
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 7.00
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్4.45,11.10
PVR నెక్సస్ మాల్ - కూకట్‌పల్లి 2.10,10.45
PVR గలేరియా - పంజాగుట్ట 2.0,7.20
PVR పివిఆర్ మాల్ - ఎర్రమంజిల్4.25,11.00
PVR ప్రెస్టన్ ప్రైమ్ - గచ్చిబౌలి 4.25
PVR ప్రిజమ్‌మాల్ - గచ్చిబౌలి 4.30
PVR ఎస్ఎంఆర్-మియాపూర్ 1.30
PVR ఐకాన్ - హైటెక్ సిటీ 4.45,11.05
PVR ATRIUM మాల్ - గచ్చిబౌలి 1.50,11.00
లులు మాల్ - కూకట్‌పల్లి 4.20
CCPL - మల్కాజ్‌గిరి 4.20
డి.ఎస్.ఎల్ - ఉప్పల్ 4.45,11.10
మంత్రామాల్ - అత్తాపూర్ 4.30,11.10
సుధ సినిమాస్- శాలిబండ 11.00,2.15,8.35,11.20
టిఎన్ఆర్ - కొంపల్లి 1.25,4.30,10.45
లక్ష్మీనరసింహ - మియాపూర్ 10.20
స్కైమాల్ - సనత్‌నగర్ 10.00,4.00,10.45
ప్లాటినమ్ - గచ్చిబౌలి 12,30, 7.00
ఎంక్యూబ్ - అత్తాపూర్ 1.15,4.35,7.30
సినీ స్క్వేర్ - ఉప్పల్ 1.30,4.25,7.35
ఎం.జె.ఆర్ - నారపల్లి 4.30, 10.40
జిపిఆర్ - కూకట్‌పల్లి 4.30, 10.45
రాధిక - కాప్రా 7.20
సినీప్లానెట్ - కొంపల్లి 11.35,7.30
లక్ష్మీకళ - మూసాపేట్ 2.30,9.30
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,2.00,9.00
అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల 2.20,7.10
షా కాంప్లెక్స్ - చింతల్ 11.15,2.30,9.30
టివోలి - సికింద్రాబాద్ 10.40
విజయలక్ష్మి - ఎల్‌బినగర్ 1.30,7.30
సినీమార్ట్ - ఆర్.సి.పురం 10.40,4.30,7.30
జెపి - చందానగర్ 10.40,4.35,10.30
యుకె సినీప్లెక్స్ - నాచారం 3.30, 10.00




**సంధ్య 35 ఎంఎం ఎ/సి - ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్**
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND
11.00,2.15,6.00,9.15

| SVC శ్రీలక్ష్మి/ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్ | భ్రమరాంభ 70ఎంఎం - కూకట్‌పల్లి | రాజధాని డీలక్స్ ఎ/సి- దిల్‌సుఖ్‌నగర్ |
|---|---|---|
| 11.00,2.30,6.15,9.30 | 11.15,2.45,6.30,10.00 | 11.15,2.30,6.15,9.30 |

ప్రసాద్ - ఎన్.టి.ఆర్.గార్డెన్స్ 1.55,7.55
PVR ఆర్.కె - బంజారాహిల్స్ 10.35
PVR పి.వి.ఆర్- మూసారాంబాగ్ 4.40,10.55
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట 1.05,10.50
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్ 2.35, 10.55
PVR నెక్సస్ మాల్ - కూకట్‌పల్లి 10.00,1.30,7.25,10.55
PVR గలేరియా - పంజాగుట్ట 10.35,7.00,10.25
PVR పివిఆర్ మాల్ - ఎర్రమంజిల్ 2.20,7.25
PVR ప్రెస్టన్ ప్రైమ్ - గచ్చిబౌలి 1.05,7.40
PVR ఐకాన్ - హైటెక్ సిటీ 1.55,10.45
PVR SMR వినయ్- మియాపూర్ 4.30,11.00
PVR ATRIUM మాల్ - గచ్చిబౌలి 4.55,10.45
PVR PRISM మాల్ - గచ్చిబౌలి 1.00, 4.25
లులు మాల్ - కూకట్‌పల్లి 10.30, 4.30
CCPL - మల్కాజ్‌గిరి 1.45,4.10
డి.ఎస్.ఎల్ - ఉప్పల్ 4.20,10.50
మంత్రామాల్ - అత్తాపూర్ 4.20
సుధ సినిమాస్- శాలిబండ 10.00,4.30,11.00
టిఎన్ఆర్ - కొంపల్లి 10.30,1.00,7.10,11.00
ఐనాక్స్ - బంజారాహిల్స్ 2.15,10.30 హిందీ:4.50
జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ 10.40,4.30,10.20,
ఎం.పి.మాల్ - కాచిగూడ 4.00, 10.30 హిందీ:4.00
సత్వనెక్లిస్ మాల్స్ - కవాడిగూడ 10.30,7.10,10.40,హిందీ:4.00
అశోక ఎ/సి - వై.జంక్షన్ 4.00,10.30
ఎఎంఆర్ మాల్ - మౌలాలి 9.15,10.15,1.30,3.50,6.50, 10.45,తమిళ్:12.30,7.20
ఎఎఎ సినిమాస్ - అమీర్‌పేట్ 1.15,7.25
ఎఎంబి సినిమాస్ - గచ్చిబౌలి 10.15,1.05,4.15,7.15,10.25, తమిళ్:1.10,7.05,హిందీ:1.20
ఎ.ఆర్.టి సినిమాస్ - ఎల్.బి.నగర్ 10.15,1.05,7.15,10.30
మీరజ్ సినిమాస్ - దిల్‌సుఖ్‌నగర్ 4.40,10.40
మీరజ్ సినిమాస్ - ఐడిపిఎల్ 4.40,10.40
మీరజ్ సినిమాస్ - చందానగర్ 4.40,10.30
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి 1.10,7.20
లక్ష్మినరసింహ - మియాపూర్ 10.30
స్కైమాల్ - సనత్‌నగర్ 1.30
ప్లాటినమ్ - గచ్చిబౌలి 5.30,10.30 హిందీ: 12.00PM
ఎంక్యూబ్ మాల్- అత్తాపూర్ 1.30,7.25,హిందీ:1.20,7.25
ఏషియన్ సినీ స్క్వేర్ - ఉప్పల్ 10.30, 4.25, 10.30
ముక్తా ఎం.జె.ఆర్ - నారపల్లి 1.30,7.35
జిపిఆర్ మాల్- కూకట్‌పల్లి 10.30,1.30,4.00,7.15,10.15
ఏషియన్ రాధిక - కాప్రా 4.30,10.25
సినీప్లానెట్ ఎ/సి - కొంపల్లి 4.25,10.30
లక్ష్మీకళ ఎ/సి - మూసాపేట్ 11.15, 6.15
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్ 11.00,6.00
అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల 10.00,1.25,4.45, 7.35,11.00
షా కాంప్లెక్స్ - చింతల్ 11.15,6.30
టివోలి - సికింద్రాబాద్ 4.40,10.50
విజయలక్ష్మి - ఎల్‌బినగర్ 4.30,10.30
సినీమార్ట్ - ఆర్.సి.పురం 1.25,4.30,10.35
జెపి సినిమాస్ - చందానగర్ 1.30,7.35,10.40
యుకె సినీప్లెక్స్ ఎ/సి - నాచారం 11.00,2.30,6.00,9.30

సెన్సేషన్ కాంప్లెక్స్ 70 ఎంఎం ఎ/సి- ఖైరతాబాద్ 9.30
తాల్కూరి కాంప్లెక్స్ 70 ఎ/సి-ఇసిఐఎల్ 11.00,2.00,6.00,9.00
భుజంగ 70 ఎ/సి-జీడిమెట్ల 11.00,2.15,6.15,9.30
రాజ్యలక్ష్మి 70 ఎ/సి- ఉప్పల్ 11.15,2.30,6.15,9.30
లక్ష్మీకళామందిర్ 70ఎంఎం - అల్వాల్ 11.30,2.30,6.30,9.30




**MYTHRI THEATRES విమల్ 70 ఎంఎం ఎ/సి-బాలానగర్**
64 Channel Dolby Atmos 4k Laser Projection Centrally Air Conditiond

రాజధాని ఎ/సి - దిల్‌సుఖ్‌నగర్ | జగదాంబ ఎ/సి - ఘట్‌కేసర్ | సాయిపూజ 70 - సూరారం | సంపూర్ణ ఎ/సి - వనస్థలిపురం
భ్రమరాంబ ఎ/సి - కూకట్‌పల్లి | శ్రీసాయిరాం - మల్కాజ్‌గిరి | శ్రీరాములు 70 - మూసాపేట | ఇంద్రనాగేంద్ర - కర్మన్‌ఘాట్

ప్రశాంత్ 70 ఎంఎం - సికింద్రాబాద్
SVC శ్రీలక్ష్మి ఎ/సి - కర్మన్‌ఘాట్
ఏషియన్ తారకరామ - కాచిగూడ
రామకృష్ణ 70 ఎంఎం - అబిడ్స్
తాల్కూరి స్క్రీన్1 - ఇ.సి.ఐ.ఎల్
శ్రీకృష్ణ 70 ఎంఎం ఎ/సి - ఉప్పల్
SVC శివశక్తి ఎ/సి- కాప్రా
SVC యాదగిరి- సంతోష్‌నగర్
రంగ 70 ఎంఎం ఎ/సి - జీడిమెట్ల
SVC సంగీత ఎ/సి- ఆర్‌సిపురం
నర్తకి 70 ఎం - అల్వాల్
ముక్తా ఎ2 సెన్సేషన్ - ఖైరతాబాద్
అలంకార్ 70ఎం- లంగర్‌హౌస్
సూపర్ 70 ఎం - బాలాపూర్
బిఆర్ హైటెక్ 70 - మాదాపూర్
శ్రీసాయిరంగ - మియాపూర్
వైజయంతి 70ఎం- నాచారం
శ్రీరమణ 70 ఎం - అంబర్‌పేట్
ఎంఆర్ఆర్ సాయిరాం - పోచంపల్లి
ఏషియన్ ముకుంద్- మేడ్చల్
గణేష్ 70 ఎంఎం - శంషాబాద్
వెంకటేశ్వర 70 ఎంఎం - గుమ్మడిదల
విజేత 70 ఎంఎం - బోరబండ
రాఘవేంద్ర 70 ఎంఎం - బీబీనగర్

ప్రసాద్ - ఎన్.టి.ఆర్.గార్డెన్స్
PVR ఆర్.కె - బంజారాహిల్స్
PVR పి.వి.ఆర్- మూసారాంబాగ్
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్
PVR నెక్సస్ మాల్ - కూకట్‌పల్లి
PVR గలేరియా - పంజాగుట్ట
PVR పివిఆర్ మాల్ - ఎర్రమంజిల్
PVR ప్రెస్టన్ ప్రైమ్ - గచ్చిబౌలి
PVR ఐకాన్ - హైటెక్ సిటీ
PVR SMR వినయ్- మియాపూర్
PVR ATRIUM మాల్ - గచ్చిబౌలి
PVR PRISM మాల్ - గచ్చిబౌలి
లులు మాల్ - కూకట్‌పల్లి
CCPL - మల్కాజ్‌గిరి
డి.ఎస్.ఎల్ - ఉప్పల్
మంత్రామాల్ - అత్తాపూర్
సుధ సినిమాస్ - శాలిబండ
టిఎన్ఆర్ - కొంపల్లి
ఐనాక్స్ - బంజారాహిల్స్
జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ
ఎం.పి.మాల్ - కాచిగూడ
సత్వనెక్లిస్ మాల్స్ - కవాడిగూడ
అశోక ఎ/సి - వై.జంక్షన్
ఎఎంఆర్ మాల్ - మౌలాలి
మీరజ్ సినిమాస్ - దిల్‌సుఖ్‌నగర్
మీరజ్ సినిమాస్ - ఐడిపిఎల్
మీరజ్ సినిమాస్ - చందానగర్
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
లక్ష్మినరసింహ - మియాపూర్
స్కైమాల్ - సనత్‌నగర్
ప్లాటినమ్ - గచ్చిబౌలి
ఎంక్యూబ్ మాల్ - అత్తాపూర్
ఏషియన్ సినీ స్క్వేర్ - ఉప్పల్
ముక్తా ఎం.జె.ఆర్ - నారపల్లి
జిపిఆర్ మాల్- కూకట్‌పల్లి
ఏషియన్ రాధిక - కాప్రా
సినీప్లానెట్ ఎ/సి - కొంపల్లి
లక్ష్మీకళ ఎ/సి - మూసాపేట్
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల
షా కాంప్లెక్స్ - చింతల్
టివోలి - సికింద్రాబాద్
విజయలక్ష్మి - ఎల్‌బినగర్
సినీమార్ట్ - ఆర్.సి.పురం
జెపి సినిమాస్ - చందానగర్
యుకె సినీప్లెక్స్ ఎ/సి - నాచారం

**వరంగల్**
వెంకట్రామ 70ఎంఎం- వరంగల్
రాధిక 70 ఎంఎం- వరంగల్
జెమిని కాంప్లెక్స్ 70ఎంఎం- వరంగల్
పి.వి.ఆర్ ఎస్2 70 - వరంగల్
అమృత 70 ఎంఎం- హన్మకొండ
ఏషియన్ శ్రీదేవి - హన్మకొండ
లక్ష్మి - మహబూబాబాద్
ఎస్‌విసి శ్రీదేవి 70ఎంఎం - జనగాం
భవాని 70 ఎంఎం - ఖాజీపేట
జయశ్రీ 70 ఎంఎం- నర్సంపేట
ఆనంద్ 70 ఎంఎం - భూపాలపల్లి
జయ డీలక్స్ 70ఎంఎం - పరకాల
విబికె మూవీమ్యాక్స్ 70 - చేర్యాల్
వెంకటేశ్వర - ఏటూరు నాగారం
సూర్య కళామందిర్ 70 - నెక్కొండ
మోహన్ 70 ఎంఎం- కేసముద్రం

**ఖమ్మం**
ఎస్‌విసి తిరుమల 70ఎంఎం- ఖమ్మం
పరమేశ్వరి 70 - కొత్తగూడెం
ఉదయ్ భాస్కర్ 70- భద్రాచలం
సాయి బాలాజీ 70 ఎంఎం- సత్తుపల్లి
శాంతి 70ఎంఎం - పాల్వంచ
కళాంజలి 70 ఎంఎం- ఎల్లందు
లక్ష్మి శ్రీనివాస 70ఎంఎం - మదిర
సత్య భాస్కర్ 70ఎంఎం- మనుగూరు
లక్ష్మి శ్రీనివాస 70ఎంఎం- అశ్వరావుపేట
రఘు పిక్చర్ ప్యాలెస్ 70ఎంఎం- చెర్ల
వాసవి 70 ఎంఎం - వైరా
శ్రీదుర్గ 70 ఎంఎం - బోనకల్
సాయి బాలాజీ - నేలకొండపల్లి
లక్ష్మి సినీప్లెక్స్ 70ఎంఎం- కల్లూరు

**కరీంనగర్**
శివ 70ఎంఎం- కరీంనగర్
SVC ప్రతిమ మల్టీప్లెక్స్- కరీంనగర్
ఏషియన్ రాజా ప్యారడైజ్ - కరీంనగర్
ఏబిఆర్ 70 ఎంఎం - కరీంనగర్
ఆర్.ఆర్. శ్రీనివాస 70ఎంఎం- కరీంనగర్
ఏషియన్ ఊర్వశి 70- గోదావరిఖని
విఎల్ఎస్ శ్రీరామ 70- జగిత్యాల
విమల్ 70ఎంఎం - సిరిసిల్లా
సంగీత 70 ఎంఎం- పెద్దపల్లి
లక్ష్మి 70ఎంఎం - మెట్‌పల్లి
కిన్నెర 70ఎంఎం - కోరుట్ల
అన్నపూర్ణ - హుజూరాబాద్
శివ రామకృష్ణ - వేములవాడ
వి.కె.ఎం. 70 ఎంఎం - హుస్నాబాద్

**మహబూబ్‌నగర్**
శ్రీకృష్ణ ఎస్1 - మహబూబ్‌నగర్
ఏవిడి తిరుమల కాంప్లెక్స్ - మహబూబ్‌నగర్
శ్రీనివాస 70 - వనపర్తి
మనోహర్ - నారాయణపేట
పార్థసారథి 70ఎంఎం- కల్వకుర్తి
రామకృష్ణ - నాగర్‌కర్నూల్
ఎస్.వి.సి.వెంకటేశ్వర- గద్వాల్
ఎస్.వి.సి.రామకృష్ణ - షాద్‌నగర్
శ్రీనివాస 70ఎంఎం - జడ్చర్ల
వనయంబ 70ఎంఎం - ముక్తిపాడు

**నల్గొండ**
ఎస్‌విసి నటరాజ్ 70ఎంఎం- నల్గొండ
వెంకటేశ్వర - దేవరకొండ
వెంకటేశ్వర - మిర్యాలగూడ
విట్రోస్ సినీప్లెక్స్ - మిర్యాలగూడ
నవ్య 70 ఎంఎం- సూర్యాపేట
ఏషియన్ తిరుమల మల్టీప్లెక్స్ - సూర్యాపేట
ఏషియన్ శ్రీనివాస - కోదాడ
విష్ణురాం సినిమాస్ - కోదాడ
జిహెచ్ఆర్ కాంప్లెక్స్ - కోదాడ
వసుంధర 70ఎంఎం - భువనగిరి
రామకృష్ణ 70ఎంఎం - నకిరేకల్
శ్రీనివాస 70 ఎంఎం- చౌటుప్పల్
అచ్చిరెడ్డి 70 ఎంఎం - హాలియా
సుజన70 ఎంఎం - చిట్యాల్
లక్ష్మి టాకీస్ 70ఎంఎం - మాల్
వెంకటేశ్వర 70ఎంఎం - వలిగొండ
సత్యనారాయణ 70ఎంఎం- చండూరు

**నిజామాబాద్**
విజయ 70ఎంఎం- నిజామాబాద్
గీత ఏషియన్ ఉషాప్రసాద్ - నిజామాబాద్
పివిఆర్ వేణుమాల్ - నిజామాబాద్
పి.వి.ఆర్ జీవన్ రెడ్డి- ఆర్మూర్
ప్రియ డీలక్స్ 70ఎంఎం - కామారెడ్డి
వెంకటేశ్వర 70 ఎంఎం- బోధన్
మహేశ్వరి 70 ఎంఎం- భాన్సువాడ
పరమేశ్వర 70 ఎంఎం- బిచ్కుంద
సుదర్శన్ 70 ఎంఎం- భీంగల్
రాం ప్రతాప్ 70- నాగిరెడ్డిపేట

**ఆదిలాబాద్**
ఏషియన్ నటరాజ్ 70- ఆదిలాబాద్
వెంకటేశ్వర 70ఎంఎం - మంచిర్యాల
SVC జెమిని సినిమాస్ - మంచిర్యాల
నారాయణ70 ఎంఎం - నిర్మల్
రామకృష్ణ 70 ఎంఎం- బెల్లంపల్లి
మహానంద 70 ఎంఎం- లక్సెట్టిపేట
రాఘవేంద్ర 70 ఎంఎం- జన్నారం
కమల 70ఎంఎం- భైంసా
వెంకటరమణ - సిర్పూర్‌కాగజ్‌నగర్

**మెదక్**
సినీ మ్యాక్స్ 70ఎంఎం - మెదక్
యాదగిరి 70 - గజ్వేల్
ఏషియన్ వెంకటేశ్వర - సిద్దిపేట
నటరాజ్ 70ఎంఎం - సంగారెడ్డి
ఏషియన్ మహేశ్వరి - సదాశివపేట
ఏషియన్ మహేశ్వరి - జహీరాబాద్
వెంకటేశ్వర 70ఎంఎం - తూప్రాన్

**రంగారెడ్డి**
ఎస్‌విసి శ్రీ తిరుమల - తాండూర్
భవాని 70 ఎంఎం- పరిగి
వెంకటేశ్వర 70ఎంఎం - చేవెళ్ళ

**రాయిచూర్**
మీరజ్ సినిమాస్ - రాయిచూర్

MYTHRI MOVIE DISTRIBUTORS LLP

ప్రేక్షకుల కోరికపై
**సంధ్య 70MM A/c ఆర్.టి.సి. క్రాస్ రోడ్స్**
ENJOY 4K LASER PROJECTION & DOLBY ATMOS SOUND

మల్లిఖార్జున 70 ఎంఎం- కూకట్‌పల్లి
అలంకార్ 70 ఎంఎం- లంగర్‌హౌస్
ఇంద్రనాగేంద్ర 70 ఎం- కర్మన్‌ఘాట్
వైజయంతి 70 ఎంఎం - నాచారం
శ్రీరమణ 70 ఎంఎం- అంబర్‌పేట్
రంగ 70 ఎంఎం- జీడిమెట్ల
సెన్సేషన్ సన్‌షైన్ 70 - ఖైరతాబాద్
సాయిరంగ 70 ఎంఎం- మియాపూర్
జ్యోతి 70 ఎంఎం- ఆర్‌సి పురం
హైటెక్ 70 ఎంఎం- మాధాపూర్
శ్రీదేవి 70 ఎంఎం- చిలకలగూడ
సూపర్ 70 ఎంఎం- బాలాపూర్
గణేష్ 70 ఎంఎం- శంషాబాద్
సంతోష్ 70 ఎంఎం- ఇబ్రహీంపట్నం
శ్రీప్రేమ 70 ఎంఎం- తుక్కుగూడ

ప్రసాద్ - ఎన్.టి.ఆర్.గార్డెన్స్
ఎఎఎ ఎ/సి - అమీర్‌పేట్
ఎఎంబి - గచ్చిబౌలి
ఎ.ఆర్.టి - ఎల్.బి.నగర్
PVR ఆర్.కె - బంజారాహిల్స్
PVR పి.వి.ఆర్- మూసారాంబాగ్
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
PVR ఇన్‌ఆర్బిట్‌మాల్ - మాదాపూర్
PVR నెక్సస్ మాల్ - కూకట్‌పల్లి
PVR గలేరియా - పంజాగుట్ట
PVR పివిఆర్ - ఎర్రమంజిల్
PVR ప్రెస్టన్ ప్రైమ్ - గచ్చిబౌలి
PVR ఐకాన్ - హైటెక్ సిటీ
PVR SMR- మియాపూర్
PVR ATRIUM మాల్ - గచ్చిబౌలి
PVR PRISM మాల్ - గచ్చిబౌలి
లులు మాల్ - కూకట్‌పల్లి
CCPL - మల్కాజ్‌గిరి
డి.ఎస్.ఎల్- ఉప్పల్
మంత్రామాల్ - అత్తాపూర్
టిఎన్ఆర్ - కొంపల్లి
ఐనాక్స్ - బంజారాహిల్స్
జి.ఎస్.ఎమ్ - మదీనాగూడ
ఎం.పి.మాల్ - కాచిగూడ
సత్వనెక్లిస్ - కవాడిగూడ
అశోక ఎ/సి - వై.జంక్షన్
సుధ - శాలిబండ
ఎఎంఆర్ - మౌలాలి
మీరజ్ సినిమాస్ - దిల్‌సుఖ్‌నగర్
మీరజ్ సినిమాస్ - ఐడిపిఎల్
మీరజ్ సినిమాస్ - చందానగర్
రాఘవేంద్ర - మల్కాజ్‌గిరి
లక్ష్మినరసింహ - మియాపూర్
స్కైమాల్ - సనత్‌నగర్
ప్లాటినమ్ - గచ్చిబౌలి
ఎంక్యూబ్ - అత్తాపూర్
సినీ స్క్వేర్ - ఉప్పల్
ఎం.జె.ఆర్ - నారపల్లి
జిపిఆర్ - కూకట్‌పల్లి
ఏషియన్‌రాధిక - కాప్రా
సినీప్లానెట్ ఎ/సి - కొంపల్లి
లక్ష్మీకళ ఎ/సి - మూసాపేట్
టివోలి - సికింద్రాబాద్
విజయలక్ష్మి - ఎల్‌బినగర్
సినీమార్ట్ - ఆర్.సి.పురం
అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల
జెపి ఎ/సి - చందానగర్
షా కాంప్లెక్స్ - చింతల్
శివగంగ - దిల్‌సుఖ్‌నగర్
యు.కె. సినీప్లెక్స్ - నాచారం

**హిందీ వర్షన్**
రామకృష్ణ - అబిడ్స్
మంత్రామాల్ - అత్తాపూర్
సుధ - శాలిబండ
టిఎన్ఆర్ - కొంపల్లి
అపర్ణ సినిమాస్ - నల్లగండ్ల
ఐనాక్స్ - బంజారాహిల్స్
PVR సెంట్రల్‌మాల్ - పంజాగుట్ట
ఎం.పి.మాల్ - కాచిగూడ
సత్వనెక్లిస్ మాల్స్ - కవాడిగూడ
ప్లాటినమ్ - గచ్చిబౌలి
PVR ప్రిసమ్ - గచ్చిబౌలి
PVR ఐనాక్స్ మడాక్స్ - వరంగల్

బాక్సాఫీస్ దగ్గర
# నరసింహస్వామి
ఉగ్రరూపం..!





## పూల వర్షం కురవాలంటే..

**పెరటి** తోటల్లో ఆకు కూరలు, కూరగాయలతో పాటు ఎక్కువగా కనిపించేవి పూల మొక్కలే! అందులోనూ గులాబీలను చాలామంది ఇష్టంగా పెంచుకుంటారు. ఇవి ఇంటికి కొత్త అందాన్ని ఇవ్వడంతోపాటు ఆడవాళ్లకూ అనేక రకాలుగా ఉపయోగపడతాయి. అయితే, సరైన నిర్వహణ లేకపోతే.. ఆకులే తప్ప గులాబీలు కనిపించవు. అలా కాకుండా, చెట్టు మొత్తం విరగబూయాలంటే.. కొన్ని సస్యరక్షణ చర్యలు చేపట్టాలి.

- **మొక్క** అడుగుభాగంలోని కొమ్మలను క్రమపద్ధతిలో ఉంచితే.. గులాబీలు విరివిగా పూస్తాయి. నాటిన వెంటనే పూల కోసం చూడకుండా.. పక్క కొమ్మలు ఎక్కువ వచ్చేలా అనువైన పరిస్థితులు కల్పించాలి.
- **గులాబీల్లో** కొమ్మ వంచడం అనేది అతి ముఖ్యమైనది. దీని వల్ల కింది భాగంలోని శాఖీయ మొగ్గకు పోషకాలు ఎక్కువగా అంది.. పొడవైన కాడలతో పూలు వస్తాయి. మూడు నెలల వయసున్న మొక్కల్లో బెండింగ్ చేయడం వల్ల వాటి ఉత్పాదక శక్తి పెరుగుతుంది.
- **కత్తిరింపులతో** కాండం, కాడ అడుగు భాగం దృఢంగా మారుతుంది. మొక్క ఎత్తుగా పెరుగుతుంది. ఇందుకోసం బలహీనంగా ఉన్న కాడలను గుర్తించి.. వాటిని కత్తిరించేయాలి. దీనివల్ల కాండం మరింత దృఢంగా తయారవుతుంది.
- **పువ్వులను** కోసేటప్పుడు.. ఒకటి/ రెండు ఆకులు మాత్రమే ఉంచి, మిగతా కాడ భాగం పువ్వుసహా కత్తిరించాలి. దీనివల్ల కాడ మీద నిద్రాణ స్థితిలో ఉన్న మొగ్గలు కొత్త కొమ్మలుగా ఏర్పడి పూల దిగుబడి పెరుగుతుంది.





**లేబర్ రూమ్‌లో క్యార్‌మనే ఏడుపు వినిపించగానే ఆడా? మగా? తెలుసుకునేందుకు రక్తసంబంధీకుల్లానే ఓ నర్స్ కూడా ఎదురుచూస్తుంది. ఆడబిడ్డ పుట్టిందనే మాట వినిపించగానే పరుగు పరుగున వార్డులో హడావిడి చేస్తుంది. రంగురంగుల బెలూన్లతో వార్డంతా అలంకరిస్తుంది. కేకు తెచ్చి ఆ తల్లితో కట్ చేయిస్తుంది. అందరి నోళ్లు తీపి చేయడానికి చాక్లెట్లు తెస్తుంది. ఇది ఆ హాస్పిటల్ స్పెషల్. అంతేకాదు ఆడపిల్ల పుడితే డెలివరీ చార్జీలు, మందులు కూడా ఫ్రీగా ఇస్తాడు డాక్టర్ గణేశ్ రఖ్. అమ్మాయి పుట్టుక భారం కారాదని చెప్పే ఆ డాక్టర్ ఆడబిడ్డకు ప్రాణం పోస్తూ అమ్మని బతికిస్తున్నాడు!**

# ఆడపిల్లల డాక్టర్

పద్నాలుగేండ్ల క్రితం.. ఆనాటి జనాభా లెక్కల్లో వెయ్యి మంది అబ్బాయిలకు 914 మంది అమ్మాయిలున్నారు. ఈ లెక్కలు చూశాక పూణెలో వైద్యుడిగా పనిచేస్తున్న డాక్టర్ గణేశ్‌కు గుండె ఆగినంత పనైంది. ఆ లెక్కన పుట్టకుండానే చనిపోతున్న ఆడపిల్లలు ఎంతమందో ఆయనకు అర్థమైంది. ప్రాణం పోయాల్సిన దవాఖానాల్లో నిశ్శబ్దంగా జరిగిపోతున్న దారుణాలు ఆయన్ని కలవరపెట్టాయి. ఆ జనాభా లెక్కలు చూసి 'ఆడపిల్లను పుట్టనివ్వండి' అని అందరిలా అనుకుని ఆగిపోకుండా, పుట్టే ఆడపిల్లకు అండగా నిలబడాలనుకున్నాడు గణేశ్. కుటుంబాలను సంసిద్ధం చేయకుండా ఆడపిల్లను కాపాడుకోలేమని ముల్గీ వచ్వా అభియాన్ (ఆడపిల్లను కాపాడుకుందాం) అనే ప్రచార కార్యక్రమం ప్రారంభించాడు.



### గర్ల్ చైల్డ్ బర్త్ సెలబ్రేషన్

దవాఖానలో మగబిడ్డ పుడితే వార్డులో పండుగలా ఉంటుంది. పసివాడిని చూసేందుకు బంధువులు పోలోమంటూ వస్తారు. మిఠాయిలు పంచుకుంటారు. వారసుణ్ని అందించిన ఆమెపై ఎనలేని అభిమానం కురిపిస్తారు. తల్లీబిడ్డలు ఇంటికి వచ్చే రోజు కోసం ఊళ్లో అందరూ ఎదురుచూస్తూ ఉంటారు. ఆ సందడి, హడావిడి చూస్తూ కొందరు తల్లులు 'నాకూ మగబిడ్డ పుడితే బాగు. ఇలాంటి సంతోషం దక్కేది. ఏ పాపం చేసుకున్నానో' అంటూ దిగులు పడుతుంటుంది. ఇంట్లో వాళ్ల ఛీత్కారాలు భరిస్తూ, మనసులో దిగులును మోస్తూ, భుజాన భారంగా భావించే బిడ్డను మోస్తూ ఏ హడావుడీ లేకుండా ఇల్లు చేరుకుంటుంది ఆడపిల్లను కన్న తల్లి. ఏ పుణ్యం చేసుకుందో ఈ పసికందు ఇల్లయినా చేరుకుంది. తనలా కన్నుతెరిచి తల్లిని చూడకుండానే, నేలపై కాలుమోపకుండానే లోకాన్ని వీడిపోతున్న శిశువులు ఎందరో! ప్రసూతి వైద్యశాలలన్నిటా వినిపించే, కనిపించే కథలివే! పూణెలో ప్రసూతి వైద్యుడిగా సేవలందిస్తున్న డాక్టర్ గణేశ్ ఈ దుస్థితి నుంచి ఆడపిల్లల్ని కాపాడాలనుకున్నాడు. ఓ రోజు తన దవాఖానలో ఆడబిడ్డ పుట్టింది. ఆ సందర్భంగా కేక్ కట్ చేసి, అందరికీ స్వీట్లు పంచి 'గర్ల్ చైల్డ్ బర్త్ సెలబ్రేషన్' నిర్వహించాడు. ఇలా 'ముల్గీ వచ్వా అభియాన్' కార్యక్రమం మొదలుపెట్టాడు. పుట్టిన బిడ్డ తల్లిదండ్రులకు ఆర్థిక భారం కాకుండా ఉండాలని ఆడబిడ్డ పుడితే డెలివరీ చార్జీలు తీసుకోవడం మానేశాడు. అంతేకాదు పుట్టిన ఆ ఆడబిడ్డ ఆరోగ్యంగా ఎదగాలని ఉచితంగా టీకాలు వేసే బాధ్యతా తీసుకున్నాడు. ఆ పేదబిడ్డ తల్లికి భారం కారాదని తనకు ఏ రోగం వచ్చినా ఉచితంగా వైద్యం చేస్తానని హామీ ఇచ్చాడు. చెప్పినట్టే ఆచరిస్తున్నాడు.

### త్యాగఫలం

పదమూడేళ్ల క్రితం... పూణెలోని అదప్సార ప్రాంతంలో డాక్టర్ గణేశ్ రఖ్ పనిచేస్తున్న మెడికేర్ హాస్పిటల్‌లో మొదలైన 'గర్ల్ చైల్డ్ బర్త్ సెలబ్రేషన్' ఇప్పటికీ కొనసాగుతున్నది. ఈ దవాఖానలో ఆధునిక ప్రసూతి వైద్యంతోపాటు మల్టీ స్పెషాలిటీ సేవలు అందుబాటులో ఉన్నాయి. అంతకంటే ముఖ్యంగా ఆడపిల్లకు ఎక్కడాలేని మద్దతు ఉంది. అందుకే పేద తల్లులు కడుపులోని బిడ్డ భారం అనుకోకుండా డాక్టర్ గణేశ్ దగ్గరికి వస్తున్నారు. ముల్గీ వచ్వా అభియాన్ ప్రారంభించిన తొలి ఏడాదిలో మూడు వందల మందికి ఉచితంగా పురుడు పోశాడు.

ఉన్నత లక్ష్యంతో అడుగేసిన డాక్టర్ గణేశ్‌ను ఎన్నో అవరోధాలు పలకరించాయి. ఆయన నిర్ణయంపై ఇంట్లోనే వ్యతిరేకత వచ్చింది. తను పనిచేస్తున్న హాస్పిటల్ సిబ్బంది కూడా ప్రసవానికి ఫీజు మినహాయింపు ఇవ్వడాన్ని వ్యతిరేకించింది. ఒక ప్రసవానికి పాతిక వేల నుంచి యాభై వేల రూపాయల వరకు నష్టపోవాల్సి వస్తున్నదని లెక్కగట్టి చెప్పింది. అంత మొత్తాన్ని వదులుకోవాల్సి రావడం ఆర్థికంగా పెద్ద త్యాగమే. ఎవరెన్ని చెప్పినా డాక్టర్ గణేశ్ ఆలోచన మారలేదు. డబ్బు సంపాదించడం కన్నా.. ఆడపిల్లకు అండగా నిలవడమే ముఖ్యం అనుకున్నాడు. ఇప్పటి వరకు రెండు వేల మందికిపైగా ఆడపిల్లల తల్లులకు ఉచితంగా పురుడుపోశాడు.




### ఫలించిన ఆచరణ

అబ్బాయిల కంటే అమ్మాయిలు తక్కువగా ఉంటున్నారంటే లింగ నిర్ధారణ తర్వాత జరుగుతున్న 'అబార్షన్లు' అనే హత్యల ఫలితమేనని డాక్టర్ గణేశ్ బలంగా నమ్మాడు. వైద్య పరీక్షల కోసం వచ్చిన ప్రతి గర్భిణికీ ఆడపిల్ల గురించి అవగాహన కల్పించడం విధిగా పెట్టుకున్నాడు. కూతురు భారమని, పెంపకం శిక్షగా భావించే కుటుంబాలకు కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నాడు. నేటి సమాజంలో అమ్మాయిలకు ఉన్న విద్య, ఉపాధి అవకాశాల గురించి విడమర్చి చెబుతూ.. ఆడపిల్ల పుట్టుకను వేడుకగా మార్చేస్తున్నాడు. ఆయన ప్రయత్నాలు ఫలించి ఎంతోమంది ఆలోచనలూ మారాయి. డాక్టర్ గణేశ్ సేవాభావం స్థానికులనే కాదు సుదూర ప్రాంతాల ప్రజలనూ ఆకర్షించింది. ఆయన కృషి తెలిసిన వాళ్లు అభినందించడమే కాదు తనలా పనిచేసేందుకు ఆసక్తి కనబరిచారు. లింగ సమానత్వం కోసం వైద్యులు చేయాల్సిన కృషి ఇలా ఉండాలనే అభిప్రాయం కలిగించాడు. పాకిస్థాన్, నేపాల్, బంగ్లాదేశ్, చైనా, కెనడా మొదలైన దేశాల్లో పదమూడు వేల సంస్థలు, రెండున్నర మిలియన్ల మంది స్వచ్ఛంద కార్యకర్తలు డాక్టర్ గణేశ్‌లాగే పనిచేయాలని ముందుకు వచ్చారు. ముల్గీ వచ్వా అభియాన్ కార్యక్రమాన్ని ఆదర్శంగా తీసుకుని ముందుకుసాగుతున్నారు.

> **అమ్మకు ఆసరా కావాలనే**
>
> "**ఎవరైనా** చనిపోతే, ప్రాణం పోయిందని కుటుంబసభ్యులకు చెప్పడానికి మనసు సంకోచించినట్టే ఆడపిల్ల పుట్టిందని చెప్పడానికీ మొహమాటపడిన రోజులు నాకు తెలుసు. బిడ్డ పుట్టిందని తెలిసి కొన్నిసార్లు తల్లే బోరున ఏడ్చిన సన్నివేశాలు చూశాను. ఆడబిడ్డకు జన్మనిచ్చిందని భార్య ముఖం చూడకుండా వెళ్లిపోయిన ప్రబుద్ధులనూ చూశాను. అదే మగబిడ్డ జన్మించాడని తెలిస్తే.. అందరి ముఖాల్లో సంతోషం కనిపించేది. ఈ సంఘటనలే నన్ను ఆలోచింపజేశాయి. ఆడపిల్ల పట్ల వివక్ష పోయేరోజు రావాలని కోరుకున్నాను. ఆనాటి నుంచి ఆడపిల్ల పుడితే పండుగ చేయడం, ఫీజు తీసుకోకుండా పురుడుపోయడం, ఆ బిడ్డను బతికించడం కోసం ఉచితంగా వైద్య సేవలు చేయడం మొదలుపెట్టాను.
>
> • డాక్టర్ గణేశ్ రఖ్

### స్వీట్ హోమ్!

తొలినాళ్లలో డాక్టర్ గణేశ్‌ను విభేదించిన కుటుంబం ఇప్పుడు ఆయనకు మద్దతుగా పనిచేస్తున్నది. మెడికేర్ హాస్పిటల్ నిర్వహణ బాధ్యతల్ని డాక్టర్ గణేశ్ భార్య, బిడ్డ చూసుకుంటున్నారు. ఆర్థిక వ్యవహారాలను భార్య తృప్తి చక్కదిద్దుతుంటే, నిర్వహణను కుమార్తె తనీషా పర్యవేక్షిస్తున్నది. ఈ హాస్పిటల్‌లో పుట్టిన ప్రతిబిడ్డనూ సొంత కూతురిలా భావిస్తానని డాక్టర్ గణేశ్ అంటున్నాడు. మా కుటుంబసభ్యురాలిని ప్రేమగా ఆదరిస్తామని ఆయన భార్య, బిడ్డ చెబుతున్నారు.



**ఎక్కడ పుట్టాం, ఎలాంటి పరిస్థితుల్లో పెరిగాం అన్నదానితో సంబంధం లేకుండా మనల్ని ఉన్నత స్థితిలో నిలిపే ఒకే ఒక్క సోపానం విద్య. అది ఉంటే చాలు మనలో ఎక్కడలేని ఆత్మవిశ్వాసం వస్తుంది, బతుకు మీద భరోసా లభిస్తుంది. ముఖ్యంగా తీవ్ర లింగవివక్షకు గురవుతున్న ఆడపిల్లల జీవితాల్లో ఇది ఎనలేని మార్పును తెస్తుంది. ఈ విషయాన్ని మనసారా నమ్మిన మనిషి దిల్లీకి చెందిన సఫీనా హుస్సేన్. 'ఎడ్యుకేట్ గర్ల్స్' ఎన్‌జీవో'ను స్థాపించి దాని ద్వారా భారత్‌లోని 20 లక్షల మందికిపైగా ఆడపిల్లలకు విద్యాసేవ చేశారు. అందుకుగాను ప్రఖ్యాత రామన్‌మెగసెసే పురస్కారం లభించిందా సంస్థకు. ఈ సందర్భంలో ఎన్‌జీవోతో పాటు, దాని వెనకున్న వ్యక్తుల గురించి కొన్ని విలువైన విశేషాలు..**

# అమ్మాయి చదువుకు రామన్ మెగసెసే!

ఒక దీపం మరో దీపాన్ని వెలిగించగలదన్న మాట ఎంత నిజమో, ఒక విద్యావంతుడు మరో విద్యావంతుడ్ని తీర్చిదిద్దగలడన్న మాటా అంతే సత్యం. అందుకే తాను శ్రమించి సంపాదించుకున్న చదువును పది మందికీ చేరువ చేసేందుకు పోరాటం చేయాలని నిశ్చయించుకుంది సఫీనా హుస్సేన్. దిల్లీలోని ఒక ఇరుకింట్లో నివసించేదామె కుటుంబం. ప్లస్‌టూ చదువు అయిపోయాక పెండ్లి చేద్దాం అని అనుకున్నారు ఇంట్లో వాళ్లు. మూడు సంవత్సరాల పాటు ఆమె చదువుకు దూరం అయింది కూడా. కానీ, అదే సమయంలో బంధువు ఒకామె తనను చేరదీసింది. చదువు మీద ఎంతో మక్కువ ఉన్న సఫీనా ఆమె దన్నుతో ఏకంగా లండన్ స్కూల్ ఆఫ్ ఎకనమిక్స్‌లో చోటు దక్కించుకుంది. ప్రఖ్యాత విద్యాసంస్థ నుంచి పట్టా పుచ్చుకోవడంతో కార్పొరేట్ ఉద్యోగాలు వరుస కట్టాయి. కానీ, ఆమె మనసు అక్కడ స్థిమితంగా లేదు. భారత్‌కి తిరిగి వచ్చి తనలాంటి ఇబ్బందుల్ని ఎదుర్కొంటున్న ఆడపిల్లల చదువుకు అండగా ఉండాలని 2007లో ఎడ్యుకేట్ గర్ల్స్ స్వచ్ఛంద సంస్థను నెలకొల్పింది.

### లక్షల మందికి బాసట



ఆడపిల్లల చదువును ప్రోత్సహించేలా స్వచ్ఛంద సంస్థ స్థాపించాలనుకున్నప్పుడు దేశంలోని ఏయే రాష్ట్రాల్లో అత్యధికంగా బడి మానేస్తున్న పిల్లలు ఉన్నారన్న సర్వే చేశారు సఫీనా. దాని ఆధారంగా రాజస్థాన్‌లోని పాలి జిల్లాలో తన అవసరం ఎక్కువగా ఉందని గ్రహించి అక్కడి గ్రామాల్లో పనిచేయడం ప్రారంభించారు. ప్రస్తుతం రాజస్థాన్, మధ్యప్రదేశ్, ఉత్తర్‌ప్రదేశ్, బిహార్ రాష్ట్రాల్లోని 30,000 గ్రామాల్లో ఈ సంస్థ సేవలందిస్తున్నది. ప్రతి ఊరు లేదా ప్రాంతంలో 'టీమ్ బాలిక' పేరుతో వలంటీర్ల బృందాన్ని ఏర్పాటు చేస్తారు. వాళ్లు ప్రభుత్వం, ఇతర స్థానిక సంస్థలతో కలిసి పనిచేస్తూ ప్రతి ఇంటిలోనూ బడి ఈడు పిల్లల్ని గుర్తించి వాళ్ల ఇండ్లకు వెళ్లి మాట్లాడతారు. కుటుంబ సభ్యుల్లో స్ఫూర్తి నింపి సమస్యల్ని పరిష్కరించే ప్రయత్నం చేసి తిరిగి బడిలో చేరేలా కృషి చేస్తారు. సంస్థకు ఇలాంటి 23 వేల టీమ్‌లు ఉన్నాయి. ఇప్పటి దాకా 20 లక్షల మందికి పైగా ఆడ పిల్లలు వీళ్ల ద్వారా బడిబాట పట్టారు. మధ్యలో చదువు ఆపేసిన పెద్ద వాళ్లతోనూ పది పరీక్షలు రాయించి, వృత్తి విద్యా కోర్సుల్లో చేర్పించి, చిన్న స్థాయి ఉద్యోగాలు వచ్చేలానూ చూస్తారు. ఇలా దాదాపు 24 లక్షల మందికి సాయం చేసింది ఎడ్యుకేట్ గర్ల్స్. 'చదువు ఎంతో మంది ఆడపిల్లల జీవితాల్లో అత్యుత్తమ మార్పుల్ని తెచ్చిందనీ, ఇలా తమ ద్వారా తిరిగి పుస్తకం పట్టుకునే వారి సంఖ్య కోటి దాటాలన్నదే లక్ష్యమనీ, తమ కృషికి మెగసెసే పురస్కారం లభించడం చెప్పలేనంత ఆనందాన్నిచ్చిందనీ' అంటున్నారు సఫీనా. ఆసియా నోబెల్‌గా పిలిచే రామన్ మెగసెసే అవార్డును అందుకోవడం అంటే మాటలేం కాదు కదా మరి!

# అయినా.. పాలు పట్టొచ్చు!

**బిడ్డకు తల్లిపాలను మించిన పౌష్టికాహారం లేదన్న సంగతి తెలిసిందే. అయితే, మారుతున్న జీవనశైలితో చాలామంది చిన్నవయసులోనే 'డయాబెటిక్' బారిన పడుతున్నారు. ఇలాంటి షుగర్ బాధితులు.. పిల్లలకు పాలు పట్టొచ్చా? అని చాలామంది అనుమాన పడుతుంటారు. ఈ విషయంలో.. వైద్య నిపుణులు సలహాలు, సూచనలు అందిస్తున్నారు.**

**టైప్-1,** టైప్-2, ప్రెగ్నెన్సీ డయాబెటిక్ బాధితులు పిల్లలకు పాలు ఇవ్వొచ్చని 'అమెరికన్ డయాబెటిస్ అసోసియేషన్' స్పష్టం చేస్తున్నది. దీనివల్ల బిడ్డతోపాటు తల్లికీ అద్భుతమైన ఆరోగ్య ప్రయోజనాలు ఉంటాయని చెబుతున్నది. బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల... డయాబెటిక్ తల్లుల శరీరంలో ఉత్పత్తయ్యే ఇన్సులిన్ బాగా పనిచేస్తుందట. రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు కూడా నియంత్రణలో ఉంటాయని చెబుతున్నారు. ఇక ప్రెగ్నెన్సీ డయాబెటిక్ (గర్భధారణ సమయంలోనే వచ్చే మధుమేహం) ఉన్న మహిళలు.. బిడ్డకు పాలు ఇవ్వడం వల్ల తరువాతి దశలో టైప్-2 డయాబెటిస్ వచ్చే అవకాశం 15-30% తగ్గుతుందని అంటున్నారు. టైప్-1 డయాబెటిస్ ఉన్న మహిళలు పాలు పట్టడం వల్ల.. ఇన్సులిన్ అవసరాలు 25-50% తగ్గుతాయట. ఎందుకంటే, వారిలో పాల ఉత్పత్తి కోసం రక్తంలోని గ్లూకోజ్ అవసరం పడుతుంది. అదేవిధంగా, టైప్-2 డయాబెటిస్ ఉన్న తల్లుల్లోనూ బ్రెస్ట్ ఫీడింగ్ ద్వారా రక్తంలో గ్లూకోజ్ స్థాయిలు నియంత్రణలో ఉంటాయని అంటున్నారు. అదే సమయంలో.. డయాబెటిస్ నియంత్రణ కోసం జీవనశైలిలో మార్పులు చేసుకోవాలని సూచిస్తున్నారు. ఎందుకంటే.. ప్రసవానంతరం చాలామందిలో ఒత్తిడి అధికం అవుతుంది. పాలు ఇస్తున్నప్పుడు రోజువారీ కేలరీల అవసరం పెరుగుతుంది. కాబట్టి, అందుకు తగ్గట్టుగా, తల్లిగా కొత్త జీవితానికి సరిపోయేలా ఆరోగ్యకరమైన అలవాట్లను ప్లాన్ చేసుకోవాలని చెబుతున్నారు.

- భోజనంలో లీన్ ప్రొటీన్, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉండేలా చూసుకోవాలి. అధిక ఫైబర్ ఉండే తృణధాన్యాలు, చిక్కుళ్లు, కూరగాయలు వంటివి ఎక్కువగా తీసుకోవాలి.
- ఎట్టిపరిస్థితుల్లోనూ భోజనం దాటవేయవద్దు. ఎందుకంటే ఇది ఇన్సులిన్ స్థాయిలను ప్రభావితం చేస్తుంది. దీన్ని నివారించడానికి స్నాక్స్‌లో ప్రొటీన్ ఉండేలా చూసుకోవాలి.
- శరీరం డీహైడ్రేట్ కాకుండా ఉండేందుకు.. రోజూ 3-4 లీటర్ల నీళ్లు తాగాలి. ఈ అలవాటు పాల ఉత్పత్తితో పాటు రక్తంలో గ్లూకోజ్ నియంత్రణకు సహాయపడుతుంది.
- వైద్యుల సలహా మేరకు తేలికపాటి వ్యాయామాలు చేయాలి. దీని వల్ల మానసిక స్థితి కూడా మెరుగుపడుతుంది. ఒత్తిడి తగ్గుతుంది.
- నిద్రలేమి కూడా ఒత్తిడితోపాటు రక్తంలో గ్లూకోజ్ స్థాయిలను పెంచుతుంది. కాబట్టి, కంటి నిండా నిద్రపోవాలి.



# అరటి పువ్వుతో ఆరోగ్యం!



**భారతీయులు** ఇష్టంగా తినే పండ్లలో అరటి ముందుంటుంది. రుచితో పాటు అనేక ఆరోగ్య ప్రయోజనాలనూ అందిస్తుంది. అయితే, పండు మాత్రమే కాకుండా.. అరటి పువ్వు కూడా ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తుందని ఆయుర్వేద నిపుణులు చెబుతున్నారు. ఇందులో అధికంగా లభించే ఐరన్, ఫైబర్, ప్రొటీన్, క్యాల్షియం, పొటాషియం, భాస్వరం.. అనేక వ్యాధుల నుంచి రక్షణ కల్పిస్తాయని అంటున్నారు.

**మహిళల** ఆరోగ్య సమస్యలను నియంత్రించడంలో అరటి పువ్వు అద్భుతంగా పనిచేస్తుంది. రుతు చక్రాన్ని నిర్వహించడంతోపాటు పీరియడ్స్ సమయంలో నొప్పి, అసౌకర్యాన్ని తగ్గించడంలో సాయపడుతుంది. పునరుత్పత్తి ఆరోగ్యానికి మద్దతు ఇవ్వడంతోపాటు బాలింతల్లో పాల ఉత్పత్తిని పెంచుతుంది.

**అరటిపండులో** ఐరన్ అధికంగా లభిస్తుంది. రక్తహీనతను నివారించడంలో ఇది సమర్థంగా పనిచేస్తుంది. రక్తహీనతతో బాధపడేవారు.. అరటి పువ్వును క్రమంతప్పకుండా తినాలి.

**ఒత్తిడిని** నివారించడంలోనూ అరటి పువ్వు అద్భుతమే చేస్తుంది. ఇందులో మెగ్నీషియం, యాంటి ఆక్సిడెంట్లు, యాంటి డిప్రెసెంట్ అంశాలు పుష్కలంగా లభిస్తాయి. ఇవి మానసిక ఒత్తిడిని తగ్గించడంలో సాయమందిస్తాయి. మానసిక స్థితిని మెరుగుపరచడంలో కీలకంగా పనిచేస్తాయి.

**అరటి** పువ్వును ఆయుర్వేదంలో ఔషధంగా ఉపయోగిస్తారు. టైప్-2 డయాబెటిస్ రోగులకు.. ఈ పువ్వు దివ్యౌషధమే. అరటి పువ్వును క్రమంతప్పకుండా తీసుకుంటే.. రక్తంలో చక్కెర స్థాయిలు నియంత్రణలో ఉంటాయి.

**అరటి** పువ్వుల్లోని యాంటి ఆక్సిడెంట్లు.. రోగనిరోధక శక్తిని బలోపేతం చేస్తాయి. కణాలను దెబ్బతీసే ఫ్రీరాడికల్స్‌ను నియంత్రిస్తాయి. అంతేకాకుండా, ఇందులో లభించే విటమిన్ సి.. తెల్లరక్త కణాల ఉత్పత్తిని ప్రోత్సహిస్తుంది. రోగనిరోధక వ్యవస్థను బలంగా మార్చి.. వ్యాధులు, ఇన్ఫెక్షన్లు రాకుండా కాపాడుతుంది.

**అరటి** పువ్వులో లభించే పొటాషియం.. శరీరంలో సోడియం స్థాయిలను సమతుల్యం చేస్తుంది. రక్తపోటును నియంత్రిస్తుంది. గుండెపై ఒత్తిడిని నివారించడంతోపాటు అధిక రక్తపోటు, స్ట్రోక్ వంటి గుండె సమస్యలు వచ్చే అవకాశాలను తగ్గిస్తుంది.

**బరువు** తగ్గాలని అనుకునేవారు.. అరటి పువ్వును ఆహారంలో భాగం చేసుకోవాలి. తక్కువ కేలరీలు, ఎక్కువ ఫైబర్ ఉండటం వల్ల.. ఆకలిని నియంత్రణలో ఉంటుంది.

**జీర్ణ** సమస్యలను తగ్గించడంలో అరటి పువ్వు ముందుంటుంది. కడుపు నొప్పి, వాంతులు, విరేచనాలు లాంటి సమస్యలు వేధిస్తుంటే.. అరటి పువ్వును క్రమంతప్పకుండా తీసుకుంటే మంచి గుణం కనిపిస్తుంది.

## 15 వరకు ఇగ్నో ప్రవేశాల గడువు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : ఇందిరాగాంధీ నేషనల్ ఓపెన్ యూనివర్సిటీ(ఇగ్నో) జూలై సెషన్ ప్రవేశాల గడువును పొడగించారు. డిగ్రీ, పీజీ, పీజీ డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాలకు ఈ నెల 15లోగా దరఖాస్తు చేసుకోవాలని ఇగ్నో ప్రాంతీయ కేంద్రం డైరెక్టర్ కే రమేశ్, డిప్యూటీ డైరెక్టర్ రాజు బొల్లా తెలిపారు. దరఖాస్తులు సహా పూర్తి వివరాల కోసం www.ignou.ac.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని వారు సూచించారు.

## హెచ్ఎంఏ ఏడీపీ ప్రారంభం

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ) : విద్యార్థులను వ్యవస్థాపకులుగా మార్చేందుకు హైదరాబాద్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (హెచ్ఎంఏ)ఆధ్వర్యంలో అంత్రపెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం(ఏడీపీ)ను ప్రారంభించింది. మూడు రోజులపాటు జరుగనున్న ఈ వర్క్‌షాప్‌లో విద్యార్థులను భవిష్యత్తు ఉద్యోగ సృష్టికర్తలుగా మార్చడంపై శిక్షణ ఇస్తున్నారు. కార్యక్రమంలో హెచ్ఎంఏ అధ్యక్షుడు అల్వాల దేవేందర్‌రెడ్డి, కార్యదర్శి వాసుదేవన్, చంద్రశేఖర్, నగేస్ విశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

## సీబీఐకి పట్టుబడ్డ ఇద్దరు జీఎస్టీ అధికారులు

**బిల్లు విడుదలకు 30 వేలు డిమాండ్**

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): ఓ బిల్లు విడుదల చేయడానికి లంచం డిమాండ్ చేసిన ఇద్దరు జీఎస్టీ అధికారులను మంగళవారం సీబీఐ అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. హైదరాబాద్‌లోని జీఎస్టీ, కస్టమ్స్ డిపార్ట్‌మెంట్‌లో సీనియర్ అకౌంట్స్ ఆఫీసర్, సీనియర్ అసిస్టెంట్‌లు ప్యారిటీ బిల్లు చెల్లింపునకు సంబంధించి అదే విభాగంలో రిటైర్డ్ అసిస్టెంట్ కమిషనర్ నుంచి రూ. 30వేలు డిమాండ్ చేశారు. ఈ క్రమంలో బాధితుడు అంత ఇచ్చుకోలేనని చెప్పగా, రూ. 25వేలు ఇచ్చేందుకు ఒప్పందం కుదుర్చుకున్నారు. ఈ క్రమంలో సీబీఐ అధికారుల సూచన మేరకు.. బాధితుడు నిందితులకు డబ్బులు ఇస్తుండగా, అధికారులు రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుకుని అరెస్టు చేశారు. అనంతరం వారికి సంబంధించిన పలు చోట్ల అధికారులు సోదాలు చేపట్టారు.

# పోలీస్‌శాఖలో పైరవీలకే పెద్దపీట!

**అర్హులను కాదని అయిన వారికే అందలం**

- నలుగురు నాన్‌క్యాడర్ ఎస్పీలకు ప్రమోషన్
- 12మందితో రాష్ట్ర ప్రభుత్వం జాబితా
- ట్రాక్ రికార్డునూ పక్కనబెట్టిన వైనం
- ఆరోపణలున్న వారికి జాబితాలో చోటు



హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): రాష్ట్ర పోలీస్ విభాగంలో మళ్లీ పైరవీలకే పెద్దపీట వేశారు. అర్హత కలిగిన వారిని కాదని, అనుకూలమైన వారికే అందలం ఎక్కించేందుకు రంగం సిద్ధమైంది. నలుగురు నాన్‌క్యాడర్ ఎస్పీలకు ఐపీఎస్‌లుగా ప్రమోషన్ కల్పించేందుకు నిర్ణయించారు. పోలీస్ అధికారుల ట్రాక్ రికార్డులను పక్కనబెట్టి, పలు ఆరోపణలున్న వారితోనే జాబితా రెడీ అయింది. ఇప్పటికే బదిలీలు, పదోన్నతుల్లో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలున్న నేపథ్యంలో తాజా ఘటనతో అవకతవకలు చర్చనీయాంశంగా మారాయి. రాష్ట్ర సర్వీసుల నుంచి ఈసారి నలుగురికి ఐపీఎస్ రానున్నట్టు కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి సమాచారం ఇచ్చింది. నాలుగు పోస్టులకు పేర్లను ప్రతిపాదించాలని రాష్ట్ర ప్రభుత్వానికి సూచించింది. ఒక్కొక్క పోస్టుకు ముగ్గురేసి పేర్లను ప్రతిపాదిస్తూ రాష్ట్ర ప్రభుత్వం జాబితాను పంపించింది. అధికారుల మెరిట్, ట్రాక్ రికార్డుల ఆధారంగా కేంద్రానికి సిఫార్సు చేయాల్సి ఉంటుంది. రాష్ట్ర ప్రభుత్వం పంపే పేర్లను యూపీఎస్సీలోని సెలెక్షన్ కమిటీ వడపోసి నలుగురు పేర్లను ఖరారు చేస్తుంది. ఆ నలుగురి పేర్లతో కేంద్ర హోంశాఖ గెజిట్ కూడా విడుదల చేస్తుంది. మొత్తంగా 12 మందితో కూడిన జాబితాను కేంద్ర ప్రభుత్వానికి రాష్ట్ర ప్రభుత్వం పంపింది. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ఆ 12 పేర్లపై యూపీఎస్సీ సెలక్షన్ కమిటీ ఆగస్టు 27న ప్రత్యేకంగా భేటీ అయింది. ఆ కమిటీ నాలుగు పేర్లపై తుదినిర్ణయం తీసుకున్నట్టు తెలిసింది. రేపో మాపో దీనికి సంబంధించి కేంద్ర హోంశాఖ గెజిట్ నోటిఫికేషన్ విడుదల చేయనున్నది.

### ట్రాక్ రికార్డు లేని వారికి..

రాష్ట్ర ప్రభుత్వం కేంద్రానికి పంపిన జాబితాపై కొంతమంది నాన్‌క్యాడర్ ఎస్పీలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం కొంతమంది అనర్హులను, ట్రాక్ రికార్డు సరిగాలేని వారి పేర్లను కూడా కేంద్రానికి సిఫార్సు చేసిందని వారు ఆరోపిస్తున్నారు. ఈసారి పంపిన జాబితాలో అర్హులను పక్కనబెట్టారని, ఏసీబీ కేసులున్న వారికి, ఇంటిగ్రిటీ విషయంలో అనేక ఆరోపణలున్న వారికి కూడా జాబితాలో చోటు కల్పించారనే ఆరోపణలు ఉన్నాయి. రెండు పోస్టులపై ప్రధానంగా ఆరోపణలు వస్తున్నాయి. ఒకరిపై ఏసీబీ కేసులుండగా, మరొకరిపై అనేక దందాలు చేస్తున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. సర్వీసులో సస్పెండ్ అయిన వారికి కూడా మెరిట్‌లో స్థానం కల్పించడం ఏమిటని పలువురు ప్రశ్నిస్తున్నారు.

### ఆ డీసీపీ షాడో సీఎంకు దగ్గర

నగర శివారులో డీసీపీగా పనిచేసే ఓ అధికారిణి పేరు కూడా రాష్ట్ర ప్రభుత్వం సిఫార్సు చేసింది. ఆ అధికారిణిపై అనేక ఆరోపణలు ఉన్నాయి. షాడో సీఎంకు చాలా దగ్గర అని పేరున్న ఆ డీసీపీ.. చుట్టుపక్కల ఉన్న మరో ఇద్దరు డీసీపీలతో కలిసి చేయని దందా అంటూ లేదని పోలీస్ వర్గాలే కోడై కూస్తున్నాయి. ఇవే విషయాలను ఊటంకిస్తూ రాష్ట్ర ఇంటెలిజన్స్ చీఫ్‌కు నాలుగు పేజీల లేఖ ఒకటి ఆమె బాధితులు రాసి పంపినట్టు చెప్తున్నారు. పోలీస్ విభాగంలోని మరో ఉన్నతాధికారి కూడా ఆ అధికారి తీరుపై ఏకంగా 30 పేజీల నివేదికను హోం శాఖకు పంపినట్టు చెప్తున్నారు. వీటిని పక్కనబెట్టి ఆ పేరును మెరిట్ జాబితాలో ఉంచేలా రాష్ట్రంలోని షాడో సీఎం పావులు కదిపినట్టు గుసగుసలు. రాష్ట్ర ముఖ్యనేత సామాజిక వర్గానికి చెందిన ఆ అధికారి ఇప్పుడున్న పోస్టును అడ్డం పెట్టుకొని నగర శివారులోని మాన్సాన్‌పల్లిలో 13 ఎకరాల్లో మరో అధికారితో కలిసి ఏకంగా విల్లా ప్రాజెక్టును చేపట్టారని సమాచారం. తన ఏరియాలో ఏ స్టేషన్‌లో ఏ సివిల్ వివాదం వచ్చినా ఈ అధికారికి సమాచారం చేరిపోయే వ్యవస్థను ఏర్పాటు చేసుకున్నారు. ప్రతీ వివాదంలో డబ్బు పిండుకోవడమే లక్ష్యంగా పనిచేస్తున్న ఆ అధికారికి ఇప్పుడు ఐపీఎస్ ఇవ్వాలంటూ రాష్ట్ర ప్రభుత్వం ప్రతిపాదించడం విడ్డూరమని పోలీసు వర్గాలే చెప్తున్నాయి.



ఆందోళన చేస్తున్న ఉద్యోగులు. చిత్రంలో రాజ్యసభ సభ్యుడు ఆర్ కృష్ణయ్య

## అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల ధర్నా

- పెండింగ్ వేతనాలు వెంటనే ఇవ్వాలి
- సంఘీభావం ప్రకటించిన ఆర్ కృష్ణయ్య

ఖైరతాబాద్, సెప్టెంబర్ 2 : రాష్ట్రంలోని ఆదర్శ పాఠశాలల్లో పనిచేస్తున్న అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఆరు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడంతో వారంతా రోడ్డెక్కారు. తెలంగాణ మోడల్ స్కూల్ అవుట్‌సోర్సింగ్ ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో మంగళవారం లక్డీకాపూల్‌లోని పాఠశాల విద్యాశాఖ కార్యాలయం ముందు భారీ ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్దఎత్తున నినాదాలు చేశారు. ధర్నాకు జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు, ఎంపీ ఆర్ కృష్ణయ్య సంఘీభావం ప్రకటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆరు నెలలుగా ఆదర్శ పాఠశాలల అవుట్‌సోర్సింగ్ ఉద్యోగులకు జీతాలు ఇవ్వకపోవడం బాధాకరమని పేర్కొన్నారు. వేతనాలు ఇవ్వకుంటే కుటుంబాలను ఎలా పోషించుకోవాలని ప్రశ్నించారు. ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా వేజ్ ప్యాకేజీ ఇవ్వాలని, మూడేండ్లకు మించి పని చేసిన వారిని పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. అవుట్ సోర్సింగ్ ఏజెన్సీలు అవినీతికి పాల్పడుతున్నాయని, తక్షణమే వాటిని రద్దు చేసి ప్రభుత్వమే నేరుగా వేతనాలు చెల్లించాలని కోరారు. ప్రభుత్వం స్పందించకుంటే ఆందోళన కార్యక్రమాలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ధర్నా అనంతరం కృష్ణయ్య, బీసీ సంక్షేమ సంఘం జాతీయ ఉపాధ్యక్షుడు గుజ్జ కృష్ణ, నిరుద్యోగ జేఏసీ చైర్మన్ నీల వెంకటేశం బృందం విద్యాశాఖ డైరెక్టర్‌తో మాట్లాడారు. మొదటి విడతలో మూడు, ,మరో విడతలో మిగతా మూడు నెలల వేతనాలు చెల్లిస్తామని హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించారు. కార్యక్రమంలో యాదగిరి, కొండయ్య, నందగోపాల్, రామకృష్ణ, రవి, నిఖిల్ తదితరులు పాల్గొన్నారు.

# నేను అలా జరిగితే... ఇలా కుర్చీలో కూర్చొనే వాళ్లున్నారు!

- నేనే నడుపుతలే అనేవాళ్లు సిద్ధంగా ఉన్నారు
- సొంత అనుభవంతో చెబుతున్నా
- రేవంత్‌రెడ్డి సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): సీఎం కుర్చీపై రేవంత్‌రెడ్డి మరోసారి సంచలన వ్యాఖ్యలు చేశారు. ఇప్పటికీ ఆయనకు ముఖ్యమంత్రి కుర్చీపై అపనమ్మకం పోలేదని స్పష్టమవుతున్నది. మంగళవారం హైదరాబాద్‌లో మాజీ ఎంపీ కేవీపీ రాంచందర్‌రావు నిర్వహించిన వైఎస్ రాజశేఖర్‌రెడ్డి మెమోరియల్ అవార్డు కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి పాల్గొన్నారు. సేంద్రీయ వ్యవసాయంలో విశేష కృషి చేస్తున్న డాక్టర్ సుభాష్ పాలేకర్‌కు అవార్డు అందజేశారు. పాలేకర్ సూచించిన ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహించాల్సిన అవసరం ఉన్నదని అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా సీఎం రేవంత్ మాట్లాడుతూ.. తాను ఇలా పక్కకు జరిగితే, అలా కుర్చీలో కూర్చొనే వాళ్లు సిద్ధంగా ఉన్నారని చెప్పారు. 'మనం ఎవరినైనా మొదటివారం లోపలికి రానిస్తే.. రెండో వారంలో మనం కాసేపు ఇలా జరిగి అలా పక్కకు పోతే ఆ కుర్చీలో కూర్చొనేవాళ్లున్నారు. నేనే నడుపుతాలే అనే వాళ్లు ఉన్నారు. నేను అనుభవంతో ఇవన్నీ చెబుతున్నాను' అంటూ వ్యాఖ్యానించారు. ఆ సమయంలో వేదికపై డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, మంత్రి శ్రీధర్‌బాబు ఉన్నారు. రేవంత్‌రెడ్డి తన సీఎం కుర్చీ గురించే ఈ వ్యాఖ్యలు చేసినట్టు రాజకీయ విశ్లేషకులు పేర్కొంటున్నారు. ఇప్పటికీ ఆయనకు కుర్చీపై అపనమ్మకం పోలేదని ఈ వ్యాఖ్యలతో స్పష్టమవుతున్నదని అభిప్రాయపడుతున్నారు.

### పాలేకర్ సూచన బాగున్నది: సీఎం రేవంత్

ఎరువుల వినియోగం వల్ల ఏటా సుమారు రూ. 4 లక్షల కోట్లు విదేశాలకు వెళ్తున్నాయని, ప్రకృతి వ్యవసాయంతో దీనికి అడ్డుకట్ట వేయొచ్చన్న పాలేకర్ సూచన బాగున్నదని సీఎం రేవంత్ పేర్కొన్నారు. అందుకే రాష్ట్రంలో ఎరువులు వినియోగాన్ని తగ్గించేలా ప్రకృతి వ్యవసాయాన్ని ప్రోత్సహిస్తామని చెప్పారు. ఈ విషయంలో చర్యలు తీసుకోవాలని డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కకు, మంత్రి శ్రీధర్ బాబుకు సూచించారు. మూడు నెలల్లోనే రాష్ట్రంలో రైతులకు రూ. 2 లక్షల రుణ మాఫీ చేశామని, నిరుడు రైతులు పండించిన 2.85 కోట్ల టన్నుల ధాన్యాన్ని ప్రభుత్వం కొనుగోలుచేసి.. రూ.500 బోనస్ ఇచ్చిందని వ్యాఖ్యానించారు. ఇవి శుద్ధ అబద్ధాలని, రుణమాఫీ కాని రైతులు వేలల్లో ఉన్నారని ప్రజలు గుర్తు చేస్తున్నారు. బోనస్ ఇచ్చింది 23 లక్షల టన్నులకు మాత్రమే అని, ఆ బకాయిలు రూ. 1160 కోట్లు ఇప్పటివరకు రైతులకు చెల్లించలేదన్నారు.

### రంగారెడ్డి జిల్లాకు గోదావరి జలాలు

ఎన్డీఎస్ఏ సూచించినా, సాగునీటి రంగ నిపుణులు పదేపదే చెప్తున్నా మేడిగడ్డ బరాజ్‌ను మరమ్మతులు చేసి వినియోగంలోకి తేవాలనే ఉద్దేశం రాష్ట్ర ప్రభుత్వానికి లేదని తేలిపోయింది. రూ.వందల కోట్లలో పూర్తయ్యే మరమ్మతులను కాదని.. రూ.వేల కోట్లతో తుమ్మిడిహట్టి దగ్గర బరాజ్‌ను నిర్మించాలని కాంగ్రెస్ ప్రభుత్వం నిర్ణయించింది. ఇదే వేదికపై స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి ప్రకటించారు. 'తుమ్మిడిహట్టి దగ్గర ప్రాజెక్టును కడతాం. రంగారెడ్డి జిల్లాలో చేవెళ్ల, కొడంగల్, పరిగి, తాండూర్ ప్రాంతాలకు గోదావరి జలాలను తరలిస్తాం' అని ప్రకటించారు.

### ఉద్యోగుల సమస్యలు పెడచెవిన పెట్టిన కాంగ్రెస్




కాంగ్రెస్ ప్రభుత్వానికి ఉద్యోగుల సమస్యలు పట్టించుకోవడానికి తీరికలేకుండా పోయిందని భాగ్యనగర్ టీఎన్జీవోస్ నాయకులు మండిపడ్డారు. తమ స్థలాల కోసం గోపన్‌పల్లిలోని భాగ్యనగర్ టీఎన్జీవోస్ మ్యూచివల్ ఎయిడెడ్ కో–ఆపరేటివ్ హౌసింగ్ సొసైటీ కార్యాలయం వద్ద ఉద్యోగులు చేస్తున్న ఆందోళన మంగళవారం నాటికి 49వ చేరుకున్నది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ఉద్యోగులు ప్లకార్డులు చేతపట్టుకుని నిరసన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా తమ ఇండ్ల స్థలాలు తమకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. టీటీఎన్జీవో హౌసింగ్ సొసైటీ అధ్యక్షుడు ముత్యాల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఆందోళన కొనసాగింది. – శేరిలింగంపల్లి

## గ్యాంగ్‌స్టర్ ఓజస్ గంభీర




పవన్‌కల్యాణ్ నటిస్తున్న గ్యాంగ్‌స్టర్ డ్రామా 'ఓజీ' ఈ దసరా బరిలో ప్రేక్షకుల ముందుకురానుంది. ఇప్పటికే విడుదలైన ప్రచార చిత్రాలు సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. సుజీత్ దర్శకత్వం వహిస్తున్న ఈ సినిమా ఈ నెల 25న ప్రపంచ వ్యాప్తంగా విడుదలకు సిద్ధమవుతున్నది. మంగళవారం పవన్‌కల్యాణ్ పుట్టినరోజు సందర్భంగా కొత్త గ్లింప్స్‌ను విడుదల చేశారు. ఈ సినిమాలో స్టైలిష్ గ్యాంగ్‌స్టర్ ఓజస్ గంభీర పాత్రలో పవన్‌కల్యాణ్ కనిపించబోతున్న విషయం తెలిసిందే. తాజా గ్లింప్స్‌లో ప్రతినాయక పాత్రధారి ఇమ్రాన్ హష్మీతో ఓజస్ గంభీర పోరాటాన్ని చూపించారు. ఇందులో పవన్‌కల్యాణ్, ఇమ్రాన్‌హష్మీ పోటాపోటీగా కనిపించారు. విజువల్స్ కట్టిపడేసేలా ఉన్నాయి. ప్రియాంక అరుళ్ మోహన్, ప్రకాష్ రాజ్, శ్రియారెడ్డి తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: తమన్, నిర్మాతలు: డీవీవీ దానయ్య, కల్యాణ్ దాసరి, దర్శకత్వం: సుజీత్.

## కొత్త దర్శకునితో బ్లాక్ మ్యాజిక్ నేపథ్యంలో..



ప్రస్తుతం హీరో రామ్ పోతినేని 'ఆంధ్ర కింగ్ తాలుక' సినిమా షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. మహేశ్‌బాబు.పి దర్శకత్వంలో మైత్రీమూవీమేకర్స్ నిర్మిస్తున్న ఈ చిత్రం నవంబర్ 28న విడుదల కానుంది. ఈ సినిమా తర్వాత ఓ కొత్త దర్శకునితో పనిచేసేందుకు రామ్ రెడీ అవుతున్నట్టు సమాచారం. ఆ దర్శకుని పేరు కిశోర్ గోపు. ఆర్కా మీడియాతో కలిసి నటుడు రానా దగ్గుబాటి ఈ సినిమా నిర్మించనున్నట్టు తెలుస్తున్నది. మిస్టిక్ థ్రిల్లర్‌గా, బ్లాక్ మ్యాజిక్, అతీంద్రియ శక్తుల నేపథ్యంలో ఈ సినిమా రూపొందనున్నదని సమాచారం. జనవరి నుంచి రెగ్యులర్ షూటింగ్ మొదలుకానున్నట్టు ఇన్‌సైడ్ టాక్.



## 'మిరాయ్'లో అంబిక పాత్రలో

తేజ సజ్జా హీరోగా సూపర్ హీరో కథాంశంతో రూపొందుతున్న చిత్రం 'మిరాయ్'. కార్తీక్ ఘట్టమనేని దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రాన్ని పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై టీజీ విశ్వప్రసాద్, కృతిప్రసాద్ నిర్మిస్తున్నారు. ఈ నెల 12న ప్రేక్షకుల ముందుకురానుంది. ఈ సినిమాలో అంబిక అనే కీలక పాత్రలో సీనియర్ నటి శ్రియ నటిస్తున్నారు. హీరో మదర్ క్యారెక్టర్ ఇదని, కథాగమనంలో ప్రధాన భూమిక పోషిస్తుందని మేకర్స్ అంటున్నారు. మంగళవారం అంబిక పాత్ర తాలూకు ఫస్ట్‌లుక్‌ను విడుదల చేశారు. అంబిక పాత్ర భావోద్వేగభరితంగా సాగుతుందని, తనయుడి లక్ష్యసాధనలో ఆమె ఎలాంటి పాత్ర పోషించిందన్నది ఆసక్తికరంగా ఉంటుందని చిత్రబృందం పేర్కొంది. రితికా నాయక్, జయరామ్, జగపతిబాబు తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: గౌరహరి, దర్శకత్వం: కార్తీక్ ఘట్టమనేని.

## కిరణ్ అబ్బవరం బాలీవుడ్ ఎంట్రీ?



గత ఏడాది 'క' చిత్రంతో కెరీర్‌లోనే భారీ విజయాన్ని సొంతం చేసుకున్నారు యువ హీరో కిరణ్ అబ్బవరం. ప్రస్తుతం ఆయన వరుస సినిమాలతో బిజీగా ఉన్నారు. తాజాగా ఆయన బాలీవుడ్‌లోకి ఎంట్రీ ఇవ్వబోతున్నట్లు తెలిసింది. వివరాల్లోకి వెళితే..'మిర్జాపూర్' సిరీస్‌తో ప్రతిభావంతుడైన దర్శకుడిగా గుర్తింపును తెచ్చుకున్నారు ఆనంద్ అయ్యర్. తాజాగా ఆయన ఓ పాన్ ఇండియా చిత్రానికి సన్నాహాలు చేస్తున్నారు. ఇందులో కిరణ్ అబ్బవరం కథానాయకుడిగా నటించనున్నట్లు వార్తలొస్తున్నాయి. ఇప్పటికే ఈ విషయమై సంప్రదింపులు పూర్తయ్యాయని, త్వరలో అధికారిక ప్రకటన వెలువడుతుందని అంటున్నారు. కిరణ్ అబ్బవరం ప్రస్తుతం కే ర్యాంప్, చెన్నై లవ్ స్టోరీ చిత్రాల్లో నటిస్తున్నారు. సుకుమార్ రైటింగ్స్ సంస్థలో ఓ సినిమా ఖరారైందని తెలిసింది. 'క' సినిమా ద్వారా వచ్చిన గుర్తింపు వల్లే కిరణ్ అబ్బవరం బాలీవుడ్ దర్శకుడి దృష్టిలో పడ్డారని, ఒకవేళ ఈ ప్రాజెక్ట్ నిజమైతే ఆయన కెరీర్‌లో మరో మెట్టెక్కడం ఖాయమని ట్రేడ్ వర్గాల్లో వినిపిస్తున్నది.

## వినోదమే ప్రధానంగా 'నేను రెడీ'



హవీష్ కథానాయకుడిగా త్రినాథరావు నక్కిన దర్శకత్వంలో రూపొందుతున్న ఫ్యామిలీ ఎంటర్టైనర్ 'నేను రెడీ'. కావ్య థాపర్ కథానాయిక. నిఖిల కోనేరు నిర్మాత. ఈ చిత్రం షూటింగ్ శరవేగంగా జరుపుకుంటున్నది. సోమవారం హైదరాబాద్ ఆర్ఎఫ్‌సీలో కీలక టాకీ పార్ట్ షూటింగ్ మొదలైంది. ప్రధాన తారాగణమంతా ఈ షూట్‌లో పాల్గొన్నారు. త్రినాథరావు నక్కిన మార్క్ అవుట్ అండ్ అవుట్ ఎంటర్టైనర్‌గా ఈ సినిమా ఉంటుందని, ఫ్యామిలీ అంతా కలిసి చూసేలా సినిమాను తెరకెక్కిస్తున్నామని చిత్రబృందం చెబుతున్నది. బ్రహ్మానందం, వెన్నెల కిశోర్, మురళీశర్మ, వీటీవీ గణేశ్, అజయ్, మురళీధర్ గౌడ్, గోపరాజు విజయ్, శ్రీకాంత్ అయ్యంగార్ తదితరులు ఇతర పాత్రలు పోషిస్తున్న ఈ చిత్రానికి కథ, మాటలు: విక్రాంత్ శ్రీనివాస్, కెమెరా: నిజార్ షఫీ, సంగీతం: మిక్కీ జె.మేయర్, నిర్మాణం: హర్నిక్స్ ఇండియా ఎల్ ఎల్ పి.

## స్మోకింగ్ సీన్స్‌కు దూరం




యువతపై సినిమా ప్రభావం తప్పకుండా ఉంటుందని, అది కాదన లేని సత్యమని, అందుకే సృజనాత్మక రంగంలో ఉన్నవారు సామాజిక బాధ్యతతో వ్యవహరించాలని చెప్పారు అగ్ర దర్శకుడు నాగ్ అశ్విన్. 'మహానటి' 'కల్కి' చిత్రాలతో ఆయన దేశవ్యాప్తంగా పాపులర్ అయ్యారు. తాజాగా ఇచ్చిన పాడ్‌కాస్ట్ ఇంటర్వ్యూలో సినిమా తాలూకు సామాజిక బాధ్యతపై ఆసక్తికరమైన వ్యాఖ్యలు చేశారు. యువత సినిమాల వల్ల ఎంతగానో ప్రభావితమవుతారని, అందుకే తన సినిమాల్లో స్మోకింగ్ సన్నివేశాల్ని సాధ్యమైనంత వరకు లేకుండా చూసుకుంటానని తెలిపారు. 'నా టీనేజ్ రోజుల్లో హీరోలు స్లోమోషన్‌లో స్టైల్‌గా సిగరెట్ కాల్చే సీన్స్ చూసినప్పుడు చాలా గొప్పగా అనిపించేది. సిగరెట్ తాగడం కరెక్టే అనుకునేవాడిని. కాస్త పరిణితి వచ్చాక వాస్తవం తెలుసుకున్నా. నాలాగే టీనేజర్లు అలాంటి సీన్స్ చూసి ఎఫెక్ట్ అవుతారు' అని నాగ్‌అశ్విన్ అన్నారు. తాను దర్శకత్వం వహించిన 'మహానటి' సినిమాల్లో చక్రపాణి పాత్ర పోషించిన ప్రకాశ్‌రాజ్ కేవలం ఒక్క సన్నివేశంలో స్మోక్ చేస్తూ కనిపిస్తారని, నిజ జీవితంలో చక్రపాణిగారు చైన్‌స్మోకర్ కావడం వల్ల ఆ సీన్‌ను పెట్టాల్సి వచ్చిందని నాగ్‌అశ్విన్ వివరించారు. దర్శకుడికి సృజనాత్మక స్వేచ్ఛ అవసరమని, అదే సమయంలో సామాజిక బాధ్యత కూడా అవశ్యమని నాగ్ అశ్విన్ పేర్కొన్నారు. ప్రస్తుతం నాగ్‌అశ్విన్ 'కల్కి–2' సినిమా సన్నాహాల్లో బిజీగా ఉన్నారు.

## కాత్యాయనిగా అలరిస్తా



'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు' తర్వాత కొన్ని ఆఫర్లు వచ్చాయి. కానీ సెలక్టివ్‌గా వెళ్లాలని వెయిట్ చేశా. మంచి కంటెంట్ ఉన్న కథ కోసం ఎదురు చూస్తున్నప్పుడు 'లిటిల్ హార్ట్స్' ప్రాజెక్ట్ నా దగ్గరకొచ్చింది. డైరెక్టర్ సాయిమార్తాండ్ ఈ కథ చెప్పినప్పుడు ఎగ్జైటింగ్‌గా అనిపించింది. ప్రతి పాత్రనూ డిజైన్ చేసిన తీరు సూపర్. నా 'అంబాజీపేట మ్యారేజ్ బ్యాండు'లో లవ్ స్టోరీతోపాటు ఎమోషనల్ కంటెంట్ ఉంటుంది. ఈ సినిమా అలా కాదు. ఇది కంప్లీట్ లైట్ హార్టెడ్ మూవీ. కాలేజీ రోజుల్లో ఉండే ఫన్‌తో ఈ సినిమా సాగుతుంది. యూత్‌కి విపరీతంగా నచ్చే సినిమా ఇది.' అని శివాని నాగరం అన్నారు. మౌళి తనుజ్, శివాని నాగరం జంటగా నటించిన యూత్‌ఫుల్ లవ్ స్టోరీ 'లిటిల్ హార్ట్స్'. సాయిమార్తాండ్ దర్శకుడు. ఆదిత్య హాసన్ నిర్మాత. బన్నీవాస్, వంశీ నందిపాటి ద్వారా ఈ చిత్రం ఈ నెల 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా కథానాయిక శివాని నాగరం మంగళవారం విలేకరులతో ముచ్చటించారు. 'ఇందులో నా పేరు 'కాత్యాయని'. ప్రతి అమ్మాయి తమతో తాము పోల్చుకునేలా నా పాత్ర ఉంటుంది. అఖిల్, కాత్యాయని స్నేహం, ప్రేమ.. ప్రతి ఒక్కరి కాలేజ్ రోజుల్ని గుర్తు చేస్తుంది. ఈ సినిమా థియేటర్‌కోసం చేసిందే అయినా.. బన్నీ వాస్, వంశీ నందిపాటి ఎంటర్ అయ్యాక, సినిమా రేంజ్ మారింది. ఈటీవీ విన్ రిలీజ్ చేస్తున్న తొలి థియేట్రికల్ ఫిల్మ్ ఇదే కావడం విశేషం' అని తెలిపారు శివాని నాగరం.

**చిత్రం**



## సమస్య నిర్మూలనకు ఊతమిచ్చే కథ ఇది!

'రచయిత చింతకింద శ్రీనివాసరావు ఈ 'ఘాటి'ల గురించి నాకు చెప్పారు. ఆంధ్ర, ఒరిస్సా సరిహద్దుల్లో శీలావతి గాంజా రకం పెరుగుతుంది. దానికోసం ఓ వ్యవస్థ పనిచేస్తుంది. వాటిని మోసేందుకు కూలీలుంటారు. వారిని ఘాటీలంటారు. వారిపై చింతకింద శ్రీనివాసరావు ఓ 30 పేజీల కథ రాశారు. దాన్ని డెవలప్ చేయడం మొదలుపెట్టాను. లొకేషన్ సెర్చింగ్ కోసం తూర్పు కనుమలకు వెళ్లాను. అదంతా ఓ కొత్త ప్రపంచం. వారి జీవన శైలి కొత్తగా అనిపించింది. ఓ కొత్త కల్చర్‌ని చూపించే ఆస్కారం వుండటంతో 'ఘాటి' మొదలుపెట్టాను.' అని దర్శకుడు క్రిష్ జాగర్లమూడి అన్నారు. ఆయన దర్శకత్వంలో అనుష్క కథానాయికగా రూపొందిన చిత్రం 'ఘాటి'. విక్రమ్‌ప్రభు మేల్ లీడ్‌లో కనిపిస్తారు. ఈ చిత్రం ఈ నెల 5న విడుదల కానుంది. ఈ సందర్భంగా మంగళవారం క్రిష్ విలేకరులతో మాట్లాడారు. ' 'వేదం' తర్వాత అనుష్కతో చేసే కథ ఓ మంచి ఆర్గానిక్‌గా ఉండాలని భావించా. దాని కోసం వెతికే క్రమంలో దొరికిన కథే 'ఘాటి'. ఇందులో శీలావతిగా అనుష్క గ్రేస్, ఆటిట్యూడ్ తన సూపర్‌స్టార్‌డమ్‌కు పర్‌ఫెక్ట్ యాప్ట్.' అని తెలిపారు క్రిష్. ఇంకా చెబుతూ 'ఘాటి' పూర్తిగా ఫిక్షన్. కమర్షియల్ యాక్షన్‌తో కేవలం అనుష్క కోసం చేసిన బిగ్ స్కేల్ మూవీ ఇది. అయితే.. మనందరం ఎదుర్కొంటున్న ఓ సమస్య నిర్మూలనకు ఈ కథ ఊతమిస్తుంది. ఇందులో తీవ్రమైన భావోద్వేగాలుంటాయి. యాక్షన్ సీక్వెన్స్‌లో కూడా ఎమోషన్స్ కనిపిస్తాయి. ' అని పేర్కొన్నారు క్రిష్. హీరో దేశిరాజుగా విక్రమ్ ప్రభు, విలన్ కందుల నాయుడుగా చైతన్యరావు, కాష్టాల నాయుడుగా రవీంద్ర విజయ్ పాత్రలు హైలైట్‌గా నిలుస్తాయి. ఈ సినిమా సాంకేతికంగా ఓ అద్భుతమనే చెప్పాలి. డీవోపీ మనోజ్ విజువల్స్, సాగర్ సంగీతం, విస్తృతమైన విషయాన్ని అందంగా చెప్పే సాయిమాధవ్ బుర్రా సంభాషణలు.. ఇలా అన్ని విధాలుగా సినిమా ఆకట్టుకుంటుంది. అనుష్క సినిమా బావుంటే.. దాన్ని రేంజ్ ఎలా ఉంటుందో చాలా సినిమాలు నిరూపించాయి. ఈ 'ఘాటి'తో అది మరోమారు రుజువుకానుంది.' అని క్రిష్ నమ్మకం వెలిబుచ్చారు.

## సమాన గౌరవానికి మేం అర్హులమే



'ఐక్యరాజ్య సమితి పాపులేషన్ ఫండ్'(UNFPA) ఇండియాకు లింగ సమానత్వ గౌరవ రాయబారిగా నటి కృతి సనన్ ఎంపియ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సినీ పరిశ్రమలోని లింగ వివక్షపై ఆసక్తికరమైన కామెంట్లు చేశారు. 'సౌకర్యాల విషయంలోనే కాదు, గౌరవం విషయంలోనూ ఇండస్ట్రీలో అసమానతే. నిజానికి హీరోలతో సమానమైన గౌరవానికి మేం అర్హులం. కానీ లొకేషన్లో మాకు ఆ గౌరవం దొరకదు. పెద్దపెద్ద కార్లు, విలాసవంతమైన గదులు హీరోలకు కేటాయిస్తారు. హీరోయిన్లు సామాన్యమైన సౌకర్యాలతో సర్దుకోవాల్సిందే. చూడ్డానికి ఇవి చిన్న విషయాల్లాగే కనిపిస్తాయి. కానీ మనసును మాత్రం చాలా బాధిస్తాయి. హీరోలు సెట్స్‌కి ఆలస్యంగా వస్తారు. హీరోయిన్లు మాత్రం టైమ్‌కి రావాలి. అసిస్టెంట్ డైరెక్టర్లు మాకు చెప్పినంత ఈజీగా త్వరగా రమ్మని హీరోలకు చెప్పలేరు. ఈ ఆలోచనా విధానంలో మార్పురావాలి.' అంటూ ఆవేశంగా మాట్లాడారు కృతి సనన్.

# టైటిల్ స్పాన్సర్లు కావలెను

**బిడ్డింగ్ ప్రక్రియ మొదలుపెట్టిన బీసీసీఐ**



ఆన్‌లైన్ గేమింగ్, క్రిప్టో కరెన్సీ సంస్థలకు నో

ముంబై: భారత క్రికెట్ జట్టుకు టైటిల్ స్పాన్సర్‌షిప్ వేటను బీసీసీఐ మొదలుపెట్టింది. ఇటీవలే పార్లమెంట్‌లో ఆమోదం పొందిన 'ప్రమోషన్ అండ్ రెగ్యులేషన్ ఆఫ్ ఆన్‌లైన్ గేమింగ్ యాక్ట్ 2025'తో 'డ్రీమ్ 11' సంస్థ అర్థాంతరంగా టీమ్‌ఇండియా టైటిల్ స్పాన్సర్ నుంచి వైదొలిగిన నేపథ్యంలో బీసీసీఐ కొత్త స్పాన్సర్‌ను వెతుక్కునే పనిలో పడింది. గతానుభవాల దృష్ట్యా బీసీసీఐ ఈసారి బిడ్డింగ్‌లో పాల్గొనే సంస్థలకు స్పష్టమైన లక్ష్మణ రేఖ గీసింది. ఆన్‌లైన్ మనీ గేమింగ్, బెట్టింగ్, గ్యాంబ్లింగ్‌తో ప్రత్యక్షంగా గానీ పరోక్షంగా గానీ భారత్‌తో పాటు ఇతర దేశాల్లోనూ ఎలాంటి సేవలనూ అందిస్తున్న సంస్థలైనా బిడ్ దాఖలు చేసేందుకు అనర్హులని తేల్చి చెప్పింది. అంతేగాక క్రిప్టో కరెన్సీ, నిషేధిత ఉత్పత్తుల బ్రాండ్లు, పొగాకు, ఆల్కహాల్, బీసీసీఐ బ్లాక్ లిస్ట్‌లో ఉన్న సంస్థలకూ నో చెప్పింది. బిడ్ వేసే సంస్థల వార్షిక టర్నోవర్ కనిష్టంగా రూ. 300 కోట్లు ఉండాలని బీసీసీఐ పేర్కొంది. బిడ్ దాఖలు చేసేందుకు చివరి తేదీని ఈనెల 16గా నిర్ణయించింది. ఇదిలాఉండగా బీసీసీఐ కొత్త స్పాన్సర్ వేటలో ఉన్న నేపథ్యంలో ఈనెల 9 నుంచి యూఏఈ వేదికగా మొదలుకాబోయే ఆసియా కప్‌లో సూర్యకుమార్ నేతృత్వంలోని భారత జట్టు టైటిల్ స్పాన్సర్ లేకుండానే బరిలోకి దిగనుంది.

## రోహిత్ ఫుల్ ఫిట్!



ముంబై: టీమ్‌ఇండియా వన్డే కెప్టెన్ రోహిత్ శర్మ ఫుల్ ఫిట్‌నెస్‌తో కనిపిస్తున్నాడు. ఇప్పటికే టీ20లు, టెస్టులకు రిటైర్మెంట్ పలికిన హిట్‌మ్యాన్ రానున్న ఆస్ట్రేలియా సిరీస్ కోసం పూర్తి స్థాయిలో చెమటోడుస్తున్నాడు. మాజీ క్రికెటర్ అభిషేక్ నాయర్ నేతృత్వంలో ఫిట్‌నెస్‌పై దృష్టి సారించిన రోహిత్ దాదాపు 20 కిలోల బరువు తగ్గినట్లు తెలిసింది. ఐపీఎల్ తర్వాత నుంచి ఆటకు దూరంగా ఉన్న ఈ స్టార్ క్రికెటర్ అధిక బరువుతో కనిపించాడు. అయితే 2027 వన్డే వరల్డ్‌కప్ లక్ష్యంగా ముందుకు సాగుతున్న రోహిత్ అందుకు తగ్గట్లు నాయర్ పర్యవేక్షణలో జిమ్‌లో కష్టపడటం తెలిసిన సంగతే. బోర్డుగా కొత్తగా తీసుకొచ్చిన బ్రాంకో టెస్టులోనూ రోహిత్ అందరి అంచనాలను తలక్రిందులు చేశాడు. బెంగళూరులోని బీసీసీఐ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫిట్‌నెస్ టెస్టు ముగించుకుని ముంబైకి చేరుకున్న రోహిత్ బరువు తగ్గి కొత్తగా కనిపించాడు. ఆస్ట్రేలియాతో అక్టోబర్ 19 నుంచి మొదలయ్యే వన్డే సిరీస్‌లో రోహిత్ బరిలోకి దిగనున్నాడు.

## ఇంటర్‌స్టేట్ బ్యాడ్మింటన్ టోర్నీ షురూ



హైదరాబాద్, ఆట ప్రతినిధి: కన్హా శాంతి వనం వేదికగా హార్ట్‌ఫుల్‌నెస్ 79వ ఇంటర్‌స్టేట్ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్ పోటీలు మంగళవారం మొదలయ్యాయి. ఈనెల 5వ తేదీ వరకు జరుగనున్న పోటీలను రాష్ట్ర ఆర్థిక శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు లాంఛనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'శాంతి వనంలో దక్షిణాది రాష్ట్రాలకు చెందిన ప్లేయర్లు ఈ టోర్నీలో బరిలోకి దిగుతున్నారు. నాలుగు రోజుల పాటు జరిగే టోర్నీలో సత్తాచాటేందుకు పట్టుదలతో ఉన్నారు. మెరుగైన మౌలిక వసతులను సద్వినియోగం చేసుకుంటూ ప్రతీ ఒక్కరూ ప్రతిభ చాటాలి' అని అన్నారు. ఈ కార్యక్రమంలో జాతీయ బ్యాడ్మింటన్ కోచ్ గోపీచంద్ తదితరులు పాల్గొన్నారు.



# గాఫ్ ఔట్

**నవోమి ఒసాకా చేతిలో ఓటమి • క్వార్టర్స్‌కు సిన్నర్**

న్యూయార్క్: యూఎస్ ఓపెన్‌లో మరో సంచలనం నమోదైంది. గతంలో నాలుగు సార్లు గ్రాండ్‌స్లామ్స్ గెలిచినా ఇటీవల కాలంలో స్థాయికి తగ్గట్టు ఆడటంలో తడబడుతున్న జపాన్ భామ, 23వ సీడ్‌గా బరిలోకి దిగిన నవోమి ఒసాకా ఈ టోర్నీ ప్రిక్వార్టర్స్‌లో 2023 చాంపియన్ కోకో గాఫ్‌నకు షాకిచ్చి క్వార్టర్స్ చేరింది. సోమవారం అర్ధరాత్రి ఆర్థర్ ఆషే స్టేడియంలో జరిగిన మహిళల సింగిల్స్ నాలుగో రౌండ్ మ్యాచ్‌లో ఒసాకా.. 6-3, 6-2తో మూడో సీడ్ గాఫ్‌ను మట్టికరిపించి 2021 తర్వాత ఈ టోర్నీలో లాస్ట్ 8 దశకు అర్హత సాధించింది. క్వార్టర్స్‌లో ఒసాకా 11వ సీడ్ చెక్ ప్లేయర్ కరోలినా ముచోవాతో తలపడనుంది. మరో పోరులో ఇగా స్వియాటెక్ (పోలండ్) 6-3, 6-1తో అలగ్జాండ్రోవా (రష్యా)ను ఓడించి క్వార్టర్స్ చేరుకుంది. ఆమెతో పాటు అమెరికా అమ్మాయి అమండ అనిస్మొవ సైతం క్వార్టర్స్‌కు ప్రవేశించింది. మహిళల డబుల్స్‌లో అమెరికా టెన్నిస్ దిగ్గజం వీనస్ విలియమ్స్, లైలా ఫెర్నాండెజ్ (కెనడా) ద్వయం 6-3, 6-4తో అలగ్జాండ్రొవ (రష్యా), ఝూంగ్ షువాయ్ (చైనా)ను ఓడించి క్వార్టర్స్‌కు చేరుకుంది.

**. ప్రిక్వార్టర్స్‌కు బాంబ్రీ జోడీ**

పురుషుల డబుల్స్‌లో భారత ఆటగాడు యుకీ బాంబ్రీ, మైఖెల్ వీనస్ జోడీ ప్రిక్వార్టర్స్ చేరింది. పురుషుల డబుల్స్ రెండో రౌండ్‌లో ఈ ఇండో అమెరికన్ ద్వయం 6-1, 7-5తో గొంజాలో ఎస్కోబార్ (ఈక్వెడార్), రేయెస్ వరెల (మెక్సికో)ను ఓడించింది.



### వా క్యా పిక్చర్ హై!

ఒక చిత్రం వెయ్యి పదాలకు సమానం అంటారు! దీన్ని నిజం చేస్తూ యూఎస్ ఓపెన్‌లో ఇటలీ భామ జాస్మిన్ పాలోని అదిరిపోయే ఫ్రేమ్‌లో బందీ అయిపోయింది. ఫొటోగ్రాఫర్ రే జిబిలో తీసిన ఈ ఫొటో టోర్నీకే హైలెట్‌గా నిలిచింది. 'వన్ ఇన్ ఏ మిలియన్' ఇమేజ్‌ను తలపిస్తూ పాలోని ముఖం రాకెట్‌లో అలా అతికినట్లు సరిపోవడం అందరినీ ఆకట్టుకుంటున్నది.

## సిన్నర్ జోరు

పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ యానిక్ సిన్నర్ తుది ఎనిమిదిలోకి చేరుకున్నాడు. ప్రిక్వార్టర్స్‌లో ఈ ఒకటో సీడ్ ఇటలీ కుర్రాడు 6-1, 6-1, 6-1తో అలగ్జాండర్ బబ్లిక్ (కజకిస్థాన్)పై అలవోక విజయం సాధించాడు. మరో మ్యాచ్‌లో లొరెంజో ముసెట్టి (ఇటలీ) 6-3, 6-0, 6-1తో జామె మునర్ (స్పెయిన్)ను చిత్తు చేశాడు. క్వార్టర్స్‌లో సిన్నర్.. తన దేశానికే చెందిన ముసెట్టితో అమీతుమీ తేల్చుకోనున్నాడు. ఫెలిక్స్ అగర్ అలీఅస్సీమ్ (కెనడా), టేలర్ ఫ్రిట్జ్ (అమెరికా) కూడా తమ ప్రత్యర్థులను ఓడించి క్వార్టర్స్ చేరుకున్నారు. క్వార్టర్స్‌లో ఫ్రిట్జ్.. జొకోవిచ్‌తో తలపడనున్నాడు



## దబాంగ్ ఢిల్లీ బోణీ

వైజాగ్: ప్రో కబడ్డీ లీగ్‌లో దబాంగ్ ఢిల్లీ జట్టు బోణీ కొట్టింది. మంగళవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో ఢిల్లీ.. 41-34తో బెంగళూరు బుల్స్‌ను ఓడించి టోర్నీలో శుభారంభం చేసింది. ఆట ఆద్యంతం బెంగళూరుపై ఆధిపత్యం ప్రదర్శించిన ఢిల్లీ.. తొలి అర్ధభాగంలోనే 21-11తో ఆధిక్యంలో నిలిచింది. సెకండాఫ్ ఆరంభంలోనూ బెంగళూరు పుంజుకోలేక చతికిలపడింది. కానీ ఆట మరో పదినిమిషాల్లో ముగుస్తుందనగా ఆ జట్టు వరుస పాయింట్లు సాధించినా దబాంగ్ ఆధిక్యాన్ని తగ్గించిందే తప్ప ఢిల్లీ గెలుపును ఆపలేకపోయింది. ఢిల్లీ సారథి అషు మాలిక్ (15 పాయింట్లు) ఆ జట్టు గెలుపులో కీలకపాత్ర పోషించాడు.

# టీ20లకు స్టార్క్ వీడ్కోలు

• **టెస్టులకే ప్రాధాన్యం**

సిడ్నీ: ఆస్ట్రేలియా దిగ్గజ పేసర్ మిచెల్ స్టార్క్ టీ20 కెరీర్‌కు వీడ్కోలు పలికాడు. 35 ఏండ్ల ఈ పేసర్.. టెస్టులు, వన్డేలలో కెరీర్‌ను కొనసాగించేందుకు గాను టీ20ల నుంచి తప్పుకుంటున్నట్టు తెలిపాడు. మరో ఆరు నెలల్లో భారత్, శ్రీలంక సంయుక్తంగా నిర్వహించాల్సి ఉన్న టీ20 ప్రపంచకప్‌నకు ముందు స్టార్క్ ఈ నిర్ణయం తీసుకోవడం గమనార్హం. పొట్టి ఫార్మాట్‌లో 2012లో అరంగేట్రం చేసి ఆసీస్ తరఫున 65 మ్యాచ్‌లు ఆడిన స్టార్క్.. 7.74 ఎకానమీతో 79 వికెట్లు పడగొట్టాడు. ఈ ఫార్మాట్‌లో అతడు ఆస్ట్రేలియా నుంచి అత్యధిక వికెట్లు తీసిన రెండో బౌలర్ (జంపా 103 మ్యాచ్‌లలో 130 వికెట్లతో మొదటి స్థానం) గా ఉన్నాడు. నవంబర్‌లో ఇంగ్లండ్‌తో మొదలుకాబోయే యాషెస్ సిరీస్, భారత్‌తో టెస్టు సిరీస్‌లకు తోడు 2027 వన్డే ప్రపంచకప్‌లో ఆడేందుకు సన్నద్ధమవుతున్న స్టార్క్.. టీ20ల నుంచి తప్పుకోవాలని నిర్ణయించుకున్నాడు. 'టెస్టులే నా మొదటి ప్రాధాన్యత. టీ20లలో నేను ఆడిన ప్రతి క్షణాన్నీ ఆస్వాదించాను. ముఖ్యంగా 2021 టీ20 వరల్డ్ కప్. ఆ టోర్నీలో టైటిల్ గెలవడం కంటే గ్రూపుగా మేం చాలా ఎంజాయ్ చేశాం' అని స్టార్క్ చెప్పాడు. ఈ ఫార్మాట్‌లో స్టార్క్ చివరిసారిగా 2024 టీ20 వరల్డ్ కప్‌లో ఆడాడు. సుదీర్ఘ కెరీర్‌లో స్టార్క్ ఐదు టీ20 ప్రపంచకప్‌లు ఆడాడు.

**కమిన్స్ దూరం**

అక్టోబర్‌లో న్యూజిలాండ్‌తో జరుగబోయే వన్డే సిరీస్‌తో పాటు ఆ తర్వాత భారత్‌తో ఆడాల్సి ఉన్న సిరీస్‌కు ఆసీస్ వన్డే సారథి పాట్ కమిన్స్ దూరమయ్యాడు. ఈ మేరకు క్రికెట్ ఆస్ట్రేలియా (సీఏ) ఈ విషయాన్ని నిర్ధారించింది. వెన్నునొప్పి కారణంగా అతడు రెండు సిరీస్‌ల నుంచి తప్పుకున్నాడు. రాబోయే యాషెస్ సిరీస్‌కు పూర్తిస్థాయిలో సన్నద్ధమయ్యేందుకే కమిన్స్ ఈ నిర్ణయం తీసుకున్నట్టు సీఏ వర్గాలు తెలిపాయి.





## కొరియాతో కీలక పోరు

రాజ్‌గిర్ (బీహార్): హాకీ ఆసియా కప్‌లో హ్యాట్రిక్ విజయాలతో పూల్ 'ఏ' నుంచి టాపర్‌గా సూపర్-4కు అర్హత సాధించిన భారత జట్టు.. బుధవారం కీలక మ్యాచ్ ఆడనుంది. సూపర్-4 దశలో భారత్.. టోర్నమెంట్‌లో ఐదుసార్లు టైటిల్ గెలిచి అత్యంత విజయవంతమైన జట్టుగా ఉన్న కొరియాతో తలపడనుంది. గ్రూప్ దశలో చైనా, జపాన్, కజకిస్థాన్‌తో విజయాలు భారత్‌లో ఆత్మవిశ్వాసాన్ని నింపి జట్టు ఫుల్ జోష్‌తో ఉంది. కానీ కొరియా మాత్రం గ్రూప్ దశలో మలేషియా చేతిలో ఓడి పూల్ 'బీ' నుంచి రెండో స్థానంతో సరిపెట్టుకుంది. మధ్యాహ్నం మ్యాచ్‌ల కారణంగా వేడి, ఉష్ణోగ్రతలకు కొరియా జట్టు ఒకింత ఇబ్బందులకు లోనై తడబాటుకు గురైంది. కానీ సాయంత్రం జరుగనున్న నేపథ్యంలో ఆ జట్టు భారత్‌కు దీటైన పోటీనిచ్చే అవకాశముంది.

## గెలుపు దిశగా హైదరాబాద్

చెన్నై: తమిళనాడులో జరుగుతున్న బుచ్చిబాబు టోర్నీ సెమీఫైనల్‌లో హైదరాబాద్ గెలుపు దిశగా పయనిస్తున్నది. చెన్నైలో హర్యానాతో జరుగుతున్న మ్యాచ్‌లో హైదరాబాద్.. ప్రత్యర్థి ఎదుట 272 పరుగుల లక్ష్యాన్ని నిర్దేశించింది. అయితే రెండో ఇన్నింగ్స్‌లో హర్యానా మూడో రోజు ఆట ముగిసే సమయానికి 6 పరుగులకే రెండు కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది. హైదరాబాద్ తొలి ఇన్నింగ్స్‌లో 225 రన్స్ చేయగా హర్యానా 208 పరుగులకే కుప్పకూలింది. అనంతరం రెండో ఇన్నింగ్స్‌లో హైదరాబాద్ 254కు ఆలౌట్ అయింది.

## సౌతాఫ్రికా ఘనవిజయం

లీడ్స్: ఇంగ్లండ్ పర్యటనలో దక్షిణాఫ్రికా తొలి వన్డేలోనే అదిరిపోయే విజయాన్ని అందుకుంది. ఆతిథ్య జట్టుతో మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా లీడ్స్ వేదికగా జరిగిన తొలి పోరులో సౌతాఫ్రికా.. 7 వికెట్ల తేడాతో గెలిచింది. తొలుత ఇంగ్లండ్.. మహారాజ్ (4/22), ముల్డర్ (3/33) ధాటికి 24.1 ఓవర్లలో 133కే ఆలౌట్ అయిం ది. ఛేదనను సఫారీలు 24.3 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి దంచేశారు. మార్క్‌రమ్ (86), రికెల్టన్ (31) రాణించారు.

## వాణిజ్య

### టీసీఎస్ ఉద్యోగుల వేతన పెంపు

ముంబై, సెప్టెంబర్ 2: దేశీయ ఐటీ దిగ్గజం టీసీఎస్ ఉద్యోగులకు శుభవార్తను అందించింది. 4.5 శాతం నుంచి 7 శాతం వరకు వేతన పెంపును అమలులోకి తీసుకొచ్చింది. అత్యధిక మంది ఉద్యోగుల వేతనాలు పెంచినట్టు కంపెనీ వర్గాలు వెల్లడించాయి. ఈ విషయంపై ఉద్యోగులకు ఈ-మెయిల్ ద్వారా సమాచారం అందించింది. ప్రస్తుత నెల నుంచే పెరిగిన వేతనాలు అమలులోకి వచ్చాయని తెలిపింది. మార్కెట్ పరిస్థితులు నిరుత్సాహకరంగా ఉండటంతో గత కొన్ని నెలలుగా వాయిదా పడుతూ వచ్చిన వేతన పెంపు ఎట్టకేలకు అమల్లోకి వచ్చాయి.

### దేశీయ మార్కెట్లోకి 116.5 ఇంచుల టీవీ

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: దేశీయ మార్కెట్లోకి అతిపెద్ద టీవీ వచ్చేసింది. ప్రముఖ టెక్నాలజీ సంస్థ వోబ్లీ..116.5 ఇంచుల టెలివిజన్‌ను అందుబాటులోకి తీసుకొచ్చింది.



ప్రస్తుతం మార్కెట్లో లభిస్తున్న టీవీల్లో ఇదే అతిపెద్దది కావడం విశేషం. 100 శాతం క్యూలెడ్ డిస్‌ప్లే+మినీలెడ్ డిస్‌ప్లే తయారైన గూగుల్ 5.0 టీవీ ఆండ్రాయిడ్ 14, 240 వాట్ల స్పీకర్ కలిగివుండటంతో థియేటర్‌లో చూసినట్టుగా ఉండనున్నదని కంపెనీ సీఈవో ఆనంద్ దూబే తెలిపారు. అతిపెద్ద టీవీని తయారు చేయడం ఇబ్బందులతో కూడుకున్నదని, ముఖ్యంగా టెక్నాలజీ పరంగా చాలా జాగ్రత్తలు తీసుకున్నట్టు చెప్పారు. దీంతోపాటు 86 ఇంచులు, 98 ఇంచుల్లో కూడా టీవీని అందుబాటులోకి తీసుకొచ్చింది.

### హైదరాబాద్‌లో యాపిల్ స్టోర్

హైదరాబాద్, సెప్టెంబర్ 2: ఐఫోన్ల విక్రయ సంస్థ యాపిల్..హైదరాబాద్‌లో తన సొంత అవుట్‌లెట్‌ను తెరవబోతున్నది. ఇందుకోసం వేవ్‌రాక్ ఐటీ పార్క్‌లో 64,125 చదరపు అడుగుల ఆఫీస్ స్థలాన్ని లీజుకు తీసుకున్నది. దీంతో మొత్తం లీజు 5 లక్షల చదరపు అడుగులకు చేరుకున్నది. ఈ స్టోర్‌కు నెలకు రూ.80.15 లక్షల అద్దెను ఐదేండ్ల పాటు చెల్లించనున్నది. ఈ స్టోర్‌లో కంపెనీకి సంబంధించిన అన్ని రకాల ఉత్పత్తులను విక్రయించనున్నది.



*యావత్తు ప్రపంచాన్ని కరోనా కుదిపేస్తున్న వేళ రాష్ట్రాభివృద్ధి కోసం అవిశ్రాంతంగా మేము చేసిన ప్రయత్నాలు ఫలించాయి. కిటెక్స్ అధినేత సాబు జాకబ్‌తో వాట్సాప్‌లో చేసిన చాటింగ్ ఇంకా నాకు గుర్తుంది. అందుకే నేడు వరంగల్‌లో కిటెక్స్ వాణిజ్య ఉత్పత్తిని ప్రారంభించడం ఎంతో ప్రత్యేక అనుభూతినిస్తున్నది. ఇది నిజంగా శుభవార్త. దీనివల్ల తెలంగాణలోని యువతకు వందలాది ఉద్యోగాలొస్తాయి. కిటెక్స్ గ్రూప్ ఇలాగే ఎదగాలి. మరెన్నో విజయాలను అందుకోవాలని నేను మనస్ఫూర్తిగా కోరుకుంటున్నాను. కేసీఆర్ మానసపుత్రిక కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్. ఇప్పుడది దేశంలోనే అతిపెద్ద టెక్స్‌టైల్ పార్క్ కావడం గర్వంగా ఉన్నది.*

*- కే తారక రామారావు, బీఆర్‌ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు*

### ఇదీ.. కిటెక్స్ ప్రయాణం

**ఒప్పందం: సెప్టెంబర్ 18, 2021. తాజ్‌కృష్ణ, హైదరాబాద్**

**వరంగల్ యూనిట్ శంకుస్థాపన : కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్, 2022**

# కాకతీయపురికి కిటెక్స్ సిందూరం

**ఫలిస్తున్న కేసీఆర్ కల**

**మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో ప్రారంభమైన ఉత్పత్తి**

వరంగల్, సెప్టెంబర్ 2 (నమస్తే తెలంగాణ): వరంగల్ వస్త్రనగరికి కిటెక్స్ సిందూరమై భాసిల్లనున్నది. కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్ (కేఎంటీపీ)లో కేసీఆర్ ప్రభుత్వం నాటిన మొక్క ఉత్పత్తి ఫలాలను అందిస్తున్నది. రోజుకు 1.1 మిలియన్ (11లక్షల) కిడ్స్ రెడీమేడ్ వస్త్రాలను ఉత్పత్తి చేయాలనే లక్ష్యంతో ముందుకు సాగుతున్న కిటెక్స్ వరంగల్ యూనిట్‌లో వాణిజ్య ఉత్పత్తుల తయారీ ప్రారంభమైందని సంస్థ వర్గాలు చెప్తున్నాయి. అజంజాహి మిల్లునే కాదు.. దాని భూములను అమ్ముకున్న సమైక్య పాలకుల కుట్రలకు వరంగల్ వస్త్రనగరి విలవిలలాడింది. 'మన రాష్ట్రంలో మన పరిశ్రమలను నెలకొల్పుకుందాం.. అజంజాహి మిల్లును తలదన్నే వస్త్రనగరిని నెలకొల్పి పూర్వవైభవాన్ని తెస్తాం' అని బీఆర్‌ఎస్ పార్టీ అధినేత కేసీఆర్ అనేక సందర్భాల్లో ప్రకటించిన విషయం తెలిసిందే. తెలంగాణ ఆవిర్భవించిన తర్వాత అన్నమాట ప్రకారం వరంగల్ జిల్లా సంగెం, గీసుగొండ మండలాల్లో దాదాపు 1,300 ఎకరాల్లో కేఎంటీపీని నెలకొల్పారు. కేఎంటీపీ శంకుస్థాపన చేసిన రోజే దక్షిణ కొరియాకు చెందిన యంగ్ వన్ కంపెనీతో ఎంవోయూ కుదిరింది. ఫామ్‌టు ఫ్యాబ్రిక్ నినాదంతో నాడు కేసీఆర్ ప్రభుత్వం దేశంలోనే అతిపెద్ద పరిశ్రమగా కేఎంటీపీని రూపకల్పన చేసిన సంగతి విదితమే. గణేషా, గణేషా ఇన్ఫోటెక్ కంపెనీలు ఇప్పటికే తమ ఉత్పత్తులు ప్రారంభించి ముందుకు సాగుతున్నాయి. యంగ్ వన్ కంపెనీ త్వరలోనే ఉత్పత్తులను ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నది. ఈ క్రమంలో కిటెక్స్ తమ తొలి యూనిట్‌లో వాణిజ్య ఉత్పత్తులను ప్రారంభించడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.



*వరంగల్ జిల్లా గీసుగొండ-సంగెం మండలాల పరిధిలోని కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో ఏర్పాటు చేసిన కిటెక్స్ గార్మెంట్స్ యూనిట్*

### కిడ్స్‌వేర్‌లో టాప్ కిటెక్స్

*కిడ్స్‌వేర్ తయారీ రంగంలో ప్రపంచంలోనే రెండో అతిపెద్ద కంపెనీగా కిటెక్స్‌కు పేరున్నది. 50 ఏండ్ల సుదీర్ఘ చరిత్ర ఉన్న ఈ కంపెనీని కేరళకు చెందిన ఎంసీ జాకబ్ 1968లో ఎర్నాకుళం జిల్లా కిజకంబళంలో 'అన్నా కిటెక్స్ గ్రూప్' పేరిట స్థాపించారు. అల్యూమినియం ఉత్పత్తులతో ప్రారంభమై మసాలాలు, టెక్స్‌టైల్స్, స్కూల్, ట్రావెల్ బ్యాగ్స్ తదితర రంగాల్లోకి విస్తరించగా 1992లో ఎంసీ జాకబ్ కొడుకు సాబు ఎం జాకబ్ 'కిటెక్స్ గార్మెంట్స్'ను స్థాపించారు. 'లిటిల్ స్టార్' బ్రాండ్ పేరుతో చిన్న పిల్లల దుస్తులను తయారు చేస్తున్నది. కంపెనీ ఉత్పత్తుల్లో 90 శాతం అమెరికా, యూరోపియన్ యూనియన్ దేశాలకు ఎగుమతి అవుతున్నాయి.*


### కిటెక్స్ వచ్చిందిలా?

నాటి కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేకించి పరిశ్రమలు, ఐటీ శాఖ మంత్రి కేటీఆర్ చూపిన చొరవతోనే తాము తెలంగాణలో పరిశ్రమను నెలకొల్పుతున్నామని, లేకపోతే తాము కార్యకలాపాలు ప్రారంభించేవాళ్లం కాదని కిటెక్స్ మేనేజింగ్ డైరెక్టర్ సాబు ఎం జాకబ్ కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్క్‌లో యూనిట్ శంకుస్థాపన (2022 మే, 7) సందర్భంగా, అంతకుముందు ఒప్పందం కుదుర్చుకున్న సమయంలో హైదరాబాద్‌లోనూ స్పష్టం చేశారు. నిజానికి కిటెక్స్ గ్రూప్ కొచ్చిలో రూ.3,500 కోట్లతో మెగా ప్రాజెక్టును స్థాపించేందుకు 2020 జనవరిలో కేరళ ప్రభుత్వంతో ఎంవోయూ కుదుర్చుకున్నది. అయితే అక్కడి ప్రభుత్వం పూర్తి స్థాయిలో సహకరించకపోవడంతో ఆ పెట్టుబడిని ఇతర రాష్ట్రాలకు తరలిస్తామని 2021 జూలై మొదట్లో కంపెనీ ప్రకటించింది. దీంతో కర్ణాటక, తమిళనాడు, ఏపీ సహా దాదాపు 15 రాష్ట్రాలు కిటెక్స్‌ను సంప్రదించాయి. కిటెక్స్‌ను ఒప్పించడంలో నాడు కేటీఆర్ ప్రదర్శించిన మెరుపు వేగం, సమయస్ఫూర్తి కీలకపాత్ర పోషించాయి. కేరళ నుంచి కిటెక్స్ కంపెనీ తమ పెట్టుబడులను ఉపసంహరించుకుంటున్నదని తెలిసి జాకబ్‌తో సంప్రదింపులు జరిపారు. 2021 జూలై 9న హైదరాబాద్‌కు రప్పించారు. ఐటీసీ కాకతీయ హోటల్లో కేటీఆర్ వారితో సమావేశమై పవర్ పాయింట్ ప్రజెంటేషన్ చేశారు. తెలంగాణలో నిపుణులైన మానవ వనరులు, టెక్స్‌టైల్ రంగ అభివృద్ధికి కేసీఆర్ ప్రభుత్వం చేస్తున్న కృషి, రాష్ట్రంలో సాగవుతున్న నాణ్యమైన పత్తి తదితర అంశాలను వివరించారు. కంపెనీ ప్రతిపాదిస్తున్న పెట్టుబడికి టీఎస్ ఐపాస్ నిబంధనల ప్రకారం మెగా ప్రాజెక్ట్ హోదా లభిస్తుందని, రాయితీలు, ప్రభుత్వ సహకారం ఉంటుందని హామీ ఇచ్చారు. చివరకు 'కాకతీయ మెగా టెక్స్‌టైల్ పార్కులో కేసీఆర్ ప్రభుత్వం కల్పించిన సౌకర్యాలను ప్రత్యక్షంగా పరిశీలించండి.. అందుకోసం హెలికాప్టర్‌ను ఏర్పాటు చేస్తాం. చూసి వచ్చాకే మరోసారి కూర్చుందాం' అని కిటెక్స్ బృందాన్ని హైదరాబాద్ నుంచి వరంగల్‌కు పంపించారు. కేటీఆర్ సూచనకు అనుగుణంగా ఆ బృందం టెక్స్‌టైల్ పార్క్‌ను పరిశీలించింది. తిరిగి హైదరాబాద్‌లోని ప్రగతిభవన్‌కు నేరుగా వెళ్లారు. తమ సంస్థను తెలంగాణకు తెప్పించేందుకు కేసీఆర్ ప్రభుత్వం చూపిన చొరవ, శ్రద్ధకు కిటెక్స్ కంపెనీ బృందం ఫిదా అయింది. తెలంగాణలో తాము పెట్టుబడులు పెడతామని ప్రకటించింది.

# లగ్జరీ ఈవీల ధరలకు రెక్కలు

**పన్ను పెంచాలని జీఎస్టీ కమిటీ సిఫారసు**

**టెస్లా తదితర బడా సంస్థల అమ్మకాలపై ప్రభావం**



న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: లగ్జరీ విద్యుత్తు ఆధారిత వాహనాల (ఈవీ)పై భారీగా పన్ను పెంచాలని వస్తు, సేవల పన్ను (జీఎస్టీ) కమిటీ సిఫారసు చేసినట్టు ఓ ప్రభుత్వ డాక్యుమెంట్ ప్రకారం తెలుస్తున్నది. రూ.20 లక్షల నుంచి రూ.41 లక్షల వరకు ధర కలిగిన ఈవీలపై జీఎస్టీని 5 శాతం నుంచి 18 శాతానికి పెంచాలని, రూ.41 లక్షలకుపైగా ధర కలిగిన ఈవీలపై 28 శాతం జీఎస్టీ వేయాలని సదరు ప్యానెల్ సూచించినట్టు సమాచారం. అయితే కొత్త జీఎస్టీ విధానంలో 28 శాతం స్లాబును తొలగించాలన్న యోచన ఉండటంతో.. కమిటీ సిఫారసులకు ఆమోదం లభిస్తే రూ.41 లక్షలకుపైగా ధర కలిగిన ఈవీలు 40 శాతం స్లాబులోకి వెళ్లడం ఖాయంగా కనిపిస్తున్నది. దీంతో దేశీయ మార్కెట్‌లో టెస్లా, మెర్సిడెస్ బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడీ, బీవైడీ తదితర ఈవీల తయారీ సంస్థల అమ్మకాలు పెద్ద ఎత్తునే ప్రభావితమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. పైగా ప్రస్తుతం మెజారిటీ కంపెనీల వాహనాలన్నీ భారత్‌లో కంటే విదేశాల్లో తయారై దేశీయ మార్కెట్‌లోకి దిగుమతి అవుతున్నవే. ఈ క్రమంలో పన్ను పోటు తప్పదన్న అభిప్రాయాలు పరిశ్రమ వర్గాల నుంచి వినిపిస్తున్నాయి. కాగా, బుధ, గురువారాల్లో జీఎస్టీ కౌన్సిల్ సమావేశం అవుతున్నది. కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ అధ్యక్షతన ఈ భేటీ జరుగుతుంది. ఈ సందర్భంగా స్లాబుల తగ్గింపు, ఆయా వస్తూత్పత్తులపై పన్ను రేట్ల సవరణ తదితర కీలక అంశాలపై చర్చించి ఓ నిర్ణయం తీసుకోవచ్చని చెప్తున్నారు. ప్రస్తుతం దేశీయ ఎలక్ట్రిక్ కార్ మార్కెట్‌లో టాటా మోటర్స్ వాటా 40 శాతంగా ఉన్నది. ఆ తర్వాత మహీంద్రా 18 శాతంతో రెండో స్థానంలో ఉన్నది. బీవైడీ, బెంజ్, బీఎండబ్ల్యూ, ఆడీ తదితర సంస్థలన్నీ ఆ తర్వాత ఉండగా, టెస్లా ఇప్పుడిప్పుడే మార్కెట్‌లోకి ప్రవేశిస్తున్నది. నిజానికి అధిక పన్నులు వేస్తున్నారనే ఎలాన్ మస్క్.. భారతీయ మార్కెట్‌కు ఇన్నాళ్లూ టెస్లాను దూరం పెట్టారు. అయితే కేంద్రం నుంచి భరోసా రావడంతో ఎట్టకేలకు ఇక్కడ బుకింగ్స్‌ను మొదలు పెట్టారు. ఈ నేపథ్యంలో జీఎస్టీ పెంపు ప్రతిపాదనలు ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నాయి.

### పసిడి పరుగు

న్యూఢిల్లీ, సెప్టెంబర్ 2: పసిడి పరుగులు పెడుతున్నది. రోజుకొక చారిత్రక గరిష్ఠ స్థాయిని తాకుతున్న విలువ మరో శిఖరానికి చేరుకున్నది. వరుసగా ఏడు రోజులుగా పెరుగుతూ వచ్చిన ధర మంగళవారం పదిగ్రాముల ధర మరో రూ.400 ఎగబాకి రూ.1.06 లక్షలకు చేరుకున్నది. అమెరికా ప్రతీకార సుంకాలు విధించడంతో మదుపరులు తమ పెట్టుబడులను సురక్షితమైన అతి విలువైన లోహాల వైపు మళ్లించడంతో వీటి ధరలు భారీగా పుంజుకుంటున్నాయి. అలాగే 99.5 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల పుత్తడి ధర అంతే పెరిగి రూ.1,05, 200 పలికింది. గడిచిన ఏడు రోజుల్లో బంగారం రూ.5,900 పెరిగినట్టు అయింది. అలాగే ఈ ఏడాది ఇప్పటి వరకు 34.35 శాతం ఎగబాకింది. డిసెంబర్ 31, 2024న రూ.78,950 స్థాయిలో ఉన్న తులం ధర ప్రస్తుతం రూ.1.06 లక్షల స్థాయికి చేరుకున్నది. మరోవైపు, కిలో వెండి రూ.1,26, 100 పలికింది.

# చివరిగంటలో అమ్మకాలు

**భారీగా నష్టపోయిన స్టాక్ మార్కెట్లు**

ముంబై, సెప్టెంబర్ 2: దేశీయ స్టాక్ మార్కెట్ల ప్రారంభ లాభాలు ఆవిరైపోయాయి. చివరి గంటలో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడంతో సూచీలు నష్టాల్లోకి జారుకున్నాయి. జీఎస్టీ కౌన్సిల్ సమావేశాల నేపథ్యంలో బ్యాంకింగ్, వాహన రంగ షేర్లు తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. ఫలితంగా ప్రారంభంలో 700 పాయింట్లకు పైగా పెరిగిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్‌కు అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన ప్రతికూల సంకేతాలు నష్టాల్లోకి నెట్టింది. చివరకు మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 206.61 పాయింట్లు కోల్పోయి 80,157.88 వద్ద ముగిసింది. మరో సూచీ నిఫ్టీ 45.45 పాయింట్లు కోల్పోయి 24,579.60 వద్ద స్థిరపడింది. సూచీల్లో మహీంద్రా అండ్ మహీంద్రా, ఏషియన్ పెయింట్స్, కొటక్ మహీంద్రా బ్యాంక్, ఐసీఐసీఐ బ్యాంక్, టాటా మోటర్స్, ఎల్‌అండ్‌టీ, ట్రెంట్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్, భారతీ ఎయిర్‌టెల్, యాక్సిస్ బ్యాంక్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, ఎస్బీఐ, మారుతి, ఇన్ఫోసిస్ షేర్లు నష్టపోయాయి. కానీ, పవర్‌గ్రిడ్, ఎన్‌టీపీసీ, టాటా స్టీల్, హెచ్‌యూఎల్, రిలయన్స్, బీఈఎల్, టెక్ మహీంద్రా, ఐటీసీ, టీసీఎస్ షేర్లు లాభాల్లో ముగిశాయి. రంగాలవారీగా చూస్తే బ్యాంకింగ్, టెలికం, ఆర్థిక సేవలు, టెక్నాలజీ, కన్జ్యూమర్ డ్యూరబుల్ రంగ షేర్లు నష్టపోగా..పవర్, యుటిలిటీ, ఎఫ్‌ఎంసీజీ, మెటల్, రియల్టీ, ఎనర్జీ రంగ షేర్లు లాభాల్లో ముగిశాయి.

**కొనసాగుతున్న రుపీ పతనం**

దేశీయ కరెన్సీ మరింత బలహీనపడింది. ఫారెక్స్ మార్కెట్లో డాలర్‌కు అనూహ్యంగా డిమాండ్ నెలకొనడంతో రూపాయి బక్కచిక్కుతున్నది. ఫారెక్స్ మార్కెట్ ముగిసే సమయానికి డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ 5 పైసలు కోల్పోయి రికార్డు స్థాయి 88.15కి పతనమైంది.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, H.Nos. 9-87/3, 9-87/1, Adj to Jenvi Conventions, Tumkunta, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.